గురువారం
6•6•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 8 • సంచిక 342
• పేజీలు : 16 + 16

8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

NEET 2019లో
100 లోపు
33
1000 లోపు
144
నారాయణ





## మాతో పెట్టుకుంటే
# చూరచూర చేస్తాం

బీజేపీని హెచ్చరించిన మమత

**కోల్‌కతా:** లోక్‌సభ ఎన్నికల నాటి నుంచి మొదలైన మాటల యుద్ధం పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీకి, బీజేపీకి మధ్య నడుస్తూనే ఉన్నది. తాజాగా మమత మాట్లాడుతూ 'మాతో పెట్టుకుంటే చూరచూర చేస్తాం. ఇదే మా నినాదం' అంటూ పరోక్షంగా బీజేపీని హెచ్చరించారు. బీజేపీ నాయకులు తరుచుగా జైశ్రీరాం అని నినదిస్తూ రాజకీయాలకు మతం రంగు పులుముతున్నారని ఆరోపించారు. బుధవారం రంజాన్ పండుగను పురస్కరించుకొని కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 'త్యాగానికి మారుపేరు హిందువులు. సమైక్యతకు చిహ్నం ముస్లింలు. ప్రేమానురాగాలకు నిదర్శనం క్రైస్తవులు. సిక్కులు బలిదానాలకు పెట్టింది పేరు. ఇది భారత సంస్కృతి. ఈ సంస్కృతి, సంప్రదాయాలను మేము కాపాడుకుంటాం' అని తెలిపారు.

**తృణమూల్ కార్యకర్త దారుణ హత్య**

మంగళవారం రాత్రి 7.30 గంటలకు ఉత్తర కోల్‌కతాలోని నిమ్‌తా ప్రాంతంలో టీఎంసీ కార్యకర్త దారుణహత్యకు గురయ్యారు. టీఎంసీ కార్యకర్త నిర్మల్ కుందూ (35) ఓ చాయ్ హోటల్ వద్ద నిల్చొని స్థానికులతో మాట్లాడుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తుపాకీతో కాల్పులు జరిపి పారిపోయారు. దీంతో నిర్మల్ కుప్పకూలారు. దవాఖానకు తీసుకెళ్తుండగా ప్రాణాలు కోల్పోయారు. ఈ హత్య వెనుక బీజేపీ హస్తమున్నదని టీఎంసీ ఆరోపించింది.

### 8న కేరళకు నైరుతి

**న్యూఢిల్లీ:** నైరుతి రుతుపవనాలు మరో రెండు రోజులు ఆలస్యం కానున్నాయి. సాధారణంగా జూన్ ఒకటో తేదీనే కేరళను తాకాల్సిన రుతుపవనాలు ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఇంతవరకు ముందుకు సాగడం లేదు. ఈ నెల 8 నాటికి రుతుపవనాలు కేరళను తాకేందుకు పరిస్థితులు అనుకూలించవచ్చని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం తెలిపింది. వాస్తవానికి రుతుపవనాలు గురువారం నాటికి భారత్‌ను తాకవచ్చని ఐఎండీ తొలుత అంచనా వేసింది. అయితే అవి ముందుకు సాగేందుకు తగిన వాతావరణ పరిస్థితులు లేవనితాజాగా తెలిపింది. వచ్చే మూడు, నాలుగు రోజుల్లో ఈశాన్య రాష్ట్రాల వైపు రుతుపవనాలు ముందుకు సాగొచ్చని పేర్కొంది.

# ఘనంగా ఈద్

రంజాన్ సందర్భంగా పోటెత్తిన మసీదులు, ఈద్గాలు

శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి, ప్రధాని

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈదుల్ ఫితర్‌ను పురస్కరించుకొని బుధవారం లక్షల సంఖ్యలో ముస్లింలు మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెల రోజుల పాటు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు కఠోర ఉపవాసాన్ని ఆచరించిన ముస్లింలు ఈదుల్‌ఫితర్‌తో వాటిని ముగించారు. ఢిల్లీలోని చారిత్రక జామా మసీదు జనంతో పోటెత్తింది. జమ్ముకశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లోని హజ్రత్‌బల్ పుణ్యక్షేత్రంలో కూడా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ ఢిల్లీలోని దర్గా పంజా షరీఫ్‌లో ప్రార్థనలు చేశారు. వ్యక్తిగత పర్యటనపై భారత్‌కు వచ్చిన పాకిస్థాన్ విదేశాంగ శాఖ కార్యదర్శి సొహెయిల్ మహమూద్ జామా మసీదులో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. రంజాన్‌ను పురస్కరించుకొని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీ ముస్లిం ప్రజానీకానికి శుభాకాంక్షలు తెలిపారు.



బుధవారం ఢిల్లీలోని జామా మసీదులో ముస్లింల ప్రార్థనలు

**కశ్మీర్‌లోయలో ఘర్షణలు**

జమ్ముకశ్మీర్‌లో పలు చోట్ల రంజాన్ సందర్భంగా ఘర్షణలు చోటుచేసుకున్నాయి. శ్రీనగర్ పాతబస్తీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో భద్రతాబలగాలపై నిరసనకారులు రాళ్లు రువ్వారు. నౌహట్టా ప్రాంతంలో ముఖానికి మాస్కులు ధరించిన ఆందోళనకారులు జైషే మహమ్మద్ అధిపతి మసూద్ అజర్, హతమైన జైషే కమాండర్ జకీర్ మూసాకు మద్దతుగా బ్యానర్లు ప్రదర్శిస్తూ నిరసనకు దిగారు. పుల్వామా జిల్లా లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఓ మహిళ మృతిచెందింది.

8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



## 10% తగ్గిన హెచ్1బీ
# వీసాల జారీ

ట్రంప్ ప్రభుత్వ కఠిన విధానాల ఫలితం

2017లో 3,73,400 హెచ్1బీ వీసాలు జారీ చేయగా..

2018లో 3,35,000 వీసాలకే ఆమోదం



**వాషింగ్టన్, జూన్ 5:** విదేశీ నిపుణులు అమెరికాలో ఉద్యోగం చేసేందుకు ఉపకరించే హెచ్1బీ వీసాల ఆమోదం 2018లో 10 శాతం తగ్గింది. వర్క్ వీసా ప్రోగ్రామ్‌పై ట్రంప్ ప్రభుత్వ కఠిన విధానాలే ఇందుకు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. హెచ్1బీ వీసా అనేది నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా. దీం తో అమెరికా కంపెనీలు విదేశీ నిపుణుల నియా మకానికి వీలవుతుంది. హెచ్1బీ వీసాదారుల్లో అత్యధికులు భారతీయులే. 2018లో కొత్తవి, రెన్యువల్ కలిపి 3.35 లక్షల వీసాలకు యూఎస్ పౌరసత్వ, వలస సేవల (యూఎస్‌సీఐఎస్) విభాగం ఆమోదం తెలిపింది. 2017లో ఈ సంఖ్య 3,73,400 కావడం గమనార్హం. ఒక్క ఏడాదిలో హెచ్1బీ వీసాలు దాదాపు 10% తగ్గాయి. 2017లో హెచ్1బీ అప్రూవల్(ఆమోద) రేటు 93% కాగా, 2018 లో అది 85 శాతానికి తగ్గిందని యూఎస్‌సీఐఎస్ వార్షిక నివేదికలో వెల్లడైంది. 2018లో 3,96,300 హెచ్1బీ దరఖాస్తులను, 2017లో 4,03,300 దరఖాస్తులను పరిశీలించింది. 2018లో 8.50 లక్షల నాచురలైజేషన్ దరఖాస్తులను పరిష్కరించింది. హెచ్1బీ వీసాల జారీ తగ్గుదలకు ట్రంప్ ప్రభుత్వ కఠిన నిబంధనలే కారణమని వలస విధాన సంస్థ విశ్లేషకులు సారా పీర్స్ అన్నారు. అమెరికన్లకు ఉద్యోగాలు ఇవ్వకుండా కంపెనీలు హెచ్1బీ వీసాలను దుర్వినియోగం చేస్తున్నాయని విమర్శిస్తున్న ట్రంప్.. ఆ మేరకు హెచ్1బీ నిబంధనలను కఠినతరం చేశారు.

**600 మంది ఉద్యోగులకు వేతన బకాయిలు**

సుమారు 600 మంది హెచ్1బీ ఉద్యోగులకు మిషిగాన్‌లోని ట్రాయ్ కేంద్రంగా పనిచేస్తున్న పాపులస్ గ్రూప్ అనే కంపెనీ 11 లక్షల డాలర్ల వేతన బకాయిలను ఇచ్చేందుకు అంగీకరించింది. వీరిలో భారతీయ ఐటీ నిపుణులే అధికం. వీరికి సరైన వేతనాలివ్వడంలో విఫలమైనట్లు 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ లేబర్స్ వేజ్ అండర్ అవర్ డివిజన్' విచారణలో తేలింది.

# నీట్ టాపర్ నళిన్

## రాజస్థాన్ విద్యార్థికి 701 మార్కులు

నీట్‌లో 56.27 శాతం మంది విద్యార్థులు పాస్

ఉత్తీర్ణతలో బాలికలు, ర్యాంకుల్లో బాలురది పైచేయి



బుధవారం జైపూర్‌లో నీట్ టాపర్ నళిన్ ఖండేల్వాల్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

**న్యూఢిల్లీ, జూన్ 5:** దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్, డెంటల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) 2019 ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. రాజస్థాన్ వాసి నళిన్ ఖండేల్వాల్ టాప్ ర్యాంక్ సాధించగా, బాలికల విభాగంలో తెలంగాణ విద్యార్థిని మాధురి రెడ్డి టాప్ ర్యాంకర్‌గా నిలిచింది. మొత్తం 720 మార్కులకు ఖండేల్వాల్‌కు 701 మార్కులొచ్చాయి. మాధురి రెడ్డి 695 మార్కులతో (ఓవరాల్ ర్యాంక్) 7వ స్థానంలో నిలిచింది. ఢిల్లీ వాసి భావిక్ బన్సల్ రెండో ర్యాంక్, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అక్షత్ కౌశిక్ మూడో ర్యాంక్ సాధించారు. వీరిద్దరికీ 700 చొప్పున మార్కులు వచ్చాయి. బయాలజీలో ఎక్కువ మార్కులు రావడంతో బన్సల్‌కు రెండో ర్యాంక్ ఇచ్చారు.దివ్యాంగుల విభాగంలో రాజస్థాన్ వాసి భేరారామ్ టాపర్‌గా నిలిచాడు. ఆయనకు 604 మార్కులొచ్చాయి. బాలికలే ఎక్కువగా ఉత్తీర్ణులైనా ర్యాంకుల్లో బాలురదే పైచేయి. నీట్–2019 పరీక్షకు 14,10,755 మంది హాజరవ్వగా, 7,97,042 మంది (56.27%) ఉత్తీర్ణులయ్యారు. 154 నగరాల్లో 11 భాషల్లో 2,546 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఐదుగురు హిజ్రాల్లో ముగ్గురు అర్హత సాధించారు. ఒడిశాలో ఫొని తుఫాన్, కర్ణాటకలో రైలు ఆలస్యం కావడంతో మే 5న పరీక్ష రాయలేకపోయిన ఆయా ప్రాంతాల విద్యార్థులకు తిరిగి అదే నెల 20న మళ్లీ పరీక్ష జరిపారు. దీంతో ఫలితాలు ఆలస్యమవుతాయని భావించినా.. ముందుగా పేర్కొన్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఫలితాలను విడుదల చేసింది. తెలంగాణలో 33,044 మంది (68.88%) ఉత్తీర్ణులయ్యారు. ఈసారి ప్రశ్నపత్రం సులభంగా ఉన్నదని చెప్తుండటంతో జనరల్ క్యాటగిరీ విద్యార్థుల కటాఫ్ మార్కులను 134గా ఖరారు చేశారు. అర్హత సాధించిన విద్యార్థుల్లో 3.75 లక్షల మంది ఓబీసీలు, 2.8 లక్షల మంది జనరల్ క్యాటగిరీ వారున్నారు. ఎస్సీ విద్యార్థులు లక్ష మంది, ఎస్టీలు 35 వేల మంది నీట్‌లో అర్హత సాధించినట్టు ఎన్‌టీఏ తెలిపింది. ఆలిండియా కోటా, సెంట్రల్ యూనివర్సిటీలు, ఈఎస్‌ఐసీ, ఏఎఫ్‌ఎంసీ, బీహెచ్‌యూ, ఏఎంయూలలోని 15 శాతం సీట్ల భర్తీకి కేంద్రానికి చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్‌ఎస్) కౌన్సెలింగ్ నిర్వహిస్తుంది.

**నీట్‌లో ఫెయిల్.. విద్యార్థిని ఆత్మహత్య**

తమిళనాడులోని తిరుపూర్ విద్యార్థిని రీతూ శ్రీ (17) నీట్‌లో ఫెయిల్ కావడంతో బలవన్మరణానికి పాల్పడింది. నీట్ ఫలితాలు వెలువడిన వెంటనే తాను ఉత్తీర్ణత సాధించలేదని తెలిసి ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు చెప్పారు. 12వ తరగతిలో ఆమెకు 490 మార్కులు వచ్చాయని, దీంతో నీట్‌లో కూడా సునాయాసంగా ఉత్తీర్ణత సాధించగలనని ఆ బాలిక భావించిందని పోలీసులు పేర్కొన్నారు.


### తల్లిదండ్రులు, టీచర్ల ప్రోద్బలంతోనే: ఖండేల్వాల్

తన తల్లిదండ్రులు, టీచర్ల ప్రోద్బలంతోనే టాప్ ర్యాంక్ సాధించానని నళిన్ ఖండేల్వాల్ పేర్కొన్నాడు. రాజస్థాన్‌లోని సికార్ జిల్లా వాసి నళిన్ నీట్‌లో టాప్ ర్యాంక్ సాధించాడు. ఆయన తల్లిదండ్రులు డాక్టర్లు కాగా, సోదరుడు కూడా ఎంబీబీఎస్ చదువుతున్నాడు. రెండేండ్లు పూర్తిగా తాను చదువుపైనే దృష్టి పెట్టానని, తల్లిదండ్రులు, సోదరుడు, టీచర్లు ఎంతో తనకు సహకరించారని నళిన్ తెలిపాడు. రోజుకు 7 నుంచి 8 గంటలు చదివానన్నాడు. ఈ రెండేండ్లు తాను సోషల్ మీడియాకు, స్మార్ట్ ఫోన్స్‌కు దూరంగా ఉన్నానన్నాడు. నళిన్‌తోపాటు మరో ముగ్గురు రాజస్థాన్ విద్యార్థులు కూడా మొదటి పది ర్యాంకుల్లో నిలిచారు. తమ సంస్థలో చదువుకున్న నళిన్ మొదటి ర్యాంక్ సాధించగా, మరో ఇద్దరు రాజస్థాన్ విద్యార్థులు కూడా ఐదవ, పదవ ర్యాంకులను పొందారని జైపూర్‌లోని అలెన్ కెరియర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ బ్రజేశ్ మహేశ్వరి తెలిపారు.

### ఒత్తిడిని తట్టుకొనేందుకు కామెడీ వీడియోలు చూశా: బన్సల్



దీర్ఘకాలం చదువడంతో ఏర్పడే ఒత్తిడి నుంచి బయట పడేందుకు తాను యూట్యూబ్‌లో కామెడీ వీడియోలు చూసేవాడినని నీట్ రెండో ర్యాంక్ సాధించిన భవిక్ బన్సల్ తెలిపాడు. ఢిల్లీ నుంచి టాపర్‌గా నిలిచిన బన్సల్ తాను మొదటి పది ర్యాంకుల్లో ఉంటానని ఊహించానని, కానీ రెండో ర్యాంక్ వస్తుందని అనుకోలేదన్నాడు. తాను ఇంటివద్దనే పరీక్షకు సిద్ధపడ్డానని, తన తల్లిదండ్రులు తనను ప్రోత్సహించారని తెలిపాడు.



### హాస్యనటుడు దినయార్ కన్నుమూత

**న్యూఢిల్లీ:** ప్రముఖ హాస్య నటుడు దినయార్ కాంట్రాక్టర్ (79) బుధవారం ఉదయం ముంబైలో కన్నుమూశారు. వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలతోనే మరణించినట్లు కుటుంబసభ్యులు చెప్పారు. చోరీ చోరీ చుప్‌కే చుప్‌కే, బాద్‌షా, కిలాడీ సినిమాల్లో ఆయన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ ఏడాది కేంద్రం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. దినయార్ మృతిపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. తన నటనతో ఎంతో మంది ముఖాల్లో చిరునవ్వులు పూయించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.

## పాక్ మీదుగా
# మొదలైన రాకపోకలు



- మూడున్నర నెలల తర్వాత భారత్‌పై ఆంక్షల తొలిగింపు
- సోమవారం అర్ధరాత్రి ప్రయాణించిన మొదటి విమానం
- ప్రత్యక్షంగా పర్యవేక్షించిన పాకిస్థాన్ సీఏఏ డైరెక్టర్

**న్యూఢిల్లీ:** దాదాపు మూడున్నర నెలల తర్వాత పాకిస్థాన్ గగనతలం మీదుగా భారత విమానాల రాకపోకలు మొదలయ్యాయి. సోమవారం అర్ధరాత్రి ఇండిగో విమానం దుబాయ్ నుంచి పాక్ గగనతలం మీదుగా ఢిల్లీకి చేరుకున్నది. పాక్ సివిల్ ఏవియేషన్ అథారిటీ (సీఏఏ) డైరెక్టర్ ప్రత్యక్షంగా ఈ ఘట్టాన్ని పర్యవేక్షించారు. ఫిబ్రవరి 27న భారత వాయుసేన యుద్ధవిమానాలు బాలాకోట్‌పై దాడి చేశాక పాక్ తమ గగనతల మార్గాలను మూసివేసింది. కొన్ని రోజుల తర్వాత విదేశాల విమానాల రాకపోకలకు అనుమతించినా.. భారత విమానాలపై నిషేధం కొనసాగించింది. తిరిగి సోమవారం సాయంత్రం ఒక మార్గంలో ఆంక్షలను సడలించింది. ఈ మార్గాన్ని పూర్తిగా అందుబాటులోకి తెచ్చేముందు 'టెస్ట్‌ఫ్లైట్' నిర్వహించాలని నిర్ణయించింది. ఒక విమానాన్ని నడుపాలని భారత్‌కు సూచించింది. ఈ మేరకు ఇండిగో సంస్థకు చెందిన దుబాయ్–ఢిల్లీ (6ఈ–24) విమానాన్ని సోమవారం రాత్రి నడుపాలని నిర్ణయించారు. సోమవారం రాత్రి 8:42 గంటలకు ఎయిర్‌బస్ ఏ320 విమానం దుబాయ్‌లో 180 మంది ప్రయాణికులతో బయలుదేరింది. పాక్ గగనతంలోకి 9:30 గంటలకు ప్రవేశించి.. 10:40 గంటలకు ఆ దేశ సరిహద్దు దాటింది. అర్ధరాత్రి 12:10 గంటలకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సురక్షితంగా చేరింది. విమానం ల్యాండ్ కాగానే పాక్ సీఏఏ డైరెక్టర్ తమ కార్యాలయానికి ఫోన్ చేశారని, విమానం సురక్షితంగా చేరినందుకు హర్షం వ్యక్తం చేశారని ఇండిగో సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారన్నది. పాక్ టెస్ట్‌ఫ్లైట్‌కు ఆహ్వానించినా.. చివరినిమిషంలో నిర్ణయం మార్చుకునే ప్రమాదం ఉండటంతో ముందు జాగ్రత్తలు తీసుకున్నట్టు ఇండిగో తెలిపింది. పాక్‌గగనతలంలో మొత్తం 11 మార్గాలు ఉన్నాయని, మిగతా 10 మార్గాలను రంజాన్ తర్వాత తెరిచే అవకాశం ఉన్నదని ఓ సీనియర్ అధికారి తెలిపారు.

# రక్షణ బడ్జెట్ తగ్గించుకుంటాం

స్వచ్ఛందంగా ముందుకొచ్చిన పాక్ సైన్యం

దేశ ఆర్థిక కష్టాలు గట్టెక్కించేందుకు చర్యలు



**ఇస్లామాబాద్:** తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకున్న తమ దేశాన్ని గట్టెక్కించేందుకు పాకిస్థాన్ మిలిటరీ ఇంతకుముందెన్నడూ లేని విధంగా స్వచ్ఛందంగా ముందుకొచ్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రక్షణ బడ్జెట్‌ను తగ్గించుకుంటామని తెలిపింది. దేశ భద్రత, రక్షణ విషయంలో రాజీపడబోమని, అన్ని ముప్పులను సమర్థంగా ఎదుర్కొనగలమని మిలిటరీ మీడియా విభాగం ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ జనరల్ అసిఫ్ గఫూర్ చెప్పారు. బడ్జెట్ భారాన్ని అంతర్గత చర్యల ద్వారా భర్తీ చేస్తామన్నారే గానీ, ఆ చర్యలేంటో ఆయన పేర్కొనలేదు. దేశ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రక్షణ బడ్జెట్ తగ్గింపునకు మిలిటరీ ముందుకు రావడం సంతోషకరమని పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రశంసించారు. దేశం పలు భద్రతా సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ఈ దిశగా ముందడుగు వేయడం అభినందనీయమన్నారు. మిలిటరీ నిర్ణయం చిన్న అడుగేమీ కాదని పాక్ శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి ఫవాద్ చౌదరి అన్నారు. బలమైన పౌర ప్రభుత్వం–మిలిటరీ సమన్వయంతోనే దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించగమన్నారు. గతేడాది ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఇమ్రాన్ ఖాన్ దేశ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో పొదుపు చర్యలు చేపడుతున్నారు. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వివరాల ప్రకారం.. ప్రపంచంలోనే అత్యధిక రక్షణ బడ్జెట్ కలిగిన దేశాల్లో పాక్ 20వ స్థానంలో ఉంది. 2018లో ఆ దేశ రక్షణ బడ్జెట్ 11.4 బిలియన్ డాలర్లు. ఆ దేశ జీడీపీలో ఇది నాలుగు శాతం.

### మరుగుదొడ్డి గోడలపై మహాత్ముడి బొమ్మ

టాయిలెట్ టైల్స్‌పై జాతీయ చిహ్నం

యూపీలో అధికారుల నిర్వాకం

**బులంద్‌షహర్:** మహాత్మా గాంధీకి ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర అవమానం జరిగింది. బులంద్‌షహర్‌లోని ఇచ్చావరి గ్రామంలో స్వచ్ఛ భారత్ పథకం కింద నిర్మించిన మరుగుదొడ్లలో గాంధీజీ, జాతీయ చిహ్నం ముద్రించిన టైల్స్‌ను వినియోగించారు. దీనిపై స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో.. జిల్లా పాలనాధికారులు ఈ నిర్మాణాలను పరీక్షించారు. గ్రామంలో 508 మరుగుదొడ్లు నిర్మించగా.. గాంధీ, జాతీయ చిహ్నం చిత్రాలను కలిగిన టైల్స్‌ను 13 మరుగుదొడ్లకు వాడినట్టు కలెక్టర్ అమర్జీత్ సింగ్ తెలిపారు. అభ్యంతరకరమైన టైల్స్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించినట్టు చెప్పారు. ఆ టైల్స్ వేయాలని నిర్ణయం తీసుకున్న గ్రామీణాభివృద్ధి అధికారి, సర్పంచ్‌పై చర్యలు తీసుకున్నట్టు వివరించారు.

## మోదీ సారథ్యంలో
# రెండు క్యాబినెట్ కమిటీలు

న్యూఢిల్లీ, జూన్ 5: కేంద్రంలో రెండోసారి అధికార పగ్గాలు చేపట్టిన ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రభుత్వం ముందున్న రెండు ప్రధాన సవాళ్లను ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై దృష్టి సారించారు. ఆర్థిక మందగమనం, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం బుధవారం తన సారథ్యంలో రెండు క్యాబినెట్ కమిటీలను నియమించారు. 'పెట్టుబడి–వృద్ధిరేటు, ఉద్యోగ కల్పన–నైపుణ్యాభివృద్ధి' పేరిట వేర్వేరు కమిటీలను ఏర్పాటుచేశారు. పెట్టుబడి–వృద్ధిరేటుపై ఏర్పాటైన ఐదుగురు మంత్రుల కమిటీ మౌలిక వసతులు, వ్యవసాయ రంగంలో పెట్టుబడులను పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తుంది. ఉద్యోగ కల్పన–నైపుణ్యాభివృద్ధిపై ఏర్పాటైన పది మంది మంత్రుల కమిటీ మరిన్ని ఉద్యోగాల కల్పనపై మార్గాలను అన్వేషిస్తుంది. పెట్టుబడి–వృద్ధిరేటుపై ఏర్పాటైన క్యాబినెట్ కమిటీలో హోంమంత్రి అమిత్‌షాతోపాటు మంత్రులు నిర్మలా సీతారామన్ (ఆర్థికం), నితిన్ గడ్కరీ (రవాణా, జాతీయ రహదారులు), పీయూష్ గోయల్ (రైల్వే, వాణిజ్యం) సభ్యులుగా ఉంటారు. ఉద్యోగ కల్పన–నైపుణ్యాభివృద్ధిరేటుపై నియమించిన క్యాబినెట్ కమిటీలో సభ్యులుగా మంత్రులు అమిత్‌షా, నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, నరేంద్రసింగ్ తోమర్, రమేశ్ పోఖ్రియాల్ నిశాంక్, ధర్మేంద్ర ప్రధాన్, ఎంఎన్ పాండే, సంతోష్ కుమార్ గాంగ్వార్, హర్దీప్ పూరీ సభ్యులుగా ఉంటారు.

# నిలకడగా నిపా రోగి ఆరోగ్యం

అబ్జర్వేషన్‌లో మరో ఐదుగురు.. కేరళ సర్కార్ వెల్లడి

**కొచి:** నిపా బారిన పడి కొచిలోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని, అబ్జర్వేషన్‌లో ఉన్న మరో ఐదుగురి పరిస్థితి మెరుగుపడిందని కేరళ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. గత నెల 30న దవాఖానలో చేరిన విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, ఆయన నెమ్మదిగా కోలుకుంటున్నాడని, జ్వరం తగ్గుముఖం పట్టిందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి కేకే శైలజ మీడియాతో చెప్పారు. ప్రస్తుతం అబ్జర్వేషన్‌లో ఉన్న ఐదుగురిని ఐసోలేషన్ వార్డులకు తరలించామని, వారి రక్త నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ)కి పంపామని తెలిపారు. ఎన్ఐవీ నుంచి పరీక్షా ఫలితాలు గురువారం సాయంత్రానికి వస్తాయని అంచనా వేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఐదుగురు జ్వరం, గొంతు నొప్పితో బాధపడుతున్నారని మంత్రి శైలజ వివరించారు.

## నర్సింగ్, డెంటల్ విద్యార్థులకు
# ఎంబీబీఎస్‌లో ప్రవేశం!

- లాటరల్ ఎంట్రీ ద్వారా అనుమతి
- వైద్య విద్యలో మొదటి ఒకట్రెండేండ్లు కామన్ కోర్స్
- జాతీయ విద్యా విధానం-2019 ముసాయిదా సూచనలు




**న్యూఢిల్లీ:** దేశ వైద్య విద్యా విధానంలో సమూల మార్పులు చేయాలని జాతీయ నూతన విద్యా విధానం–2019 ముసాయిదా సూచించింది. అన్ని వైద్య విద్య కోర్సుల విద్యార్థులకు తొలి ఒకటి రెండేండ్లు కామన్ ఫౌండేషనల్ కోర్సు ప్రవేశపెట్టాలని, తద్వారా నర్సింగ్, డెంటల్ విద్యార్థులకు లాటరల్ ఎంట్రీ (కోర్సు మధ్యలో చేరిక) ద్వారా ఎంబీబీఎస్ కోర్సులో చేరేందుకు అనుమతించాలని ప్రతిపాదించింది. మెడిసిన్, నర్సింగ్, డెంటిస్ట్రీకి సంబంధించిన వివిధ కౌన్సిళ్ల పాత్రను వృత్తిపర ప్రమాణాలు రూపొందించడం వరకే పరిమితం చేయాలని, తనిఖీలు, అక్రెడిటేషన్ పనులను ఇతర ఏజెన్సీలకు అప్పగించాలని ప్రతిపాదించింది. ప్రతిపాదిత ఎంబీబీఎస్ కామన్ ఎగ్జిట్ పరీక్షనే పీజీ కోర్సులకు ప్రవేశ పరీక్షగా పరిగణించాలని సూచించింది. ఫీజు నిర్ణయాధికారాన్ని కళాశాల యాజమాన్యాలకే వదిలివేయాలని, అయితే 50 శాతం మంది విద్యార్థులకు (20 శాతం మందికి పూర్తిగా) ఉపకార వేతనాలు అందించేలా నిబంధనలు తేవాలని కోరింది.

**కామన్ ఫౌండేషనల్ కోర్సు..**

ప్రస్తుత వైద్య విధానాన్ని పూర్తిగా మార్చాలని ముసాయిదా పాలసీ సూచించింది. వైద్య విద్యార్థులు మెడిసిన్ (ఎంబీబీఎస్), డెంటిస్ట్రీ (బీడీఎస్), నర్సింగ్ తదితర స్పెషలైజేషన్ కోర్సులు ఎంచుకున్న తర్వాత తొలి ఒకట్రెండేండ్లు అందరికీ కామన్ కోర్సును ప్రవేశపెట్టాలని ప్రతిపాదించింది. అనంతరం నర్సింగ్, డెంటల్, ఇతర కోర్సుల విద్యార్థులు ఎంబీబీఎస్ కోర్సులో చేరాలనుకుంటే లాటరల్ ఎంట్రీ ద్వారా అనుమతించాలని ప్రతిపాదించింది. వైద్య విద్య ముసాయిదా ప్రతిపాదనల్లో పాలుపంచుకున్న నారాయణ హెల్త్ చైర్మన్ డాక్టర్ దేవి శెట్టి మాట్లాడుతూ.. లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశం కల్పించడం అంటే ప్రవేశపరీక్ష నుంచి మినహాయింపు ఇచ్చినట్లు కాదని స్పష్టం చేశారు. రెండేండ్ల తర్వాత నర్సింగ్, డెంటల్ విద్యార్థులు లాటరల్ ఎంట్రీ ద్వారా ఎంబీబీఎస్ కోర్సుల్లో చేరాలనుకుంటే, మొదట వారు నీట్ పరీక్ష రాయాల్సి ఉంటుందని చెప్పారు. అందులో ఉత్తీర్ణులైన తర్వాతే ఎంబీబీఎస్‌లో మిగిలిన మూడేండ్లకు వారిని అనుమతించాలని వివరించారు.

### ఎగ్జిట్ ఎగ్జామ్ ద్వారా పీజీ ప్రవేశాలు

ఎంబీబీఎస్ విద్యార్థులకు ఉద్దేశించిన ప్రతిపాదిత కామన్ ఎగ్జిట్ ఎగ్జామ్‌ను పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు ప్రవేశ పరీక్షగానూ పరిగణించాలని ముసాయిదా విధానం సూచించింది. 'ఎంబీబీఎస్ నాలుగో ఏడాది చివరలో ఎగ్జిట్ ఎగ్జామ్ నిర్వహిస్తారు. దీంతో మళ్లీ వారు ప్రత్యేకంగా ప్రవేశ పరీక్షకు సన్నద్ధం కావాల్సిన భారం తప్పుతుంది. ఈ సమయంలో వారు ఇతర నైపుణ్యాలు పెంచుకునేందుకు వీలవుతుంది' అని పేర్కొంది. అలాగే డెంటల్, ఇతర కోర్సుల వారికి కూడా ఎగ్జిట్ ఎగ్జామ్ నిర్వహించాలని ప్రతిపాదించింది.



'యోగాను మన జీవితంలో ఓ భాగంగా చేసుకుంటే బాగుంటుంది. దీని వల్ల చాలా ఉపయోగాలున్నాయి. మీతో పాటు ఇతరులు కూడా యోగాను ఓ దినచర్యగా చేసుకునేలా ప్రోత్సహించాలి. ప్రకృతితో కూడిన ప్రశాంత వాతావరణంలో జీవించడం వల్ల భవిష్యత్ చాలా బాగుంటుంది. మొక్కలను నాటడమే కాకుండా పెరిగే వరకు వాటిని కాపాడాలి'

– నరేంద్రమోదీ, ప్రధానమంత్రి

(బుధవారం పర్యావరణ దినోత్సవం, 21న యోగా దినోత్సవం సందర్భంగా..)

# దేశవ్యాప్తంగా ఐచ్ఛిక భాషగా తమిళం!

ప్రధానికి తమిళనాడు సీఎం ట్వీట్.. విమర్శల నేపథ్యంలో తొలిగింపు



**చెన్నై, జూన్ 5:** హిందీయేతర రాష్ర్టాల్లో హిందీని తప్పనిసరిగా బోధించాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనపై తీవ్ర దుమారం రేగిన నేపథ్యంలో.. తమిళనాడు సీఎం పళనిస్వామి ప్రధాని మోదీని ఉద్దేశించి చేసిన ట్వీట్ విమర్శల పాలవుతున్నది. 'తమిళాన్ని ఐచ్ఛిక భాషగా ఇతర రాష్ర్టాల్లో అమలుచేస్తే, ప్రపంచంలోని అతి పురాతన భాషల్లో ఒకటైన తమిళానికి గొప్ప మేలు చేసినట్టు అవుతుంద'ని పళనిస్వామి ట్విట్టర్‌లో మోదీని అభ్యర్థించారు. అయి తే, తమిళాన్ని ఇతర రాష్ర్టాల్లో ఐచ్ఛిక భాషగా చేయమని చెబుతూ.. 'అన్ని రాష్ర్టాల్లో హిందీ తప్పనిసరి' ప్రతిపాదనకు సీఎం సానుకూలంగా వ్యవహరిస్తున్నారా? అంటూ ఆయన ట్వీట్‌పై ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోశాయి. ఈ నేపథ్యంలో పళనిస్వామి తన ట్వీట్‌ను తొలిగించారు. మరోవైపు, దేశంలోని అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో తమిళ భాషను అధికార భాషల్లో ఒకటిగా చేయాలని డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ బుధవారం డిమాండ్ చేశారు.

# నౌక నుంచి రాకెట్ ప్రయోగించిన చైనా

**బీజింగ్:** అంతరిక్ష ప్రయోగాల్లో చైనా మరో ముందడుగు వేసింది. నౌక నుంచి రాకెట్ ప్రయోగాన్ని తొలిసారిగా విజయవంతంగా ప్రయోగించింది. పసుపు సముద్రం నుంచి చైనా బుధవారం ఈ ప్రయోగాన్ని చేపట్టింది. లాంగ్ మార్చ్–11 రాకెట్ ద్వారా మొత్తం ఏడు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. భూభాగం నుంచి పోలిస్తే, నౌకలపై నుంచి రాకెట్ ప్రయోగాలు తక్కువ ఖర్చుతో కూడుకున్నవని శాస్త్రవేత్తలు తెలిపారు.

గురువారం
6•6•2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక


WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD






# ఇక నేరుగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు




- కొనుగోలుదారుడి ఫోన్‌కు ఓటీపీ
- రిజిస్ట్రేషన్లశాఖ ఏర్పాట్లు.. రాష్ట్రవ్యాప్తంగా అమలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్థిరాస్తి రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు ఇకపై తమ దస్తావేజుల కోసం డాక్యుమెంట్ రైటర్లపై ఆధారపడాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత డాక్యుమెంట్ సిద్ధం కాగానే కొనుగోలుదారుడి సెల్‌కు వన్ టైం పాస్‌వర్డ్ (ఓటీపీ) వస్తుంది. ఓటీపీ నంబర్ చెప్పి సంబంధిత వ్యక్తులు స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి నేరుగా డాక్యుమెంట్ తీసుకోవచ్చు. వాస్తవానికి ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకొనే విధానం అందుబాటులో ఉన్నా ఎక్కువ శాతం మంది ఇప్పటికీ ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్లనే ఆశ్రయిస్తున్నారు. పనిఒత్తిడి ఎక్కువగా ఉంటే.. రిజిస్ట్రేషన్ అనంతరం నాలుగు లేదా వారంరోజులకు కానీ స్కాన్ అయిన డాక్యుమెంట్ తిరిగి రావడంలేదు. దానిపై కూడా సరైన సమాచారం లేక కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి ఉన్నతాధికారులు ఎస్సెమ్మెస్ ఓటీపీని అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాగానే సదరు వ్యక్తుల ఫోన్‌కు ఎస్సెమ్మెస్ వచ్చేలా ఏర్పాటుచేశారు. తాజాగా రిటర్న్ డాక్యుమెంట్ కోసం కూడా ఎస్సెమ్మెస్ ఇస్తున్నారు. రెండురోజులుగా ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 141 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలుచేస్తున్నారు. దీనివల్ల ఆస్తి కొనుగోలుదారులు డాక్యుమెంట్‌రైటర్లపై ఆధారపడకుండా ఓటీపీ నంబర్ చెప్పి సబ్ రిజిస్ట్రార్ వద్ద తమ దస్తావేజులను తీసుకోవచ్చని ఉన్నతాధికారులు తెలిపారు.

## భవనాల అప్పగింతపై ఏపీ సీఎస్‌కు లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో ఏపీకి కేటాయించిన భవనాలు తెలంగాణకు ఇచ్చే అంశం ఒక అడుగు ముందుకుపడింది. గవర్నర్ నరసింహన్ ఆదేశాల తరువాత తెలంగాణ సీఎస్ ఎస్కే జోషి.. ఏపీ సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యంకు లేఖరాశారు. పోలీస్‌శాఖకు, ఇతర శాఖలకు భవనాలు ఇస్తామని, ఏవి కావాలో తెలుపాలని కోరారు. ఏపీ సీఎస్‌తో జోషి ఫోన్లోనూ మాట్లాడినట్లు సమాచారం. ఏపీ ప్రభుత్వం హెర్మిటేజ్ భవనంతోపాటు ప్రస్తుత ఏపీ డీజీపీ ఆఫీస్‌గా ఉన్న భవనాలను కోరే అవకాశమున్నదని తెలిసింది. ఏ భవనాలు కోరినా ఇవ్వడానికి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సిద్ధంగా ఉన్నట్టు ఏపీ సీఎస్‌కు చెప్పినట్లు తెలిసింది.

# రాష్ట్రంలో గొర్రెల పరిశోధనా కేంద్రం!

- పశుసంవర్ధకశాఖ కసరత్తు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో అధిక మాంసాన్నిచ్చే జాతి గొర్రెలను ఉత్పత్తి చేసేందుకు వీలుగా ఆధునిక గొర్రెల పరిశోధన కేంద్రం ఏర్పాటుకు పశుసంవర్ధకశాఖ కసరత్తు చేస్తున్నది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేసింది. దేశంలోనే గొర్రెల సంఖ్యలో మొదటిస్థానంలో ఉన్న తెలంగాణలో పరిశోధక కేంద్రం ఏర్పాటుచేస్తే.. గొర్రెల సంపద మరింత వృద్ధి చెందుతుంది. వాటిపై ఆధారపడిన ఆరు లక్షల కుటుంబాలకు మేలు కలుగుతుంది. పశువైద్య విశ్వవిద్యాలయం సహకారంతో దీనిని ఏర్పాటుచేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి పశుసంవర్ధకశాఖ ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా దుబ్బాక, మహబూబ్‌నగర్ జిల్లాను గొర్రెల పరిశోధన కేంద్రం ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాలుగా అధికారులు గుర్తించారు. ఉమ్మడి రాష్ట్రంలో నెల్లూరు జిల్లా చింతలదీవిలో పరిశోధన కేంద్రం ఉండేది. తెలంగాణలోనూ గతంలో వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పరిశోధన కేంద్రాలు ఉన్నప్పటికీ అవి నిరాదరణకు గురయ్యాయి. రైతుల్లో ఆసక్తి, స్థానిక నాయకుల మద్దతు, స్థల సేకరణకు అనువైన పరిస్థితులు ఉండటంతో సిద్దిపేట జిల్లా దుబ్బాక లేదా మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో పరిశోధన కేంద్రం ఏర్పాటుచేయాలని అధికారులు భావిస్తున్నారు. అధిక మాంసాన్ని ఉత్పత్తిచేసే నెల్వరు జాతి గొర్రెలతోపాటు తెలంగాణ రాష్ట్ర జాతిగా ప్రాచుర్యం పొందిన దక్కణీ జాతి గొర్రెలు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉండటంతో అక్కడ ఏర్పాటుకు అధికారులు ఆసక్తిచూపుతున్నారు. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే పరిశోధన కేంద్రం ఏర్పాటుకు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు పీవీ నరసింహారావు పశువైద్యశాల ఉన్నతాధికారులు తెలిపారు. 60 నుంచి 100 ఎకరాల్లో పరిశోధన కేంద్రాన్ని అభివృద్ధి చేస్తే రైతులకు శిక్షణ ఇచ్చేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.


8 వ
వార్షికోత్సవ శుభాకాంక్షలు




# గులాబీ వైపు స్వతంత్రులు!

గెలిచినోళ్లలో ఎక్కువమంది టీఆర్‌ఎస్‌వారే.. సొంతగూటికి వచ్చేందుకు యత్నం

ఎంపీపీ ఎన్నికలో కీలకం.. ఇండిపెండెంట్ల కోసం పార్టీల ప్రయత్నాలు

**రంగారెడ్డి జిల్లా, నమస్తే తెలంగాణ/ మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** ఎంపీటీసీ ఎన్నికల్లో ఇండిపెండెంట్లుగా గెలిచిన అభ్యర్థుల చూపు టీఆర్‌ఎస్ పార్టీపై పడింది. కొన్ని మండలాల్లో ఏ పార్టీకీ సరైన ఆధిక్యం రాకపోవడంతో అక్కడ స్వతంత్రుల మద్దతు కీలకంగా మారింది. వీరిని ప్రసన్నంచేసుకొనేందుకు ప్రతిపక్ష పార్టీలు డబ్బు గుమ్మరిస్తూ ప్రాధేయపడుతుండగా, వారుమాత్రం గులాబీ పార్టీ వైపే మొగ్గుచూపుతున్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేసి గెలిచినవారిలో ఎక్కువమంది ఎన్నికలకు ముందువరకు టీఆర్‌ఎస్‌లో ఉన్నవారే. రాజకీయ సమీకరణాల నేపథ్యంలో టీఆర్‌ఎస్ నుంచి టికెట్ దక్కక స్వతంత్రులుగా పోటీచేసి గెలిచారు. ఎంపీపీ ఎన్నికలోపే పాతగూటిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు తెలిసింది. మేడ్చల్ జిల్లాలో మొత్తం 42 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. 18 స్థానాల్లో టీఆర్‌ఎస్, 13 స్థానాల్లో కాంగ్రెస్, ఒక స్థానంలో బీజేపీ గెలిచింది. ఇక మిగిలిన 10 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. వీరిలో తొమ్మిది మంది ఇటీవలివరకు టీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా ఉన్నారు. టీఆర్‌ఎస్ టికెట్ దక్కక స్వతంత్రులుగా పోటీచేసి గెలిచారు. ఇప్పుడు మళ్లీ పాతగూటికి వెళ్లేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. రంగారెడ్డి జిల్లాలో 21 మండలాల్లో 10 చోట్ల టీఆర్‌ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ వచ్చింది. మరో 11 చోట్ల ఎవరికీ పూర్తిస్థాయి మెజార్టీ రాలేదు. ఆయాస్థానాల్లో ఎంపీపీ పీఠాలను కైవసం చేసుకొనేందుకు ఇండిపెండెంట్ల మద్దతు కీలకంగా మారింది. చేవెళ్ల, కందుకూరు, అబ్దుల్లాపూర్‌మెట్, యాచారం, మంచాల, మాడ్గుల, ఫరూఖ్‌నగర్, కొం దుర్గు, కొత్తూరు, నందిగామ, కడ్తాల్‌లో టీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య తీవ్రమైన పోటీ ఉన్న ది. స్వతంత్ర అభ్యర్థులు ఎక్కడ మొగ్గుచూపితే ఆ పార్టీకే ఎంపీపీ పీఠం దక్కనున్నది. మ్యాజిక్ ఫిగర్ రాని ఎంపీపీ ఆశావహులు ఇండిపెండెంట్లను క్యాంప్‌లకు తరలించారు. ఒక్కో సభ్యుడికి రూ.10 లక్షల నుంచి 15 లక్షలు, వైస్ ఎంపీపీ పదవిని ఇస్తామని ఆఫర్ ఇస్తున్నారు. రూ.లక్షలు ఖర్చుచేసి గెలుపొందామని అప్పులు తీర్చుకొనేందుకు ఇదే మంచి అవకాశమని మరి కొందరు విజేతలు చర్చించుకుంటున్నట్టు విశ్వసనీయ సమాచారం.

**అయినా.. కారుదే ఎంపీపీ పీఠం**

టీఆర్‌ఎస్‌కు రిజర్వేషన్ కలిసొచ్చింది. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలంలో ఆరు ఎంపీటీసీ స్థానాలుండగా, వీటిలో కాంగ్రెస్ నాలుగు స్థానాల్లో, టీఆర్‌ఎస్ రెండు స్థానాల్లో గెలుపొందింది. మూడు చింతలపల్లి ఎంపీపీ బీసీ మహిళకు రిజర్వు అయింది. కాంగ్రెస్ నుంచి గెలిచిన నలుగురూ పురుషులే కావడంతో ఉద్దమర్రి నుంచి టీఆర్‌ఎస్ అభ్యర్థి ఎల్ సుగుణ విజయం సాధించారు. మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ గెలిచినా ఎంపీపీ కుర్చీలో మాత్రం గులాబీ పార్టీకి చెందిన సుగుణ కూర్చోనున్నారు.

# ప్రజలతో కలిసి పనిచేయాలి

జిల్లా, మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి • పరిషత్ ప్రజాప్రతినిధులతో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బుధవారం హైదరాబాద్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి అభినందిస్తున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు కూడా వున్నారు.



టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుతో భేటీ అయిన రాజన్న సిరిసిల్ల జిల్లాలో గెలిచిన జెడ్పీటీసీలు. చిత్రంలో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు కూడా ఉన్నారు.

**హైదరాబాద్/ రాజన్నసిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** నూతనంగా ఎన్నికైన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అభినందించారు. ఈ గెలుపుతో పొంగిపోకుండా ప్రజలతో కలిసి పనిచేయాలని వారికి సూచించారు. ప్రతిజిల్లా, మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా ప్రయత్నించాలన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన ఫలాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి పార్టీకి మరింత మంచిపేరు తేవాలని కోరారు. బుధవారం వివిధ జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ విజేతలు కేటీఆర్‌ను ఆయన నివాసంలో కలిశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గెలిచిన జెడ్పీటీసీ సభ్యులు, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ఆధ్వర్యంలో కేటీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్.. జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో చర్చించారు. గ్రామీణప్రాంత ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలదే కీలకపాత్ర అని చెప్పారు. కార్మిక, ధార్మికక్షేత్రాలు రాష్ట్రానికే ఆదర్శంగా ఉండేలా అభివృద్ధిచేయాలని, రోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పరిషత్ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో కష్టపడ్డ కార్యకర్తలను, నాయకులను ప్రశంసించారు. కేటీఆర్‌ను కలిసిన జెడ్పీటీసీలలో గుండం నర్సయ్య (ముస్తాబాద్), కొమిరెశెట్టి విజయ (గంభీరావుపేట), చీటి లక్ష్మణ్‌రావు (ఎల్లారెడ్డిపేట), పూర్మాణి మంజుల (తంగళ్లపల్లి), సిద్ధం వేణు (ఇల్లంతకుంట), మ్యాకల రవి (వేములవాడ అర్బన్), ఏశవాణి (వేములవాడ రూరల్), నాగం కుమార్ (చందుర్తి), న్యాలకొండ అరుణ (కోనరావుపేట), గట్ల మీనయ్య (రుద్రంగి), కత్తెరపాక ఉమ (బోయినిపల్లి) ఉన్నారు.

**కేటీఆర్, మంత్రి ఈటల పరస్పర అభినందనలు**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో స్థానికసంస్థల ఎన్నికల్లో ఘనవిజయం సాధించినందుకు మంత్రి ఈటల రాజేందర్, కేటీఆర్ పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాతోపాటు పూర్వ కరీంనగర్ జిల్లాలో పెద్దఎత్తున స్థానిక సంస్థల స్థానాలను టీఆర్‌ఎస్ గెలుచుకున్న నేపథ్యంలో మంత్రి ఈటల రాజేందర్.. కేటీఆర్ నివాసానికి వెళ్లి అభినందించారు.

# గులాబీ తెలంగాణ!


జెడ్పీటీసీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు 83.45% స్థానాలు

449 జెడ్పీటీసీ, 3,548 ఎంపీటీసీ స్థానాలతో రికార్డ్

స్థానిక ఫలితాలను అధికారికంగా వెల్లడించిన ఎస్‌ఈసీ

13.94% స్థానాలతో సరిపెట్టుకున్న కాంగ్రెస్

టీడీపీకి అంతిమఘడియలు చాటిన ఫలితాలు?



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ క్రమేపీ గులాబీ వర్ణం సంతరించుకుంటున్నది! ప్రజల హృదయాల నిండా ఇంటిపార్టీయే నిండిపోతున్నది! పరిషత్ ఎన్నికల ఫలితాలు ఆ విషయాన్ని రుజువుచేస్తున్నాయి. మంగళవారం రాత్రివరకు ప్రాథమిక ఫలితాలను వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. తుది ఫలితాలను బుధవారం అధికారికంగా ప్రకటించింది. రాష్ట్రంలోని మొత్తం జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల్లో అధికార టీఆర్‌ఎస్‌కు 83.45% స్థానాలు దక్కాయి. మొత్తం 538 స్థానాలకుగాను 449 స్థానాలను దక్కించుకుని రికార్డు సృష్టించింది. మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల్లో 60.77 శాతం టీఆర్‌ఎస్ సాధించింది. దీంతో స్థానిక సంస్థల్లో అతిపెద్ద పార్టీగా టీఆర్‌ఎస్ అవతరించింది. జెడ్పీటీసీల్లో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి దక్కింది 13.94% మాత్రమే. ఎంపీటీసీల్లోనూ కాంగ్రెస్‌కు 23.92 శాతం స్థానాలు మాత్రమే దక్కాయి. ఎంపీటీసీ స్థానాల్లో స్వతంత్రులు 9.43% సీట్లు దక్కించుకోగా, బీజేపీ 3.5 శాతానికే పరిమితమైంది. స్థానాలవారీగా చూసినప్పుడు టీఆర్‌ఎస్‌కు 449, కాంగ్రెస్‌కు 75, బీజేపీకి 8 జెడ్పీటీసీ స్థానాలు లభించాయి. స్వతంత్రులు నాలుగుచోట్ల గెలువగా, 2 చోట్ల వామపక్ష పార్టీల అభ్యర్థులు గెలిచారు. ఎంపీటీసీల విషయానికి వస్తే.. మొత్తం 5816 స్థానాలకుగాను.. 3,548 స్థానాల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలిచారు. కాంగ్రెస్ 1392, బీజేపీ 208, సీపీఐ 38, సీపీఎం 40, టీడీపీ 21 చోట్ల గెలువగా, మరో 20 చోట్ల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు గెలిచారు. 549 స్థానాల్లో స్వతంత్రులు విజయం సాధించారు.

**వామపక్షాల కంటే టీడీపీ ఘోరం**

రాష్ట్రంలో టీడీపీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని తాజా ఫలితాలతో తేటతెల్లమయింది. పరిషత్ ఎన్నికల్లో కనీసం వామపక్షాలతో సమానంగా కూడా టీడీపీ అభ్యర్థులు విజయం సాధించలేకపోయారు. వామపక్షాలకు 78 స్థానాలు లభించగా.. టీడీపీకి 21 స్థానాలు మాత్రమే వచ్చాయి. రెండు ఎంపీపీల్లో వామపక్ష నేతలు అధ్యక్షస్థానాలను అలంకరించే అవకాశాలు ఉన్నాయి. టీడీపీకి ఒక్కచోట అధ్యక్ష స్థానం గెలిచే అవకాశం ఉన్నా.. అక్కడి ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఆ పార్టీ భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. వెరసి.. ఈ ఫలితాలు టీడీపీకి అంతిమ ఘడియలను ప్రకటించాయని విశ్లేషకులు అంటున్నారు.

## జెడ్పీటీసీ ఫలితాలు..

| జిల్లా | మొత్తం స్థానాలు | టీఆర్‌ఎస్ | కాంగ్రెస్ | బీజేపీ | ఇతరులు |
|---|---|---|---|---|---|
| కరీంనగర్ | 15 | 15 | - | - | - |
| రాజన్నసిరిసిల్ల | 12 | 11 | 01 | - | - |
| జగిత్యాల | 18 | 17 | 01 | - | - |
| పెద్దపల్లి | 13 | 11 | 02 | - | - |
| మంచిర్యాల | 16 | 12 | 03 | - | 01 |
| ఆసిఫాబాద్ | 15 | 14 | 1 | - | - |
| నిజామాబాద్ | 27 | 23 | 02 | 02 | - |
| కామారెడ్డి | 22 | 14 | 08 | - | - |
| ఆదిలాబాద్ | 17 | 09 | 03 | 05 | - |
| నిర్మల్ | 18 | 12 | 05 | - | 01 |
| వరంగల్ అర్బన్ | 07 | 07 | - | - | - |
| వరంగల్ రూరల్ | 16 | 16 | - | - | - |
| భూపాలపల్లి | 11 | 06 | 04 | - | 01 |
| మహబూబాబాద్ | 16 | 14 | 02 | - | - |
| జనగామ | 12 | 12 | - | - | - |
| ములుగు | 08 | 07 | 01 | - | - |
| నల్లగొండ | 31 | 24 | 07 | - | - |
| సూర్యాపేట | 23 | 20 | 03 | - | - |
| యాదాద్రిభువనగిరి | 17 | 12 | 05 | - | - |
| ఖమ్మం | 20 | 17 | 03 | - | - |
| భద్రాద్రి కొత్తగూడెం | 21 | 16 | 03 | - | 02 |
| మహబూబ్‌నగర్ | 14 | 14 | - | - | - |
| నారాయణపేట | 11 | 09 | 01 | 01 | - |
| జోగుళాంబ గద్వాల | 12 | 12 | - | - | - |
| వనపర్తి | 14 | 13 | 01 | - | - |
| నాగర్‌కర్నూల్ | 20 | 17 | 03 | - | - |
| సంగారెడ్డి | 25 | 20 | 05 | - | - |
| మెదక్ | 20 | 18 | 02 | - | - |
| సిద్దిపేట | 23 | 22 | 01 | - | - |
| రంగారెడ్డి | 21 | 16 | 04 | - | 01 |
| వికారాబాద్ | 18 | 15 | 03 | - | - |
| మేడ్చల్ | 05 | 04 | 01 | - | - |
| మొత్తం | 538 | 449 | 75 | 8 | 6 |

## ఎంపీటీసీ ఫలితాలు..

| జిల్లా | మొత్తం | టీఆర్‌ఎస్ స్థానాలు | కాంగ్రెస్ | బీజేపీ | సీపీఐ | సీపీఎం | ఇతరులు |
|---|---|---|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 158 | 83 | 28 | 33 | -- | -- | 14 |
| ఆసిఫాబాద్ | 123 | 82 | 21 | 2 | 2 | -- | 16 |
| మంచిర్యాల | 130 | 78 | 36 | -- | 1 | -- | 15 |
| నిర్మల్ | 156 | 86 | 54 | 7 | -- | -- | 9 |
| జగిత్యాల | 214 | 143 | 37 | 19 | -- | -- | 15 |
| కరీంనగర్ | 178 | 99 | 26 | 15 | 3 | -- | 35 |
| పెద్దపల్లి | 138 | 90 | 33 | 5 | -- | -- | 10 |
| సిరిసిల్ల | 123 | 72 | 18 | 7 | -- | -- | 26 |
| కొత్తగూడెం | 209 | 116 | 24 | - | 17 | 9 | 43 |
| ఖమ్మం | 289 | 168 | 58 | - | 7 | 14 | 42 |
| గద్వాల | 141 | 99 | 17 | 11 | -- | -- | 14 |
| మహబూబ్‌నగర్ | 169 | 111 | 40 | 6 | -- | -- | 12 |
| నాగర్‌కర్నూల్ | 212 | 136 | 52 | 4 | 2 | -- | 17 |
| వనపర్తి | 128 | 89 | 20 | -- | -- | -- | 19 |
| నారాయణపేట | 140 | 85 | 18 | 25 | -- | -- | 12 |
| మెదక్ | 189 | 118 | 44 | -- | -- | -- | 27 |
| సంగారెడ్డి | 295 | 177 | 102 | 2 | -- | -- | 14 |
| సిద్దిపేట | 229 | 151 | 29 | 4 | -- | 1 | 44 |
| కామారెడ్డి | 236 | 149 | 61 | 4 | -- | -- | 22 |
| నిజామాబాద్ | 299 | 188 | 45 | 34 | -- | -- | 32 |
| నల్లగొండ | 349 | 192 | 133 | 4 | 2 | 5 | 13 |
| సూర్యాపేట | 235 | 143 | 74 | 3 | 1 | 3 | 11 |
| భువనగిరి | 177 | 85 | 72 | 1 | 1 | 7 | 11 |
| మేడ్చల్ | 42 | 18 | 13 | 1 | -- | -- | 10 |
| రంగారెడ్డి | 257 | 126 | 74 | 17 | -- | 1 | 39 |
| వికారాబాద్ | 221 | 138 | 75 | -- | -- | -- | 8 |
| జనగామ | 140 | 96 | 32 | -- | 1 | -- | 11 |
| భూపాలపల్లి | 106 | 64 | 25 | 2 | -- | -- | 15 |
| మహబూబాబాద్ | 198 | 129 | 52 | 1 | 1 | -- | 15 |
| వరంగల్ రూరల్ | 178 | 127 | 44 | -- | -- | -- | 7 |
| వరంగల్ అర్బన్ | 86 | 62 | 12 | 1 | -- | -- | 11 |
| ములుగు | 72 | 48 | 23 | -- | -- | -- | 1 |
| మొత్తం | 5816 | 3548 | 1392 | 208 | 38 | 40 | 590 |

## ఎమ్మెల్యే పదవికి ఉత్తమ్ రాజీనామా

- ఆమోదించిన స్పీకర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీగా గెలుపొందిన నేపథ్యంలో పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన శాసనసభ సభ్యత్వానికి బుధవారం రాజీనామాచేశారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దీనిని వెంటనే ఆమోదించారు. స్పీకర్ పోచారం.. అనారోగ్య కారణంగా దవాఖానలో చేరడంతో ఆయన ఆదేశాల మేరకు ఉత్తమ్ రాజీనామా లేఖను అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు స్వీకరించారు. రాజీనామాకు కారణాలపై ఉత్తమ్‌కుమార్‌తో ఫోన్‌లో సంప్రదించిన స్పీకర్ పోచారం.. తదుపరి ప్రక్రియ కొనసాగించాలని అసెంబ్లీ కార్యదర్శికి సూచించారు. అనంతరం రాజీనామా ఆమోదంపై అసెంబ్లీ కార్యదర్శి నోటిఫికేషన్ విడుదలచేశారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘానికి కూడా నివేదిక పంపించారు. దీంతో ఇప్పటివరకు ఉత్తమ్ ప్రాతినిధ్యం వహించిన హుజూర్‌నగర్ శాసనసభా స్థానానికి ఆరునెలల్లోగా ఉపఎన్నిక జరుగనున్నది

# రేపు ఎంపీపీల ఎన్నిక

- నేడు సభ్యులకు జారీకానున్న సమావేశ నోటీసులు
- తొలుత కోఆప్షన్ సభ్యుల ఎన్నిక
- కోరం లేకుంటే మరో రోజుకు ఎన్నిక వాయిదా
- మహిళలకు దక్కనున్న 50% (269) అధ్యక్ష పీఠాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికలు శుక్రవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ముగిసి.. ఫలితాలను ప్రకటించిన నేపథ్యంలో మెజార్టీ ఎంపీపీ స్థానాలు టీఆర్‌ఎస్ కైవసం చేసుకోనున్నది. శుక్రవారం ఉదయం నుంచే ఎంపీపీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానున్నది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) రిజర్వేషన్ల వివరాలను మరోసారి జిల్లాలకు పంపించింది. రిజర్వేషన్ల కోటా ఫైనల్ ఫార్మాట్‌లోనే కేటాయించాలని బుధవారం రాత్రి ఎస్‌ఈసీ ఆదేశాలిచ్చింది. మొత్తం 538 ఎంపీపీల్లో మహిళలకు 50శాతం 269 స్థానాలు దక్కనున్నాయి. మండల పరిషత్ ఎన్నికల సందర్భంగా ఎన్నికైన సభ్యులకు గురువారం ప్రత్యేక సమావేశ నోటీసులు జారీచేయనున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటలలోపు కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు నామినేషన్లు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు ఎన్నిక నిర్వహిస్తారు. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక చేపడతారు. నిబంధనల ప్రకారం కోరం ఉంటే పరిషత్ అధ్యక్ష ఎన్నికను అప్పుడే నిర్వహిస్తారు. లేకుంటే మరోరోజుకు వాయిదా వేస్తారు. వరుసగా మూడుసార్లు కోరం రాని పక్షంలో.. ఆ తర్వాతి సమావేశంలో వచ్చిన వారితోనే అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకొంటారు. రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద గుర్తింపు పొందిన 11 రాజకీయ పార్టీలకు విప్ జారీచేసేందుకు అవకాశం కల్పించారు. అయితే నాలుగు పార్టీలు మాత్రమే విప్ జారీచేసే సూచనలు కన్పిస్తున్నాయి.

**50 శాతం స్థానాలు మహిళలకు..**

మండల పరిషత్ చైర్మన్ రిజర్వేషన్ల కోటా ప్రకారం మండలం యూనిట్‌గా పరిగణించే ఎంపీపీ స్థానాల్లో 269 మహిళలకు కేటాయించనున్నారు. వరంగల్, ఖమ్మం జెడ్పీ పరిధిలోని బయ్యారం, గార్ల, గంగారం మండలాలను షెడ్యూల్ ఏరియాలోని మండలాల జాబితాలో చేర్చారు. తొలుత షెడ్యూల్ మండలాలు 24 ఉండగా.. సవరించిన జాబితా ప్రకారం 33కు పెరిగాయి. ఫలితంగా ఎస్సీ, బీసీలకు రావాల్సిన స్థానాలు తగ్గిపోయాయి. మొత్తం 538 మండల పరిషత్‌లలో.. 33 షెడ్యూల్ మండలాలుగా పేర్కొన్నారు. ములుగు-3, భద్రాద్రి కొత్తగూడెం-16, ఖమ్మం-2, మహబూబాబాద్-4, ఆదిలాబాద్-4, కుమ్రంభీం ఆసిఫాబాద్-3, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఒక మండలాన్ని షెడ్యూల్ మండలాలుగా ప్రకటించారు. ఇవి మినహా మిగిలిన 505 స్థానాల్లో 50 శాతం రిజర్వేషన్ల ప్రకారం 252 స్థానాలను రిజర్వేషన్ ప్రక్రియకు తీసుకొన్నారు. ఎస్టీలకు 59 స్థానాలు రాగా.. 30 స్థానాలు మహిళలకు కేటాయించారు. ఎస్సీలకు 98 స్థానాలు రాగా.. మహిళలకు 49 స్థానాలు, బీసీలకు 95 స్థానాలు కేటాయించగా.. మహిళలకు 47 స్థానాలు లభించాయి. జనరల్ స్థానాలు 253 ఉండగా.. 126 మహిళలకు వచ్చాయి. షెడ్యూల్ మండలాల రిజర్వేషన్లతో కలుపుకొంటే మహిళలకు మొత్తం 269 స్థానాలు రానున్నాయి.

## కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు మార్గదర్శకాలు

జెడ్పీ, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు ఇద్దరు పిల్లల నిబంధన వర్తింపజేయనున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు వర్తించే నియమ, నిబంధనలు అన్నీ కోఆప్షన్ సభ్యులకు కూడా వర్తించనున్నాయి. మండల పరిషత్‌లలో కోఆప్షన్ సభ్యుల ఎన్నిక శుక్రవారం జరుగనున్న నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఏర్పడింది. అలాగే, కోఆప్షన్ సభ్యుడిగా పోటీచేసే వ్యక్తి స్థానిక ఓటరై ఉండడంతో పాటు 21 ఏండ్ల కంటే ఎక్కువ వయసుండరాదు. ఒకవేళ కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక జరుగకపోతే ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక నిర్వహించే అవకాశం లేదు. వీరి ఎన్నికకు రాజకీయ పార్టీల విప్‌లు వర్తించవని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

# ఆరు జిల్లాల్లో కాంగ్రెస్ జీరో!

బీజేపీదీ హడావుడే.. మూడు జిల్లాల్లో 8 స్థానాల్లోనే గెలుపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ ప్రభంజనానికి జాతీయ పార్టీలు మట్టికరిచాయి. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో హడావుడి చేసిన బీజేపీ, కాంగ్రెస్.. స్థానిక సంస్థల్లో కనీసస్థాయిలో కూడా ప్రజల ఆదరణను చూరగొనలేకపోయాయి. నాలుగు పార్లమెంట్ స్థానాలు గెలిచి, హడావుడి చేస్తున్న బీజేపీ.. పరిషత్ ఎన్నికల్లో మొత్తం ఎనిమిది జెడ్పీటీసీ స్థానాలను మాత్రమే దక్కించుకున్నది. కాంగ్రెస్ పార్టీ కూడా డబుల్ డిజిట్‌ను దాటలేకపోయింది. ఆ పార్టీ ఆరు జిల్లాల్లో ఖాతా కూడా తెరువలేదు. బీజేపీ 32 జిల్లాలకు మూడు జిల్లాల్లో మినహా మరెక్కడా ఒక్క జెడ్పీటీసీ స్థానాన్నికూడా గెలుచుకోలేకపోయింది. కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న జీ కిషన్‌రెడ్డి సొంత మండలం కందుకూరులో జెడ్పీటీసీ స్థానాన్ని టీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. కరీంనగర్ జిల్లాలో బీజేపీ ఒక్క జెడ్పీటీసీ స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. నిజామాబాద్ జిల్లాలో రెండు జెడ్పీటీసీలను మాత్రమే గెలుపొందింది. ఎంపీ ధర్మపురి అరవింద్ సొంత గ్రామం వేల్పూరులోని రెండు ఎంపీటీసీ స్థానాలను టీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. ఆదిలాబాద్, నిజామాబాద్, నారాయణపేట జిల్లాల్లో ఎనిమిది జెడ్పీటీసీ స్థానాలను బీజేపీ గెలువగలిగింది. కరీంనగర్, జోగుళాంబ గద్వాల, మహబూబ్‌నగర్, జనగామ, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల్లో ఒక్క జెడ్పీటీసీ స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకోలేదు. కుమ్రంభీం ఆసిఫాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, వనపర్తి, నారాయణపేట, సిద్దిపేట, మేడ్చల్, ములుగు జిల్లాల్లో కాంగ్రెస్ ఒక్కో స్థానంలోనే గెలిచింది. సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క నియోజకవర్గంసహా పలువురు రాష్ట్ర, జాతీయస్థాయి నేతలుగా చెప్పుకొనే నేతల నియోజకవర్గాల్లో, మాజీ పీసీసీ అధ్యక్షుడి జెడ్పీటీసీ స్థానంలో కూడా గెలువలేకపోయింది.

గురువారం
6•6•2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD










## ఉద్యమ ఆకాంక్షల ప్రస్థానంలో
# ఎనిమిదేండ్లు




**తెలంగాణ** ఉద్యమ ఆకాంక్షలకు నిలువెత్తు దివిటీలా నిలిచిన 'నమస్తే తెలంగాణ' అక్షర ప్రస్థానంలో మరో కీలక మజిలీ! ఆనాడు స్వరాష్ట్ర సాధనకోసం ఎత్తిన పిడికిళ్లలో ఒకటై.. ఉద్యమ శక్తులకు అక్షరాయుధాలు అందించిన 'నమస్తే తెలంగాణ'.. ఆ మహత్తర పోరాటం లక్ష్యాన్ని సాధించిన అనంతరం ప్రజల ఆకాంక్షలకు అద్దంపడుతూ తనదైన ప్రత్యేకతను కొనసాగిస్తూనే ఉన్నది! ఆ క్రమంలో సరిగ్గా నేటికి విజయవంతమైన ఎనిమిది వసంతాలు పూర్తిచేసుకున్నది! ఎన్నో ఆశలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ప్రగతిపథంలో పరుగులు తీసే క్రమానికి వెన్నుదన్నులిస్తూ చైతన్య పతాకగా భాసిల్లుతున్నది! అభివృద్ధికి బాసటగా నిలుస్తూ.. బంగారు తెలంగాణ కోసం సాగుతున్న మరో ఉద్యమానికి సైతం బావుటా నెత్తుతామని ప్రతినపూనుతున్నది! మా సంకల్పం.. తెలంగాణ అభ్యున్నతి! తెలంగాణపై మీకున్న అచంచలమైన విశ్వాసమే మా స్ఫూర్తి! ఆ స్ఫూర్తిని కాపాడుకుంటూ.. ఆ సంకల్పాన్ని నెరవేర్చే దిశగా మా ప్రయాణం కొనసాగుతూనే ఉంటుందని సవినయంగా మనవి చేసుకుంటున్నది! ఎనిమిదేండ్లుగా మాకు అండగా నిలిచి.. ప్రధాన స్రవంతి పత్రికల్లో మాకు విశిష్ట స్థానాన్ని కల్పించిన పాఠకులకు సహృదయంతో కృతజ్ఞతాభివందనాలు తెలియజేసుకుంటున్నది! మీ ఆదరాభిమానాలు ఎల్లప్పుడూ ఇలానే ఉండాలని మనసారా కోరుకుంటున్నది!

– ఎడిటర్, నమస్తే తెలంగాణ

## 13 కల్లా రాష్ట్రానికి
# రుతురాగం

- 14 నుంచి రాష్ట్రమంతటా ప్రభావం
- ఎల్లుండి కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా
- తెలంగాణలో సగటు వర్షపాతం పెరుగొచ్చు
- జూలైలో పుంజుకోనున్న వానలు
- నేడు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

14

# బోణీకొట్టిన భారత్

**రోహిత్ అజేయ సెంచరీ .. చాహల్ విజృంభణ**

**దక్షిణాఫ్రికాపై ఆరు వికెట్ల తేడాతో భారత్ ఘనవిజయం**



రోహిత్‌కు కోహ్లీ అభినందన

వివరాలు ఆటలో

## ఈద్ ముబారక్



**భక్తిశ్రద్ధలతో రంజాన్**

హైదరాబాద్‌లోని చారిత్రక సెవెన్‌టూంబ్స్ వద్ద బుధవారం రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం శుభాకాంక్షలతో ఆలింగనం చేసుకుంటున్న చిన్నారులు

6

# నీట్‌లో మన మాధురి టాప్

**నీట్-2019 ఫలితాలు విడుదల**

## జాతీయస్థాయిలో ఏడో ర్యాంకు
## బాలికల విభాగంలో, దక్షిణాది రాష్ట్రాల్లో టాపర్



జీ మాధురిరెడ్డి

- అర్హత సాధించిన 33,044 మంది రాష్ట్ర విద్యార్థులు
- పరీక్షరాసిన తెలంగాణ విద్యార్థుల్లో 67.44% ఉత్తీర్ణత
- టాప్ 50 ర్యాంకర్లలో ముగ్గురు ఏపీ విద్యార్థులు
- దేశవ్యాప్తంగా 56.27% ఉత్తీర్ణత నమోదు
- పరీక్షరాసినవారిలో 52% విద్యార్థులకు అర్హత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ కాలేజీల్లో సీట్ల భర్తీకోసం నిర్వహించిన నీట్-2019 ఫలితాల్లో రాష్ట్రానికి చెందిన 33,044 మంది విద్యార్థులు అర్హత సాధించారు. రాష్ట్రానికి చెందిన జీ మాధురిరెడ్డి.. జనరల్ క్యాటగిరీ మొదటి 50 ర్యాంకుల్లో జాతీయస్థాయిలో 7వ ర్యాంకు సాధించింది. జాతీయస్థాయిలో బాలికల్లో ఆమె టాపర్‌గా నిలువటమేకాకుండా.. దక్షిణాది రాష్ట్రాల్లో కూడా టాప్‌లో ఉన్నారు. రాజస్థాన్‌కు చెందిన నళిన్ ఖండేల్వాల్ జనరల్ క్యాటగిరీలో జాతీయస్థాయి ఒకటో ర్యాంకు సాధించాడు. ఢిల్లీకి చెందిన భవిక్‌బన్సాల్ రెండో ర్యాంకు, యూపీకి చెందిన అక్షంత్‌కౌశిక్ మూడో ర్యాంకు సాధించారు. బాలికల క్యాటగిరీలో మధ్యప్రదేశ్‌కు చెందిన కీర్తిఅగర్వాల్‌కు రెండో ర్యాంకు లభించింది. టాప్ 50లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఖురేషీ అస్రా (ఓబీసీ) పదహారవ ర్యాంకు సాధించింది. ఈమె జాతీయస్థాయిలో బాలికల విభాగంలో మూడో ర్యాంకులో నిలిచింది. ఏపీకి చెందిన పిల్లి భానుశివతేజ 40వ ర్యాంకు, ఎస్ శ్రీనంద్‌రెడ్డి 42వ ర్యాంకు సాధించారు. బుధవారం విడుదలచేసిన నీట్ ఫలితాల్లో టాప్‌టెన్ ర్యాంకుల్లో తొమ్మిదింటిని బాలురే సాధించగా.. ఒక్క ర్యాంకు మాత్రమే బాలికలకు లభించింది. గత నెల ఐదోతేదీన నిర్వహించిన నీట్‌కు దేశవ్యాప్తంగా 15,19,375 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 14,10,755 మంది పరీక్షలకు

మిగతా 6వ పేజీలో




నళిన్ ఖండేల్వాల్

# తిరుగులేని టీఆర్ఎస్

- గ్రామీణ తెలంగాణ గుండె చప్పుడు గులాబీ పార్టీ
- పరిషత్ ఎన్నికల్లో రికార్డుస్థాయి విజయాలు
- సీఎం కేసీఆర్ పథకాలతో బంపర్ మెజార్టీ
- రాష్ట్రంలోని మొత్తం 32 జెడ్పీలకు అన్నింటా గెలుపు
- 445కుపైగా ఎంపీపీ అధ్యక్ష స్థానాలు టీఆర్ఎస్‌కే!

**జెడ్పీటీసీ తుదిఫలితాలు**

| మొత్తంస్థానాలు | టీఆర్ఎస్ | కాంగ్రెస్ | బీజేపీ | ఇతరులు |
|---|---|---|---|---|
| 538 | 449 | 75 | 8 | 6 |



**ఎంపీటీసీ తుదిఫలితాలు**

| జిల్లా | మొత్తం | టీఆర్ఎస్ | కాంగ్రెస్ | బీజేపీ | సీపీఐ | సీపీఎం | ఇతరులు |
|---|---|---|---|---|---|---|---|
| మొత్తం | 5816 | 3548 | 1392 | 208 | 38 | 40 | 590 |

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

పల్లెల్లో గులాబీ జెండా రెపరెపలాడింది. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తొలిసారి జరిగిన స్థానికసంస్థల ఎన్నికల్లో టీఆర్ఎస్ చరిత్ర సృష్టించింది. తెలంగాణ ఉద్యమ సమయంలోనే ఎక్కువ సర్పంచ్‌లు, ఎంపీటీసీలను గెలుచుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి.. అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణస్థాయిలో తిరుగులేని రాజకీయ శక్తిగా ఆవిర్భవించిందని వరుస ఎన్నికలు నిరూపించాయి. ఆ పట్టు ఇసుమంతైనా తగ్గలేదని తాజా పరిషత్ ఎన్నికల ఫలితాలు రుజువుచేశాయి. ఏకంగా రాష్ట్రంలోని అన్ని జెడ్పీ పీఠాలను ఒకే పార్టీ కైవసంచేసుకోవటం, అదికూడా అధికారంలో ఉన్న పార్టీకే దక్కడం దేశ రాజకీయ చరిత్రలో ఇదే తొలిసారిగా పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. 32 జెడ్పీ పీఠాలపై గులాబీ కండువాలే నిండుగా కనువిందు చేయనున్నాయి. మరోవైపు మండల పీఠాల్లోనూ అదే వాతావరణం కనిపిస్తున్నది. ఇప్పటివరకు ఉన్న లెక్కలు, అంచనాల ప్రకారం 445కుపైగా మండల పరిషత్ అధ్యక్ష స్థానాల్లో టీఆర్ఎస్ నాయకులు ఆసీనులుకానున్నారు. 2001 స్థానిక సంస్థల ఎన్నికల పోరుతో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన టీఆర్ఎస్.. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించటానికి కొద్దిరోజుల ముందు జరిగిన ఎన్నికల్లో ఘనవిజయం సాధించి రాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తదుపరి గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో 99 డివిజన్లలో గులాబీ పతాకాన్ని ఎగురవేసి, రాజధానిలోనూ తన పట్టును చూపించింది. ఆర్నెళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 119 స్థానాలకుగాను 88 స్థానాలను ఏకపక్షంగా గెలుచుకొని తెలంగాణలో ఇంటిపార్టీకే ప్రజల మద్దతు ఉందని తేల్చిచెప్పింది. తాజాగా ప్రాదేశిక ఎన్నికలతో టీఆర్ఎస్ తన విజయాన్ని సంపూర్ణం చేసుకున్నట్లయ్యింది. కనీస స్థానాలు సాధించని ప్రతిపక్షాలు రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు పల్లె ఓటర్లను టీఆర్ఎస్‌వైపు నడిపించాయి. తామే

మిగతా 6వ పేజీలో



**పోచంపల్లికి అభినందనలు**

ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అభినందించారు. కేటీఆర్‌ను వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర సీనియర్ నాయకులు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో కలిశారు. దేశచరిత్రలో నిలిచిపోయే మెజార్టీ గెలుపు సాధించిన జిల్లా నాయకత్వం పనితీరుపై కేటీఆర్ హర్షం వ్యక్తంచేశారు.








నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామంలో పాస్‌పుస్తకాలు అందించాలని డాక్యుమెంట్లను చూపుతున్న రైతులు

**ధర్మగంట**

# పైసలిస్తే కానీ ఫైల్ ముట్టేదిలేదు

- రెవెన్యూ అధికారుల వైఖరి.. రైతుకు శాపం
- ఏండ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగినా కనికరంలేని వైనం
- బోరుమంటున్న నారాయణపేట జిల్లా గుడిగండ్ల రైతులు
- వంద మందికిపైగా అన్నదాతలను వెంటాడుతున్న భూసమస్యలు

**రెవెన్యూ** అధికారుల మాయలీలలు చెమటోడ్చి పనిచేసే రైతన్నలకు శాపంగా మారాయి. తమ భూములకు సంబంధించిన రికార్డులు ఉన్నవి ఉన్నట్టుగా ఆన్‌లైన్‌లో ఎక్కించి ఉంటే.. నిశ్చింతగా సాగుచేసుకొంటూ ఉండేవారు. కానీ, అధికారులుచేసిన తప్పుల వల్ల ఉన్న భూమిని కాపాడుకోవడానికే తమ చెమటనంతా ధారపోయాల్సివస్తున్నది. వాళ్లుచేసిన తప్పులను సరిదిద్దడానికి కూడా వారికి లంచం ఇవ్వాల్సిన దుస్థితి. పైసలిస్తే కానీ ఫైలు కదలదు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామంలో వంద మందికిపైగా రైతులు 158 ఎకరాలను కాపాడుకొనేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. అధికారులు మాత్రం ఒకరంటే.. ఒకరిపై నెపం వేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

వివరాలు 7వ పేజీలో

## కొత్త ప్రశ్నపత్రాలతో ఆ రెండు పరీక్షలు

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి అన్ని ఏర్పాట్లు పూర్తి

విద్యార్థులు ఆందోళన చెందనవసరం లేదు

ఇంటర్ బోర్డు సెక్రటరీ అశోక్ స్పష్టీకరణ

6

## అసలేం జరిగింది?

6

- రవిప్రకాశ్‌పై సైబర్‌క్రైం పోలీసుల ప్రశ్నల వర్షం
- కీలక విషయాలపై రెండోరోజు కొనసాగిన విచారణ
- నేడు మరోసారి విచారణకు రావాలని ఆదేశం!
- సత్యాన్ని చంపేయబోతున్నారు: మీడియాతో రవిప్రకాశ్



‘ఈవీఎం’ల ట్యాంపరింగ్‌తోనే బీజేపీ గెలిచింది. బీజేపీ ఎన్ని విచ్ఛిన్నకర యత్నాలు చేసినా బెంగాల్ ప్రజలు ఐక్యంగానే ఉంటారు. భవిష్యత్తులో ప్రజలంతా ఏకంగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడి గెలుస్తారు. మన పోరాటం పవిత్రమైనది. తప్పక గెలుస్తాం.

**మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి**

మమతా బెనర్జీ ఆరోపణలన్నీ అబద్ధాలు. బీజేపీ గెలుపుతో బెంగాల్‌లో పునాదులు కదిలి తృణముల్ కాంగ్రెస్ బలహీనపడింది. ఆ భయంతో మమతా అసత్య ఆరోపణలు చేస్తున్నారు.

**సయాంతన్ బసు, పశ్చిమబెంగాల్ బీజేపీ ప్రధాన కార్యదర్శి**



**చరిత్రలో నేడు**




**1683**

ఇంగ్లండ్, ఆక్స్‌ఫర్డ్‌లో ప్రపంచంలోనే మొట్టమొదటి యూనివర్సిటీ మ్యూజియం ఆష్మోలిన్ మ్యూజియం ప్రారంభం.

**1816**

ఇండోనేషియాలో పేలిన తాంబోరా అగ్నిపర్వతం.





**1844**

ఇంగ్లండ్ లండన్‌లో యంగ్‌మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ)ను ప్రారంభించిన జార్జ్ విలియమ్స్.

సాధారణ ఎన్నికల్లో అసాధారణ మెజార్టీతో బీజేపీ విజయంతో ప్రతిపక్ష పార్టీలన్నీ కకావికలమౌతున్నాయి. మనోధైర్యం కోల్పోవటమే కాదు, పొత్తులకు చెల్లుచీటి చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోంచే యూపీలో బీఎస్పీ ఎస్పీతో తెగతెంపులు చేసుకున్నది. త్వరలో జరుగబోయే 11 శాసనసభ ఉప ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామని మాయావతి ప్రకటించటం ఆశ్చర్యం కలిగించలేదు. రెండు ఏకమై కూడా గతంలో ఒంటరిగా సాధించిన ఓట్ల శాతాన్ని సాధించలేకపోయాయి. దీంతో యూపీలో కుల సమీకరణాల రాజకీయాలకు కాలం చెల్లినట్లేనా అన్నది చర్చనీయాంశం.

**ది హిందూ**

మోదీ నూతన మంత్రివర్గం ప్రపంచ దేశాలతో భారత సంబంధ, బాంధవ్యాలను బలోపేతం చేయాలి. నూతన విదేశాంగ మంత్రిగా ఎస్. జైశంకర్, సహాయ మంత్రిగా హర్దీప్‌సింగ్ పురి దౌత్య సంబంధాలను మెరుగు పర్చాలి. అమెరికా-చైనా మధ్య ఆరంభమైన ట్రేడ్‌వార్‌లో భారత ప్రయోజనాలకు దెబ్బ తగులకుండా వ్యవహరించాలి. గతంలో రష్యా-అమెరికాల మధ్య ప్రచ్ఛన్నయుద్ధకాలంలో చైనా పలువిధాలుగా లాభపడింది. ఇప్పుడు అమెరికా-చైనా మధ్య జరుగుతున్న వాణిజ్యయుద్ధంలో భారత్ తనవైన ప్రయోజనాలను పరిరక్షించుకుంటూ ముందుకుపోవాలి.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# స్థానిక విజయం

పరిషత్ ఎన్నికలలో టీఆర్ఎస్ విజయ దుందుభి మోగించి, తెలంగాణలో తిరుగులేని ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకున్నది. రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు ఎదురులేదనేది ఇప్పటికే స్పష్టమైనప్పటికీ, లోక్‌సభ ఎన్నికలలో పార్టీ ఆశించినట్టు పదహారు స్థానాలు దక్కకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. కానీ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలలో ప్రజలు మళ్ళా టీఆర్ఎస్‌కు అసాధారణ విజయాన్ని కట్టబెట్టారు. ఎన్నికలు జరిగిన మొత్తం 32 జిల్లాల్లోనూ టీఆర్ఎస్ పూర్తి పట్టు సాధించింది. 32 జిల్లాల్లో 5, 817 ఎంపీటీసీ, 538 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో 158 ఎంపీటీసీ, నాలుగు జడ్పీటీసీ స్థానాలను టీఆర్ఎస్ ఏకగ్రీవంగా గెలుచుకున్నది. ఏకగ్రీవంతో కలిపి మొత్తం 3,571 ఎంపీటీసీ, 449 జడ్పీటీసీ స్థానాలను టీఆర్ఎస్ గెలుచుకొని తెలంగాణ వ్యాప్తంగా తన శక్తిని చాటుకున్నది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రతిపక్షాలకు పరిషత్ ఎన్నికలపై కొంచెం ఆశ పుట్టిన మాట వాస్తవం. కానీ కాంగ్రెస్, బీజేపీ ఇతర రాజకీయపక్షాలు చెప్పుకోదగిన బలాన్ని ప్రదర్శించలేకపోయాయి. కాంగ్రెస్ 75 జడ్పీటీసీలను మాత్రమే దక్కించుకున్నది. 1380కి పైగా ఎంపీటీసీలలో విజయం సాధించింది. కాంగ్రెస్‌కు ఏ ఒక్క జిల్లాలోనూ జడ్పీటీసీ బలం సింగిల్ డిజిట్‌కు దాటలేదు. ఐదు జిల్లాల్లో ఒక్క జడ్పీటీసీని గెలుచుకోలేకపోయింది. ఎనిమిది జిల్లాల్లో ఒకే ఒక్క జడ్పీటీసీ వంతున గెలుచుకున్నది. ఆరు జిల్లాల్లో ప్రతిపక్షాలకు ఒక్క జడ్పీటీసీ కూడా దక్కలేదు. పరిషత్ ఎన్నికలలో బీజేపీ బలహీనత స్పష్టంగా బయటపడ్డది. ఎనిమిది జడ్పీటీసీలను, 206 ఎంపీటీసీలను మాత్రమే గెలుచుకోగలిగింది. టీడీపీ 21, వామపక్షాలు 71 ఎంపీటీసీ స్థానాలను మాత్రం గెలుచుకోగలిగాయి. ఓటింగ్ యంత్రాల ద్వారా కాకుండా బ్యాలట్ పత్రాల ద్వారా ఈ ఎన్నికలు జరిగాయి. దీనివల్ల కొందరు నాయకులు తమ పార్టీ పరాజయానికి ఈవీఎంలు కారణమనే అవకాశం లేకుండాపోయింది.

**పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేసి, స్థానిక సంస్థలకు విధులు, బాధ్యతలు అప్పగించాలనేది ముఖ్యమంత్రి సంకల్పం. ప్రజాప్రతినిధులు కూడా బాధ్యతతో వ్యవహరించాలనేది కేసీఆర్ దృక్పథం. ఈ నేపథ్యంలో ప్రజలు స్థానిక సంస్థలలో టీఆర్ఎస్‌కు పట్టం కట్టడానికి ప్రాధాన్యం ఏర్పడ్డ ది. స్థానిక సమరం ముగియడంతో ఎన్నికల ఘట్టం ముగిసింది. కానీ కేసీఆర్ చేపట్టబోయే కార్యాచరణ ముందున్నది. ప్రజలు, స్థానిక ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా ముఖ్యమంత్రి మార్గదర్శనం మేరకు బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలె.**

తెలంగాణ పోరాటంలో కేసీఆర్ నాయకత్వం పట్ల ప్రజలు దృఢమైన విశ్వాసాన్ని ప్రదర్శించారు. సొంత రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీఆర్ఎస్ తెలంగాణ రాజకీయాలను శాసించడానికి కారణం ప్రజల అండదండలే. గత ఐదేండ్లలో పరిపాలనా దక్షుడిగా కేసీఆర్ ఖ్యాతి దేశవ్యాప్తమైంది. ఈ నేపథ్యంలో ప్రజలు టీఆర్ఎస్‌కు అనుకూలంగా ప్రజలు ఏకపక్ష తీర్పు ఇవ్వడం మొదలైంది. గ్రామ పంచాయతీ ఎన్నికలలో కూడా టీఆర్ఎస్ గెలుపు అపూర్వమైనదే. 12, 751 గ్రామాలలో ఎన్నికలు జరిగాయి. ఇందులో 2,134 గ్రామాలలో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగితే, అందులో 1,869 టీఆర్ఎస్‌కే లభించాయి. మొత్తంగా 9,156 గ్రామాలలో టీఆర్ఎస్ గెలిచింది. అసెంబ్లీ ఎన్నికలలోనూ ప్రజలు కేసీఆర్ నాయకత్వం పట్ల అసాధారణ అపారమైన విశ్వాసాన్ని ప్రదర్శించారు. లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రంలో బీజేపీ నాలుగు స్థానాలను గెలుచుకున్నంత మాత్రాన బలపడినట్టు కాదని ఈ పరిషత్ ఎన్నికలతో స్పష్టమైపోయింది. ఒడిశాలో అసెంబ్లీ ఎన్నికలలో బీజూ జనతాదళ్ నాయకుడు నవీన్ పట్నాయక్‌కు ఐదోసారి విజయం అందించిన ప్రజలు లోక్‌సభ ఎన్నికలలో మాత్రం కొంచెం మోదీ వైపు మొగ్గుచూపడం గమనార్హం. తెలంగాణలోనూ మోదీ ప్రభావం కొంత పడినప్పటికీ, బీజేపీ శ్రేణులు ఊహిస్తున్నంత గొప్పగా ఏమీ లేదు. బీజేపీ, కాంగ్రెస్ గెలుచుకున్న లోక్‌సభ స్థానాల పరిధిలోనూ పరిషత్ ఎన్నికలలో టీఆర్ఎస్ ఘన విజయం సాధించింది. కేసీఆర్ పట్ల ప్రజలకున్న దృఢమైన విశ్వాసం పట్ల ఎవరికి అనుమానాలు లేవు. కానీ టీఆర్ఎస్ ఒక పార్టీగా పటిష్టమైన నిర్మాణంతో గ్రామ స్థాయిలో వేళ్ళూనుకున్నదా అనే సందేహాలుండేవి. గ్రామపంచాయతీ, పరిషత్ ఎన్నికల తీరును గమనిస్తే, టీఆర్ఎస్ నిర్మాణం బలంగా ఉన్నట్టు బోధపడుతున్నది.

తెలంగాణ ఏర్పడిన నాటినుంచి వ్యవసాయం, పరిశ్రమలు, విద్య మొదలైన ప్రతిరంగంలో మౌలిక మార్పులు తేవడంపై ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టిసారించారు. పరిపాలనారంగంలో కూడా భారీ మార్పులు చేపడుతున్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగి పరిపాలనారంగం ప్రజలకు చేరువైన తర్వాత జరిగిన మొదటి స్థానిక ఎన్నికలు ఇవి. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో స్థానిక సంస్థలు కీలకమని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే ఏ కార్యక్రమమైనా గ్రామస్థాయిలో అమలుపైనే ఆధారపడి ఉంటాయని ముఖ్యమంత్రి చెబుతుంటారు. బడ్జెట్ రూపకల్పన కూడా గ్రామస్థాయి అవసరాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించారు. పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేసి, స్థానిక సంస్థలకు విధులు, బాధ్యతలు అప్పగించాలనేది ముఖ్యమంత్రి సంకల్పం. ప్రజాప్రతినిధులు కూడా బాధ్యతతో వ్యవహరించాలనేది కేసీఆర్ దృక్పథం. ఈ నేపథ్యంలో ప్రజలు స్థానిక సంస్థలలో టీఆర్ఎస్‌కు పట్టం కట్టడానికి ప్రాధాన్యం ఏర్పడ్డది. స్థానిక సమరం ముగియడంతో ఎన్నికల ఘట్టం ముగిసింది. కానీ కేసీఆర్ చేపట్టబోయే కార్యాచరణ ముందున్నది. ప్రజలు, స్థానిక ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా ముఖ్యమంత్రి మార్గదర్శనం మేరకు బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలె.

**జనగళం**

## మసకబారిపోతున్న బాల్యం

‘భారతదేశ విద్యావ్యవస్థ లోపభూయిష్టంగా మారింది, తక్షణం విద్యా వ్యవస్థలో ప్రక్షాళన, పరీక్షా విధానంలో మార్పులు అవసరం‘ అని మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి 2001లోనే అన్నారు. కానీ నేడు లోపభూయిష్టంగా విద్యావిధానం, పరీక్షల నిర్వహణ వల్ల విద్యార్థుల బాల్యం మసకబారిపోతున్నది. ఈ తరుణంలో విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తక్షణ చర్యలు తీసుకురావాల్సిన అవసరం ఉన్నది.

లోపాల వల్ల విద్యార్థుల్లో ఆత్మగౌరవం స్థానంలో ఆత్మ న్యూనతా భావం ఎక్కువవుతున్నదనిపిస్తున్నది. ఆత్మవిశ్వాసానికి బదులు ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఆత్మ సంయమనం స్థానంలో క్షణికావేశాలు పేట్రేగిపోతున్నాయి. లోపాల వల్ల విద్య ఉద్దేశాలన్నీ మసకబారిపో తున్నాయి. విద్యార్థులను నైతికంగా ఉన్నతులుగా తీర్చిది ద్దాల్సిన వ్యవస్థ కేవలం ఉద్యోగులను తయారుచేసే కర్మా గారాలుగా తయారయ్యాయి. గత దశాబ్దకాలం నుంచి విద్యారంగంలో నైతిక విలువలు, మానవీయ విలువలు పతనమయ్యాయనడంలో సందేహం లేదు.

విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వానికి దోహదపడే నాలుగు పద్ధతులు నైపుణ్యాలు, మానవీయ విలువలు, శారీరక వ్యాయామం జ్ఞానాన్ని అందించడం ఒకప్పుడు ఉండేవి. కానీ నేడు అందుకు భిన్నంగా కేవలం ఉద్యోగానికి అవసరమయ్యే ఆర్థికాభివృద్ధికి సహాయపడే నైపుణ్యాల ద్వారానే నేడు జ్ఞాన సముపార్జన విద్యార్థులకు అందుతున్నది.

విద్యలో నైతిక విలువల గురించి 1948 రాధాకృష్ణన్ కమిటీ, 1965 కొఠారీ కమిటీలు చెప్పినప్పటికీ పాలకులు, అధికారులు వాటిని విస్మరించారు. దీంతో విద్యా వ్యవస్థలో స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం కనిపించకుండా పోయాయి. ఉన్నత విద్యలో మానవీయ కోణం స్పృశించాలని సూచించినప్పటికీ అవి ఆచరణలో, అమలులో విఫలమవ్వటం ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

మనం భూమి విలువను ఎలా అంచనా వేస్తామో అలాగే విద్యా విలువను అంచనా వేస్తాం. ఎక్కువ సంపాదన తెచ్చే విద్య కావాలనుకుంటాం. నేడు తల్లిదండ్రులు విద్యార్థుల శీల నిర్మాణం, నడవడిని మెరుగుపర్చే విద్య గురించి అసలు ఆలోచించడం లేదు. అందుకే మొదట తల్లిదండ్రుల్లో మార్పు వస్తేనే విద్యా సమాజం ఆరోగ్యవంతమైన సమాజంగా, ఆత్మహత్యలు లేని సమాజంగా మార్పు చెందుతుంది.

**- ఎం.ఎన్.విజయకుమార్, ఉపాధ్యాయులు**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

**ఆలోకన**



**టంకశాల అశోక్**


# శూన్య పరంపర ముగియునా?

భారతదేశం గత 70 సంవత్సరాలుగా ఒక శూన్య పరంపరంలో కొనసాగుతూ వస్తున్నది. స్వాతంత్ర్యోద్యమ ఆకాంక్షలు, రాజ్యాంగ లక్ష్యాలను నెరవేర్చగలమని పాలకులు హామీ ఇచ్చి విఫలం కావటం, దాని పర్యవసానంగా శూన్యం ఏర్పడటం, అవే హామీలతో అధికారానికి వచ్చినవారు కూడా విఫలమై తిరిగి శూన్యాన్ని సృష్టించటం పలుమార్లు జరిగింది. సిద్ధాంతాలతో నిమిత్తం లేకుండా అన్ని పార్టీలు ఆ విధంగా విఫలమయ్యాయి. ఈ పరంపరలో నరేంద్ర మోదీ మొదటి విడుత ప్రభుత్వం కూడా ఒక భాగమైంది. అందుకు ఆయన రెండవ ప్రభుత్వం ముగింపును పలుకగలదా?

ఎన్నికలలో ఘన విజయం సాధించిన తర్వాత మోదీ మే 25వ తేదీన ఢిల్లీలో మాట్లాడుతూ, ‘మన రాజ్యాంగం విలువలతో, సమ్మిళిత దృష్టితో కూడుకున్నది. స్వాతంత్రోద్యమకారులు దేశం కోసం కన్న కలలు నిక్షిప్తమై ఉన్న సుసంపన్నమైన, విస్తృతమైన సామాజిక పత్రం అది. అటువంటి రాజ్యాంగానికి, అందులోని విలువలకు మాత్రమే మనం విధేయులమై ఉండాలి’ అని తమ పార్టీ నాయకత్వాన గల ఎన్డీయే కూటమి ఎంపీలతో అన్నారాయన. తర్వాత మరికొన్ని నిర్దిష్టమైన అంశాల్లోకి వెళ్లారు. తమ మొదటి విడుత పాలనలో పేదరికాన్ని దెబ్బతీశామని, ఈ రెండవ విడుతలో ఆ కృషిని కొనసాగించటంతో పాటు, దేశంలోని అల్ప సంఖ్యాక వర్గాలను ఆవరించిన ఉన్న భయాందోళనలను పారదోలాలని కోరారు. బహుశా ఈ రెండవ అంశాన్ని దృష్టిలో ఉంచుకునే కావచ్చు, ‘మనం ఒక ప్రభుత్వంగా చాలా మంచి పనిచేసినా, అందువల్ల వచ్చిన మంచిపేరు ఒక్క పొరపాటు మాటతో చెడిపోగలదు’ అని హెచ్చరించారు. తన ప్రభుత్వంలోని, పార్టీలోని కొందరు హిందూ మతతత్వ తీవ్రవాదులు తమ ప్రకటనలతో గత అయిదేండ్ల పొడువునా సృష్టించిన సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఆయన ఈ హెచ్చరిక చేశారేమో తెలియదు. తర్వాత రెండు రోజులకు 27వ తేదీన వారణాసిని సందర్శించిన ప్రధానమంత్రి, ‘మేము విచ్ఛిన్నకారులం కాము. ఐక్యత అనే మం త్రంతో ముందుకు సాగుతాము’ అని ప్రకటించారు. అప్పటికి ఆమెరిక న్ మేగజైన్ టైమ్ ఆయనను, భారతదేశపు ప్రధాన విచ్ఛిన్నకారునిగా అభివర్ణిస్తూ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది.

ఇదంతా ఇంతగా రాయటం ఎందుకంటే, ప్రధాని మోదీ ప్రస్తావించిన స్వాతంత్రోద్యమకారుల కలలు, రాజ్యాంగపు సామాజిక లక్ష్యాలు మొదలైన వాటిని తనకన్న ముందు పరిపాలించినవారు ఏ విధంగా భంగపరిచి శూన్యాలను సృష్టించారో, తన మొదటి విడుత పాలనలో ఆయన కూడా అదే పనిచేశారు. పైన అనుకున్న కలలు, లక్ష్యాలన్నవి ఏదో ఒక రూపంలో లేవు. అవి పేదరికం నిర్మూలన, ఆర్థికాభివృద్ధి, సామాజిక సంస్కరణలు, సామాజికంగా సమ్మిళిత దృష్టి, సమర్థవంతమైన పాలన, అవినీతి నిరోధం, అన్నివర్గాల అన్ని ప్రాంతాల సమతులనాభివృద్ధి, అల్పసంఖ్యాక వర్గాలూ ఇతర బలహీన వర్గాల పరిరక్షణ, సర్వమత సమానత్వం వంటి అనేకానేక రూపాల్లో ఉన్నాయి. గత 70 ఏండ్ల పాటు దేశాన్ని, రాష్ట్రాలను పరిపాలించిన వివిధ పార్టీలు, ఐక్య సంఘటనల వారు ఇందులో ఏదో ఒకమేరకు అన్నింటిలోనూ విఫలమైనవారే.

అందువల్లనే శూన్యాలు ఏర్పడ్డాయి. ఒకరు సృష్టించిన శూన్యం తర్వాత మరొకరి శూన్యం వచ్చి, అదొక శూన్యపరంపరగా మారింది. ఇందులోని ప్రధానమైన దశలను చెప్పుకోవాలంటే, మొదటి ప్రధాని నెహ్రూ తన శక్తిమేరకు కృషిచేసినా అప్పటి ఫ్యూడల్-పెట్టుబడిదారీ-అంతర్జాతీయ వ్యాపార వర్గాల బలిమి వల్ల, తను మరణించిన కొద్దికాలానికే మొదటి పెద్ద శూన్యం ఏర్పడింది. ఆయన తర్వాత ప్రధాన మంత్రులు అయిన లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీల గురించి దేశానికి కొన్ని రాజకీయాలు, కొన్ని అట్టహాసపు నినాదాల గురించి మాత్రమే తెలుసు. అంతే తప్ప వారి పొలిటికల్ ఎకానమీ గురించి తెలియదు. అటువంటి విధానాలు,పరిపాలనా ఫలితంగా రెండవ శూన్యం ఏర్పడింది. వీరికన్న ఎక్కువ ప్రజాస్వామిక వాదులమని, ప్రజలకు అనుకూలమైన వారమని, నైతిక విలువలు కలవారమని హామీనిస్తూ వేర్వేరు దశలలో అధికారానికి వచ్చిన వివిధ ఫ్రంట్‌లు అనేక విషయాల్లో అంతే దారుణంగా విఫలమై దేశంలో మూడవ శూన్యం ఏర్పడింది.



**1984లో కేవలం 2 సీట్లుండిన బీజేపీ ఇప్పుడు 2019లో 303కు చేరింది. ఈ మూడు దశాబ్దాలలో ఇతరులు తమకు తమ దిద్దుబాటు చర్యలు ఏవీ చేపట్టలేదు. 2004, 2009లో అధికారానికి వచ్చిన కాంగ్రెస్ నాయకత్వ కూటమి తిరిగి విఫలమై తన వెనుకటి శూన్యాన్ని మరొకమారు సృష్టించింది. మొదటి మారు శూన్యం విషాదం కాగా, తర్వాతి శూన్యాలు ప్రహసనంగా మారాయి. ఇదే సమయంలో మరొకవైపు గమనించదగిన ఆసక్తికరమైన పరిణామం ఒకటుంది. అది వాజపేయి నాయకత్వాన ఏర్పడిన మితవాద-మత వాద ప్రభుత్వానిది.**

మొత్తంమీద పార్టీలు మారినా, 1952 నుంచి వాజపేయి కాలం వరకు పాలించినవి అన్నీ స్థూలంగా లెఫ్ట్ ఆఫ్ ద సెంటర్ పొలిటికల్ ఎకానమీ వైఖరి గలవే. స్వాతంత్ర్యోద్యమ ఆశయాలను, రాజ్యాంగ లక్ష్యాలను వారు చిత్తశుద్ధితో నెరవేర్చబూనితే వారికి ప్రజలు అండగా నిలిచి ఉండేవారు. దేశంలో శూన్యత అంటూ ఏర్పడేది కాదు. ఒకవేళ కాంగ్రెస్ వల్ల శూన్యత ఏర్పడినా దానిని వివిధ ఫ్రంట్‌లు, వామపక్షాలు కలిసి పూరించగలిగేవి. కానీ, మాటలలో ఎవరేమి చెప్పినా, చేతతలలో అరకొర పనులు కొన్ని చేసి ఉండినా, మొత్తంమీద చూసినప్పుడు విఫలమై శూన్యాలను సృష్టించారు. ఆ వరుస శూన్యాలలోకి ఆ దశలో మొదటిసారిగా మితవాదం-మతవాదం బీజేపీ రూపంలో ప్రవేశించటాన్ని చూడవచ్చు.

ఇది ఇప్పటికి సరిగా ముప్పయ్యేళ్ల కథ. 1984లో కేవలం 2 సీట్లుండిన బీజేపీ ఇప్పుడు 2019లో 303కు చేరింది. ఈ మూడు దశాబ్దాలలో ఇతరులు తమకు తమ దిద్దుబాటు చర్యలు ఏవీ చేపట్టలేదు. 2004, 2009లో అధికారానికి వచ్చిన కాంగ్రెస్ నాయకత్వ కూటమి తిరిగి విఫలమై తన వెనుకటి శూన్యాన్ని మరొకమారు సృష్టించింది. మొదటి మారు శూన్యం విషాదం కాగా, తర్వాతి శూన్యాలు ప్రహసనంగా మారాయి. ఇదే సమయంలో మరొకవైపు గమనించదగిన ఆసక్తికరమైన పరిణామం ఒకటుంది. అది వాజపేయి నాయకత్వాన ఏర్పడిన మితవాద-మత వాద ప్రభుత్వానిది.

భారతదేశ ఎన్నికల చరిత్ర లెఫ్ట్ ఆఫ్ ద సెంటర్ ప్రభుత్వాల వరుస వైఫల్యాల తర్వాత మొదటిసారిగా వాజపేయి నాయకత్వాన బీజేపీకి అధికారాన్ని ఇవ్వగా, శూన్యాన్ని పూరించటంలో ఆ శక్తులు కూడా విఫలమయ్యాయి. పైన పేర్కొన్న ఏ శక్తులైతే జవహర్‌లాల్ ప్రభుత్వాన్ని విఫలం చేసాయో ఆశక్తుల పట్టు ఆర్థిక-రాజకీయ-పరిపాలనారంగాలపై ఆ తర్వాత కొనసాగటమే గాక మరింత పెరిగింది. అందుకు బీజేపీ కాలంలో మతవాదం, మితవాదం అదనంగా వచ్చిచేరాయి. వాజపేయి ప్రభుత్వం కొన్ని తళుకుబెళుకులను చూసుకొని ‘ఇండియా షైనింగ్’ నినాదాన్ని ఇచ్చింది. కానీ స్వాతంత్రోద్యమ కాలపు ఆకాంక్షలకు, రాజ్యాంగ లక్ష్యాలకు క్షేత్రస్థాయిలో జరుగుతున్నదేమిటో గమనించలేకపోయింది. అట్లా గమనించనందువల్లనే తనకు ముందటి ప్రభుత్వాలన్నీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి శూన్యాలు ఏర్పడగా, తిరిగి అవే వైఫల్యాలకు తాను కూడా పాల్పడింది. తర్వాత వరుసగా రెండు ఎన్నికలలో (2004, 2009) బలాన్ని కోల్పోయి తనకు తాను శూన్యాన్ని సృష్టించుకుంది. విశేషమేమంటే, వాజపేయికి ముందు వరకు విఫలమైన లెఫ్ట్ ఆఫ్ ద సెంటర్ శక్తులు 2004-14 మధ్య అవకాశం వచ్చికూడా ఆ శూన్యాన్ని పూరించలేకపోయాయి. అనగా, మొద ట పేర్కొన్న సామాజిక-ఆర్థిక-అంతర్జాతీయ శక్తుల ప్రాబల్యాన్ని వదిలించుకోకపోవటమే గాక, అందుకు స్వప్రయోజనాల కోసం లోబడిపోయాయన్నమాట.

దాని ఫలితంగా ఏర్పడిన మరొక శూన్యంలోకి బీజేపీ అనే మితవాద-మతవాద శక్తి 2014లో రెండవసారి ప్రవేశించింది. అట్లా ప్రవేశించి 2019 వరకు ఐదేండ్ల పాటు పరిపాలించిన తీరు స్వాతంత్రోద్యమకాలపు ఆకాంక్షలను, రాజ్యాంగ లక్ష్యాలను నెరవేర్చగల విధంగా సాగిందా అన్నది అన్నింటికన్న ముఖ్యమైన ప్రశ్న. ఆ పని జరిగితే అప్పటికి గల శూన్యాన్ని తను పూరించినట్లే. కానీ నరేంద్ర మోదీ అయిదేండ్ల పాలనను నిర్వికారంగా మదింపుచేసినట్లయితే, అది స్వాతంత్ర్యోద్యమకారుల ఆకాంక్షలను, రాజ్యాంగ లక్ష్యాలను నెరవేర్చగల విధంగా సాగినట్లు తోచదు. అనగా శూన్యం కొనసాగుతున్నదన్నమాట. పైన పేర్కొన్న సూత్రాలను చెప్పిన మోదీ రెండవ విడుతలోనూ బెంగాల్‌లో మమత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మత నినాదాలు, దాడులకు గురవుతున్న ముస్లింలు, హిందీ సమస్యలు ఇప్పటికే మొదలయ్యాయి. ఆయన 2014 కన్నా ఘన విజయం సాధించి ఉండవచ్చు గాక. గెలిచిన తర్వాత ఢిల్లీలో, వారణాసిలో ఏమైనా మాట్లాడవచ్చు గాక. కానీ వాస్తవ పరిస్థితులకు అవి 2014-19 మధ్య గీటురాళ్లు కాలేదు. 2019 నుంచి అవుతాయా? మహా శూన్యం అంతరిస్తుందా? సందేహమే.

# గులాబీ పార్టీ వికసించింది

**విశ్లేషణ**



**ఇలపావులూరి మురళీమోహన రావు**

**కారు జోరుకు బ్రేకులు పడినాయి**
**కేసీఆర్ ఖతమైండు**
**కేటీఆర్ పనయిపోయింది**
**గులాబీ వాడిపోయింది..**
**ఇక రాబోయే ఎన్నికల్లో అధికారం మాదే!**

అరెరెరె.. సంబురపడినంత సమయం పట్టలేదే వారి ఆశలు అడియాసలు కావడానికి!

గతేడాది డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో రికా ర్డు స్థాయిలో ఆధిక్యత సాధించి అధికారం చేపట్టిన తెలంగాణ రాష్ట్ర సమితి మొన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఊహించని ఎదురుదెబ్బతిన్నది. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క స్థానం మాత్రమే గెలుచుకున్న బీజేపీ, పందొమ్మిది స్థానాలు గెలిచిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్యంగా వరుసగా నాలుగు, మూడు ఎంపీ సీట్లను గెలిచాయి. రాజకీయ పరిశీలకులు కూడా ఆ పార్టీలు అన్ని స్థానాలను గెలుస్తాయని ఊహించలేకపోయారు. కేవలం ఆరు మాసాలలోనే అధికార టీఆర్ఎస్ పార్టీకి ఇంత వ్యతిరేకత ఎలా వచ్చిందో అంతుబట్టలేదు. వ్యతిరేకత రావడానికి ఈ ఆరు నెలల్లో కేసీఆర్ చేసిన ప్రజావ్యతిరేక కార్యక్రమాలు ఏమీ లేవు. ఆయన పాలన యథావిధిగా ప్రజాపక్షానే సాగుతున్నది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పుంజుకునేంతగా చేసిన ఉద్యమాలు ఏమీ లేవు. కారుకు పదహారు సీట్లు గ్యారంటీ అని అందరూ నమ్మారు. కానీ, కారు తొమ్మిది స్థానాలు మాత్ర మే గెలువగలిగింది. కాంగ్రెస్, బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో అన్ని సీట్లను సాధించడానికి అభ్యర్థుల ఎంపిక కొంతమేర ఎదురుతన్నింది. టీఆర్ఎస్ అతివిశ్వాసం, స్థానిక నాయకులను గుడ్డిగా నమ్మడం, వారు సమన్వయం తో పనిచేయకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే టీఆర్ఎస్ స్థానాలు తగ్గాయని పార్టీ వారు విశ్లేషించారు. అంతేకాకుండా, పరస్పరం విమర్శలు చేసుకునే కాంగ్రెస్, బీజేపీలు లోక్‌సభ ఎన్నికల విషయం వచ్చేసరికి అంతర్గతంగా రహస్య ఒప్పందాలు చేసుకున్నాయని, ఓట్ల మార్పిడి చేసుకున్నాయని ఆనాడే కొందరు వ్యాఖ్యానించారు. నిన్నటి స్థానిక సంస్థల ఎన్నికల్లో అది నిజమేనని రుజువైంది.

మొన్ననే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం స్థానాలు గెలిచిన గులాబీ పార్టీ కైవసం చేసుకొని రెండురోజులు తిరుగకుండానే, దేశ చరిత్రలో తొలిసారిగా నూటికి నూరు శాతం జిల్లా పరిషత్తులను కైవసం చేసుకొని చరిత్రను సృష్టించింది. ముప్పై రెండుకు గాను ముప్పై రెండు జిల్లా పరిషత్తు భవనాలపై గులాబీ జెండా రెపరెపలాడింది. అలాగే మండల పరిషత్తులో అరువై రెండు శాతం స్థానాలను కొల్లగొట్టి ప్రతిపక్ష పార్టీలను నిరుత్తరులను చేసింది. 538 జడ్పీటీసీ స్థానాలకుగాను కాంగ్రెస్ 76 స్థానాలను మాత్రమే గెలుచుకోగా, బీజేపీ మరీ ఘోరంగా రెండంకెల సీట్లు కూడా గెలువలేకపోయింది. ఇక 5817 ఎంపీటీసీ స్థానాలకుగాను కాం గ్రెస్ 1377 స్థానాలు మాత్రమే గెలిచింది. బీజేపీ ఇంకా ఘోరంగా 211 సీట్లు మాత్రమే గెలిచి తన ఉనికి నామమాత్రమేనని చాటుకున్నది.



**పల్లెలు, పట్టణాలు, నగరాలు గులాబీకే జై కొట్టాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కారు క్లీన్‌స్వీప్ చేసింది. మొన్న లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి ఓడిపోవడంతో మళ్ళీ అవే ఫలితాలు వస్తాయని ఆశించిన ప్రతిపక్షాల కలలు చెదిరిపోయాయి. జిల్లా మొత్తం గులాబీకి పట్టం గట్టింది. రంగారెడ్డి, ఉమ్మడి వరంగల్, పాలమూరు, నల్గొండ జిల్లాలే గాక అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో కూడా గులాబీ ప్రభంజనమే వీచింది. కమలం సంపూర్ణంగా వాడిపోగా, హస్తానికి రిక్తహస్తం మాత్రమే మిగిలింది.**

పల్లెలు, పట్టణాలు, నగరాలు గులాబీకే జై కొట్టాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కారు క్లీన్‌స్వీప్ చేసింది. మొన్న లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి ఓడిపోవడంతో మళ్ళీ అవే ఫలితాలు వస్తాయని ఆశించిన ప్రతిపక్షాల కలలు చెదిరిపోయాయి. జిల్లా మొత్తం గులాబీకి పట్టం గట్టింది. రంగారెడ్డి, ఉమ్మడి వరంగల్, పాలమూరు, నల్గొండ జిల్లాలే గాక అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో కూడా గులాబీ ప్రభంజనమే వీచింది. కమలం సంపూర్ణంగా వాడిపోగా, హస్తానికి రిక్తహస్తం మాత్రమే మిగిలింది. కేసీఆర్ పాలనకు జనం మరోసారి జేజేలు కొట్టారు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని కొంచెమైనా ఆస్వాదించకుండానే ఓటర్లు ఇచ్చిన తీర్పుతో హస్తం, కమలం ఒక్కసారిగా విషాదయోగంలోకి జారుకోవాల్సి వచ్చింది. మొన్నటి ఆ రెండు పార్టీల విజయం వాపే తప్ప బలం కాదని తేలిపోయింది!

ఏకపక్షంగా వచ్చిన ఈ చరిత్రాత్మక తీర్పుతో తెలంగాణ మొత్తం కేసీఆర్ వెంట నిలిచారన్న వాస్తవం మరోసారి స్పష్టమైంది. మధ్యలో ఇచ్చినది ఒక చిన్న కుదుపు మాత్రమేనని, ప్రజల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, 24 గంటలూ ప్రజా క్షేమం కోసమే పాటుపడాలని సీఎం కేసీఆర్‌కు ఓటర్లు సూచించారు. ఇంకా చెప్పుకోవాలంటే సీఎం కేసీఆర్‌కు మొన్నటి తీర్పు ఎనలేని ఆత్మవిశ్వాసాన్ని, వెయ్యేనుగుల బలాన్ని ప్రసాదించింది. ఈ విజయం పట్ల పొంగిపోకుండా, తమ కోసం ఎప్పుడూ పనిచేస్తే విజయం మీదేనని బోధించారు. రాజకీయరంగం ఒక నిరంతర రణక్షేత్రం. పోరాటంలో ఏ మాత్రం అలసత్వం పనికిరాదు. అందునా, చిత్తశుద్ధి, ప్రజాక్షేమం పట్ల అనురక్తి కలిగిన కేసీఆర్ లాంటి ముఖ్యమంత్రి పాలన మీదే గాక ఎన్నికల వ్యూహాల మీద కూడా ఎల్లప్పుడూ ఒక కన్ను వేసే ఉంచాలని నిన్నటి ప్రజా తీర్పు ద్వారా వెల్లడైంది.

**(వ్యాసకర్త: సీనియర్ రాజకీయ విశ్లేషకులు)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# పైసలిస్తే కానీ ఫైల్ ముట్టేది లేదు

- రెవెన్యూ అధికారుల వైఖరి.. రైతన్నలకు శాపం
- ఏండ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగినా కనికరంలేని వైనం
- బోరుమంటున్న నారాయణపేట జిల్లా గుడిగండ్ల రైతులు
- వంద మందికిపైగా అన్నదాతలను వెంటాడుతున్న భూసమస్యలు

**మక్తల్, నమస్తే తెలంగాణ**

మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామానికి చెందిన సుమారు వంద మందికిపైగా రైతులు 158 ఎకరాల భూపట్టాలకు సంబంధించిన సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగాచేపట్టిన భూ సమగ్రసర్వేలో రెవెన్యూ అధికారుల తప్పిదాల వల్ల నేటికీ రైతులకు కొత్త పాస్‌పుస్తకాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే.. పాస్‌పుస్తకాలు రావు.. మీ దిక్కున్నచోట చెప్పుకోండని రైతులపై దాష్టీకం ప్రదర్శిస్తున్నారు. కొందరు రైతులు తమ విరాసత్‌కు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో అందించినప్పటికీ పనిచేయకుండా సతాయిస్తున్నారు. రైతుల పక్షాన నిలిచి భూసమస్యలను పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులే.. వాళ్ల పాలిట శత్రువులుగా మారుతున్నారు. ముఖ్యంగా గుడిగండ్ల గ్రామంలో పనిచేస్తున్న వీఆర్వో అలసత్వం రైతులకు ప్రాణసంకటంగా మారింది. విరాసత్‌లో డాక్యుమెంట్ ఇంప్లిమెంటేషన్‌చేసి నూతన పాస్‌పుస్తకాలు అందించాలని ఎన్నిసార్లు అర్జీ పెట్టుకొన్నా.. ఆయన పట్టించుకోలేదు. గ్రామంలో వందమందికి పైగా రైతులకు నేటికి కూడా కొత్త పాస్‌పుస్తకాలు రాక.. ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు ఎవరికీ అందలేదు. రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగలేక.. తమ గోడు ఎవరు వింటారో అర్థం కాక రైతులు బోరుమంటున్నారు. రైతులకు నిరంతరం సేవలు అందించాల్సిన వీఆర్వో.. పైసలిస్తే కానీ ఫైల్ ముట్టేది లేదన్నట్టుగా వ్యవహరిస్తూ సమస్యలను పరిష్కరించకపోవడంతో బాధితులు అరిగోస పడుతున్నారు.

### విరాసత్ అయినా ఆన్‌లైన్‌లోకి రాలేదు



మా మామగారి పేరు మీద ఉన్న భూమి నాపేరుపై విరాసత్ అయి ఏడాది గడిచింది. అయినా అధికారులు నాకు కొత్త పాస్‌పుస్తకం ఇవ్వలేదు. దీనివల్ల ప్రభుత్వం అందించే రైతుబంధు పెట్టుబడి సాయాన్ని పొందలేకపోతున్నా. నా భూమికి సంబంధించిన రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని ఎన్నిసార్లు తిరిగినా అధికారులు కనికరించడం లేదు.

**- రాములమ్మ, గుడిగండ్ల**

### కాళ్లరిగేలా తిరుగుతున్న



మా నాన్నగారి మరణం అనంతరం ఆయన పేరు మీద ఉన్న భూమి నా పేరు మీదికి విరాసత్ చేయాలని తాసిల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా.. అధికారులు కనికరించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. వీఆర్వో దృష్టికి నా సమస్యను ఎన్నిసార్లు తీసుకెళ్లినప్పటికీ స్పందించకపోవడం వల్ల నా సమస్య అలాగే మిగిలిపోయింది. ఎప్పుడు పరిష్కారమవుతుందో..

**- బాలయ్య, గుడిగండ్ల**

### నా భూమి నాకుంటదా?



ఏడాది క్రితం సర్వే నంబర్ 14/ఇలోఉన్న 3.27 ఎకరాల భూమిని కొన్నా. ఆ భూమికి డాక్యుమెంట్‌ను నా పేరుపై మార్పిడిచేసి నూత న పాస్‌పుస్తకాన్ని అందజేయాలని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. అధికారులు నేడు, రేపు అంటూ తిప్పుతున్నారు తప్ప నేటి వరకు పుస్తకమివ్వలేదు. నేను కొన్న భూమి నా పేరుమీదకు అవుతుందా లేదా అన్న భయం పట్టుకున్నది.

**- అనిత, గుడిగండ్ల**

### ఏడాదైనా చేస్తలేరు..



గ్రామంలో కొనుగోలుచేసిన భూమి రిజిస్టర్ డాక్యుమెంట్ ద్వారా నాపేరుపై పట్టా మార్పిడిచేయాలని అధికారులకు అందజేసినప్పటికీ వీఆర్వో నిర్లక్ష్యం, తప్పిదాల వల్ల ఏడాదైనా పట్టా మార్పిడి జరుగలేదు. కొత్త పాస్‌పుస్తకం రాలేదు. దీంతో ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు పెట్టుబడి సాయానికి అనర్హుడిగా మిగిలిపోయా. నాకు న్యాయంచేసేవారెవరు.

**- కుర్వ మల్లప్ప, గుడిగండ్ల**

### చాలా ఇబ్బందులు పెడుతున్నరు



మా నాన్నగారి పేరు మీద ఉన్న భూమి మా ఇద్దరు అన్నదమ్ముల పేరు మీద విరాసత్ అయినప్పటికీ అధికారులు ప్రొసిడింగ్ మాత్రమే అందించి చేతులు దులుపుకున్నారు. మా పేర్లను ఆన్‌లైన్‌లో నమోదుచేసి కొత్త పాస్‌పుస్తకాలను అందించాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా స్పందించడంలేదు. ఎంతో విసుగు చెందుతున్నాం.

**- చాంద్‌పాషా, గుడిగండ్ల**

### రైతుబంధు అందలేదు



రైతుబంధు అందక ఇబ్బందులు పడుతున్నా. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, వారి తప్పిదాల వల్ల నాతోపాటు నా ఇద్దరు కుమారులకు కొత్త పాస్‌పుస్తకాలు నేటికీ అందలేదు. దీంతో ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయాన్ని కోల్పోతున్నాం. కిందిస్థాయి సిబ్బంది లీలలపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి రైతులకు న్యాయంచేయాలి.

**- వెంకటయ్య, గుడిగండ్ల**

### ఇంత నిర్లక్ష్యం ఎందుకో?



కొత్త పాస్‌పుస్తకం ఇవ్వాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయా. అయినా వాళ్లు కనికరించలేదు. రెండు విడుతల రైతుబంధు సాయాన్ని కూడా కోల్పోయా. మూడో విడుతలోనైనా రైతుబంధు సాయం అందుతుందేమోనని అనుకుంటే.. అధికారుల నిర్లక్ష్యంతో అది కూడా అందేటట్టు కనిపించడం లేదు. అధికారులకు రైతులంటే ఇంత నిర్లక్ష్యం, చిన్నచూపు ఎందుకో అర్థం కావడంలేదు.

**- హన్మంత్‌గౌడ్, గుడిగండ్ల**

### నా పేరు మీదకు మారలేదు



నాలుగేండ్ల క్రితం 2.04 ఎకరాల భూమి కొన్నా. భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను రెవెన్యూ అధికారులకు అప్పజెప్పి నా పేరు మీదకు మార్పిడిచేయాలని కోరినప్పటికీ పట్టించుకోలేదు. నాలుగేండ్లుగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు తప్ప పేరు మార్పిడిచేయడం లేదు. నా భూమి నాకు దక్కుతుందో లేదో అని భయమేస్తున్నది.

**- సుబాని, రైతు, గుడిగండ్ల**

### త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తా



మక్తల్ మండలంలోని గుడిగండ్ల గ్రామంలో ఉన్న పట్టామార్పిడి, విరాసత్, ఆన్‌లైన్, కొత్త పాస్‌పుస్తకాల పంపిణీ సమస్యలను త్వరలోనే పరిష్కరించి భూసమస్యలను ఎదుర్కొంటున్న రైతులందరికీ న్యాయంచేసే దిశగా చర్యలు చేపడుతా. విధుల పట్ల నిర్లక్ష్యం వహించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు సమాచారాన్ని చేరవేస్తాం.

**- శ్రీనివాసులు, తాసిల్దార్, మక్తల్**

## అలిసిపోతున్నా..!

తాసిల్దారు కార్యాలయానికి తిరిగి తిరిగి అలిసిపోతున్నా... మా భూమికి సంబంధించిన పాస్‌పుస్తకాలు ఇవ్వాలని ఎన్నిసార్లు అడిగినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. మాది గద్వాల జిల్లా అయిజ, మా గ్రామ శివారులోని సర్వే నంబర్ 286/జిలోని రెండెకరాల భూమికి సంబంధించిన పట్టాదార్ పాస్‌పుస్తకం ఇవ్వడంలేదు. సర్వే నంబర్ 285 పరిధిలోని మూడెకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పాస్‌పుస్తకం కూడా ఇస్తలేరు. తాసిల్దారు కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మాకు రైతుబంధు సాయం అందడం లేదు. రెవెన్యూ అధికారులు సమస్యను పరిష్కరించడంలేదు. జిల్లా కలెక్టర్ స్పందించి పాస్‌పుస్తకాలు ఇప్పించాలి.

**- భీమాచారి, జోగుళాంబ గద్వాల జిల్లా**

## టైంపాస్ చేస్తున్నారు..

- మ్యుటేషన్‌కు ఏడాదిగా తిప్పుకుంటున్న అధికారులు



మాది సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం నిజాంపేట గ్రామం. మార్చి 23, 2018న నా భార్య ఎం స్వప్న పేరున నిజాంపేట శివారులోని సర్వే నంబర్ 65అలో 20 గుంటల భూమిని కొనుగోలు చేశా. మ్యుటేషన్ కోసం నారాయణఖేడ్ తాసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నా. ఏడాది దాటినా కాలయాపనచేస్తున్న అధికారులు ఇటీవల మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మీసేవలో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు సర్వే నంబర్ చూపకపోవడంతో ఆలస్యమవుతున్నది. తాసిల్దార్ డిజిటల్ సంతకం చేయకపోవడం వల్ల కొనుగోలు చేసిన భూమి తాలూకు సర్వే నంబర్ ఆన్‌లైన్‌లో చూపడం లేదు. ఈ విషయమై తాసిల్దార్ కార్యాలయంలో సంప్రదిస్తే డిజిటల్ సంతకం పూర్తయింది కానీ, ఆన్‌లైన్ అయ్యేందుకు సమయం పడుతుందని చెప్తున్నారు. ఆన్‌లైన్ చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. రిజిస్ట్రేషన్ అయిన నెలలోగా చేయాల్సిన మ్యుటేషన్ ఏడాది గడిచినా ఇంకా చేయకుండా కుంటిసాకులు చెప్తూ, టైంపాస్ చేయడంలో వారి ఉద్దేశం ఏమిటో అర్థం కావడం లేదు. మ్యుటేషన్ చేసుకోవడం తప్పనిసరి అని చెప్పే అధికారులే నిర్లక్ష్యంగా ఉన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మ్యుటేషన్‌కు సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

**- ప్రభాకర్‌రెడ్డి, స్వప్న భర్త, నిజాంపేట, సంగారెడ్డి జిల్లా**

## భూ పట్టా కోసం ఎక్కని గడప లేదు

- జగిత్యాల జిల్లా గొర్రెపల్లి రైతు మంద శంకరమ్మ ఆవేదన



మంద శంకరమ్మ, రాజం దంపతులు

**మల్లాపూర్:** 'మా భూమికి పట్టా కావాలని ఎక్కని గడప లేదు.. మొక్కని సార్లు లేర్లు.. ఆఫీసుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకుంటలేరు' అంటూ జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం గొర్రెపల్లికి చెందిన రైతు మంద శంకరమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామానికి చెందిన ఓ రైతు నుంచి 2006లో వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలోని సర్వే నంబర్ 101/ఆలో 1.28 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అప్పటి అధికారులు శంకరమ్మ పేరిట పట్టాచేసి పాస్‌పుస్తకం కూడా ఇచ్చారు. మల్లాపూర్ ఆంధ్రాబ్యాంక్‌లో పంట రుణం సైతం తీసుకొని ఏటా ఆ భూమిని సాగుచేసుకుంటున్నారు. ఇటీవల భూరికార్డుల ప్రక్షాళనలో రెవెన్యూ అధికారులు ఆ భూమి సర్వే నంబర్‌పై ఇతరులకు పట్టా చేసినట్టు ఆన్‌లైన్లో కనిపిస్తున్నది. దీంతో సదరు భూమి పట్టా కోసం శంకరమ్మ వీఆర్వో, తాసిల్దార్‌కు పలుమార్లు దరఖాస్తుచేశారు. అయినా కాకపోవడంతో ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు, రైతుబీమా పథకాలకు దూరమయ్యారు. అధికారులు భూ వివరాలు సరిచేసి పట్టా ఇచ్చి ఆదుకోవాలని బాధితురాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంపై తాసిల్దార్ రమేశ్‌ను వివరణ కోరగా.. ఈ సర్వేనంబర్‌లో భూముల వివరాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించామనీ, గతంలో ఈ సర్వేనంబర్‌లో శంకరమ్మకు పట్టా ఉన్న మాట వాస్తవమేననీ, సర్వేయర్ ద్వారా మరోసారి భూములను కొలిపించి ఎవరూ నష్టపోకుండా రైతులకు పట్టాలు చేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

## కంక్లూజివ్ టైటిల్‌తో భూసమస్యలకు చెక్

- టైటిల్ రిజిస్టర్‌తోనే మ్యుటేషన్
- ఇకపై రెండు రకాలుగా భూ వర్గీకరణ
- నూతన చట్టంతో భూవివాద రహితంగా తెలంగాణ
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ముసాయిదా బిల్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో సమస్త భూసమస్యలకు చెక్‌పెడుతూ కంక్లూజివ్ టైటిల్ చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. భూరికార్డుల ప్రక్షాళన సందర్భంగా వెలుగులోకి వచ్చిన అనేక సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించింది. తెలంగాణను భూ వివాదరహితంగా మార్చి.. వ్యవసాయాన్ని పరిపుష్టంచేయాలన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆలోచన మేరకు సమస్త భూసమస్యలకు పరిష్కారంగా కంక్లూజివ్ టైటిల్ చట్టం రానున్నది. ముఖ్యంగా భూరికార్డుల ప్రక్షాళన సందర్భంగా వెలుగులోకి వచ్చిన అనేక సమస్యలపై సర్కారు దృష్టి సారించింది. ఖాస్తకార్, పోరంబోకు, సర్కారీ, బీడు, ఫౌతీ, మౌజ, ప్రైవేటి, మూడోవ్యక్తి చేతుల్లోకి మారిన అసైన్డ్ భూములు, గ్రామాలు పట్టణీకరణ చెందిన నేపథ్యంలో ఆయా గ్రామాల్లోని అసైన్‌దారులు, ఇనామ్ భూములు, రద్దు బదలు తదితర భూమి సమస్యలన్నీ ఒకే ఒక్క చట్టంతో పరిష్కారం కావాలన్న దిశగా ఆలోచిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటివరకు అమలులో ఉన్న రెవెన్యూ చట్టాలను కూడా అధ్యయనం చేస్తున్నారు. వాటిల్లో ఉన్న అంశాలు ఏమిటి? ఏ అంశాలను నూతన చట్టంలోకి తీసుకోవాలి? మారిన సామాజిక, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో భూమి యజమాన్య పద్ధతుల్లోనూ మార్పులొచ్చాయి. వచ్చిన మార్పులకు అనుగుణంగా భూ యజమానులకు పూర్తి రక్షణ కల్పించేలా చట్టం రూపొందిస్తున్నారు. భూ యజమాని ఎక్కడ ఉన్నా అతడి భూమికి పూర్తి భరోసా కల్పించాలన్న లక్ష్యంతో సర్కారు ఉన్నది. తెలంగాణలో రక్షిత కౌలు భూములు, ఇనామ్ ఇలా అనేక రకాల భూములు వచ్చాయి. పలు రకాల భూముల వర్గీకరణను కూడా అర్థం చేసుకోలేని స్థితితో కొందరు రెవెన్యూ అధికారులు ఉన్నారు. అనేక గందరగోళాలు ఏర్పడుతున్నాయి. ఇలాంటి గందరగోళాలకు చెక్‌పెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇందుకోసం పట్టా, ప్రభుత్వ భూములు ఇలా రెండు రకాలుగానే వర్గీకరించాలన్న ఆలోచనలో సర్కారు ఉన్నట్టు తెలుస్తున్నది. దేవాదాయ, వక్ఫ్ భూములను కూడా సర్కారు కిందనే వర్గీకరించి, ఆయాశాఖల పేరున ఉంచే అవకాశం ఉన్నది. రైతులు సాగుచేసుకునే భూములు, ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోని భూములను పట్టా భూములుగానే పరిగణించాలని ఆలోచిస్తున్నారు. ఇలాచేయడంవల్ల గందరగోళం ఉండదంటున్నారు. క్రయవిక్రయాలన్నీ సేల్‌డీడ్ ద్వారా కాకుండా టైటిల్‌డీడ్ ద్వారా రిజిస్టర్ చేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం టైటిల్ కంక్లూజీవ్ చట్టం తీసుకురానున్నారు. సేల్‌డీడ్ కాకుండా టైటిల్ రిజిస్టర్ చేసి, అమ్మిన వ్యక్తికి ఉన్న టైటిల్‌ను కొనుగోలుచేసిన వ్యక్తికి బదిలీ చేస్తారు. ఇదంతా కూడా రిజిస్టర్ అయిన వెంటనే మ్యుటేషన్‌చేసేలా ఈ చట్టంలో పొందుపరుచనున్నట్టు సమాచారం. పక్కాగా కోర్ బ్యాంకింగ్ విధానాన్ని అమలులోకి తీసుకురానున్నారు. ఇదే సమయంలో ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా టీఎస్ ఐపాస్ విధానం తరహాలో కొత్తగా భూ పరిపాలన విధానం అమలులోకి తీసుకురానున్నట్టు తెలిసింది. ప్రతిపనికి నిర్దిష్ట కాలపరిమితి విధించనున్నారు. కాలపరిమితిలోగా పనిచేయని అధికారులకు జరిమానా కూడా విధించే అవకాశం ఉన్నది. ఈదిశగా రెవెన్యూలో సమూల మార్పులు తీసుకువచ్చేలా కొత్త చట్టం తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదే తీరుగా భూ పరిపాలనకు అవసరమైన మేరకు క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి అధికారాలు ఇవ్వనున్నారు. అన్ని అంశాలపై చర్చించి నూతన ముసాయిదా చట్టాన్ని రూపొందించి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును తీసుకొచ్చే అవకాశం ఉన్నది.

## 75 ఏండ్ల వయస్సులో తిప్పుకుంటున్నారు

- పాత పాస్‌పుస్తకం ఉన్నా కొత్తది ఇవ్వడంలేదు
- యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు చెందిన వజ్రమ్మ ఆవేదన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మనుమలు, మనుమరాళ్లతో కాలక్షేపంచేయాల్సిన 75 ఏండ్ల వృద్ధురాలిని కాళ్లరిగేలా తిప్పుకుంటున్నారు రెవెన్యూ అధికారులు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన యెదుళ్ల వజ్రమ్మ చెప్పిన వివరాల ప్రకారం.. 2008లో ఆమె భర్త నర్సిరెడ్డి మరణించారు. దీంతో మాటూరు గ్రామంలో ఆయన పేరిట ఉన్న సర్వేనంబర్ 371లోని 3.02 ఎకరాల భూమిని వజ్రమ్మ పేరిట మార్పిడిచేసి, 2014లో అప్పటి రెవెన్యూ అధికారులు ఆమెకు పాస్‌పుస్తకం ఇచ్చారు. అయితే, భూ రికార్డుల ప్రక్షాళనలో ఆమెకు కొత్త పాస్‌పుస్తకం ఇవ్వలేదు. ఎన్నిసార్లు రెవెన్యూ కార్యాలయంచుట్టూ తిరిగినా ఫలితంలేదని.. తనకు కొత్త పాస్‌పుస్తకం ఇవ్వకుండా మోకాళ్ల అనంతరెడ్డి అభ్యంతరం చెప్తున్నారని అధికారులు సమాధానమిస్తున్నారంటూ బాధితురాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆమె భర్త నర్సిరెడ్డి బతికి ఉన్నప్పుడు 371 సర్వేనంబర్‌లోని మూడెకరాలను మోకాళ్ల అనంతరెడ్డి తండ్రి జగ్గారెడ్డికి విక్రయించారు. అయితే, రిజిస్ట్రేషన్ సమయంలో సర్వేనంబర్ తప్పిదం కారణంగా సమస్య తలెత్తింది. నర్సిరెడ్డి పేరుమీద సర్వేనంబర్ 372లో 7.28 ఎకరాలు ఉండగా అందులో నుంచి మూడెకరాలను జగ్గారెడ్డికి కేటాయించారు. జగ్గారెడ్డికి విక్రయించిన మూడెకరాల భూమిని నర్సిరెడ్డి పట్టా నుంచి కూడా అధికారులు తొలిగించారు. కానీ 371 సర్వేనంబర్‌లోని 3.02 ఎకరాల భూమి జగ్గారెడ్డి కబ్జాలో, 372 సర్వేనంబర్‌లోని 3 ఎకరాల భూమి తన కబ్జాలో ఉన్నది. దీని కారణంగా అధికారులు కొత్త పాస్‌పుస్తకం మంజూరుచేయడంలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### రెండుసార్లు రైతుబంధు ఇయ్యలే



నాకు కొత్త పాస్‌పుస్తకం రాకపోవడంతో ఇప్పటికే రెండు సార్లు రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయం అందలేదు. ఎన్కట ఎప్పుడో సర్వే నంబర్ తప్పుపడిందని పాస్‌పుస్తకం ఇయ్యకుండా తిప్పుకుంటున్నారు. అధికారులు విచారించి కొత్త పాస్‌పుస్తకం మంజూరుచేయాలె.

**- వజ్రమ్మ, మోటకొండూరు, యాదాద్రిభువనగిరి జిల్లా**

## వీఆర్వో కక్కుర్తి.. పెద్దల్లుడి కుయుక్తి

- తప్పుడు వీలునామాతో రూ.కోట్లు విలువైన భూమికి ఎసరు
- విచారణ జరుపకుండానే ప్రొసీడింగ్ జారీ
- వారసుల ఫిర్యాదుతో కదులుతున్న డొంక
- కాంట్రాక్టర్‌పై 420 కేసు
- ప్రజ్ఞాపూర్ వీఆర్వోపై వేటుకు రంగం సిద్ధం

**గజ్వేల్, నమస్తే తెలంగాణ:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని బెజుగామ గ్రామానికి చెందిన జోగన్నగారి వజ్రమ్మకు తన తల్లి ఊడెం లక్ష్మి నుంచి కోర్టు ద్వారా ప్రజ్ఞాపూర్ పట్టణంలోని సర్వే నంబర్ 159లో 3.28 ఎకరాల భూమి వచ్చింది. ఆ భూమిని తన పేరున మార్పిడి చేయించుకోక ముందే ఆమె చనిపోయారు. ప్రస్తుతం ప్రజ్ఞాపూర్‌లో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. వజ్రమ్మకు కుమారులు సుఖేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కుమార్తెలు లక్ష్మి, శ్రీలత ఉన్నారు. కూతుళ్లకు 30 ఏండ్ల క్రితం పెండ్లిళ్లు జరిగాయి. అందరూ ఎవరికి వారుగా ఉంటున్నారు. వజ్రమ్మ పేరిట ఉన్న భూమిని ఇంకా మార్చుకోలేదని గ్రహించిన ఆమె పెద్ద అల్లుడు (లక్ష్మి భర్త) గున్నాల రుక్మారెడ్డి ఆ భూమిని కాజేయాలని ప్లాన్‌వేశారు. సింగాటం గ్రామానికి చెందిన రుక్మారెడ్డి స్థానికంగా కాంట్రాక్టర్‌గా కొనసాగుతున్నారు. రుక్మారెడ్డి.. ప్రజ్ఞాపూర్ వీఆర్వో గిరిబాబును సంప్రదించారు. ఇద్దరూ కలిసి ఓ ప్లాన్ వేసి అమలుచేశారు. వజ్రమ్మ రాసి ఇచ్చినట్టుగా వీలునామా తయారు చేయించారు. అందులో రుక్మారెడ్డి స్వగ్రామానికి చెందిన కొందరితో సాక్షి సంతకాలు చేయించారు. వజ్రమ్మ పెట్టినట్టుగా సంతకం చేసి వీఆర్వోకు దరఖాస్తు చేసుకున్నారు.

**విచారణ లేకుండానే ప్రొసీడింగ్..**

వీలునామాతో దరఖాస్తు చేసుకున్నప్పుడు సదరు వీఆర్వో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాల్సి ఉంటుంది. వారసులకు నోటీసులు కూడా జారీ చేయాలి. ఇవన్నీ తుంగలో తొక్కి ప్రొసీడింగ్ జారీచేశారు. తన తల్లిపేరిట ఉన్న భూమిని కాజేస్తున్నట్టు సమాచారం అందుకున్న వజ్రమ్మ పెద్దకొడుకు సుఖేందర్‌రెడ్డి గజ్వేల్ తాసిల్దార్‌కు ఫిర్యాదుచేశారు. ఈ క్రమంలో రుక్మారెడ్డి ప్రొసీడింగ్‌ను తాసిల్దార్ శ్రీనివాస్‌కు అందించి భూమిని తమ పేర్లమీదకు మార్చాలని కోరారు. దీంతో తాసిల్దార్ ఆ ప్రొసీడింగ్‌ను నిలిపివేశారు.

**రుక్మారెడ్డిపై చీటింగ్ కేసు నమోదు**

తప్పుడు వీలునామా సృష్టించి కోట్లు విలువైన భూమిని కాజేయడానికి యత్నించిన రుక్మారెడ్డిపై వజ్రమ్మ కొడుకు సుఖేందర్‌రెడ్డి గజ్వేల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, అతనిపై 420 కేసు నమోదుచేశారు. వీలునామాలో సాక్షులుగా సంతకాలుచేసిన నర్సింహారెడ్డి, రాంరెడ్డిని విచారించగా, రోడ్డు కాంట్రాక్ట్ విషయంలో సంతకాలు అవసరమున్నాయని, తెల్ల కాగితంపై తమతో సంతకాలు పెట్టించుకున్నట్టు ఇద్దరూ వెల్లడించారు. వీఆర్వో గిరిబాబును కూడా విచారిస్తున్నామని గజ్వేల్ సీఐ ప్రసాద్ చెప్పారు.

### కఠిన చర్యలు తీసుకోవాలి



తప్పుడు వీలునామా సృష్టించి భూమి కాజేసేందుకు యత్నించిన రుక్మారెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవటంతోపాటు వీఆర్వోను సస్పెండ్ చేయాలి. ఇలా ఎంతో మంది వీఆర్వోలు పేదలను ఇబ్బంది పెడ్తున్నారు.

**- సుఖేందర్‌రెడ్డి, వజ్రమ్మ పెద్దకుమారుడు, బెజుగామ**

### ఆ ప్రొసీడింగ్ రద్దు చేస్తాం

భూమి బదలాంపు వీలునామాపై వజ్రమ్మ కుమారుడు సుఖేందర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపడుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. తప్పుడు వీలునామా ఆధారంగా ఆమె వారసులకు సమాచారం ఇవ్వకుండా భూమి బదలాయింపునకు జారీచేసిన ప్రొసీడింగ్‌ను రద్దుచేస్తాం. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తక్షణమే నివేదిక సమర్పించాలని గజ్వేల్ తాసిల్దార్‌ను ఆదేశించాం.

**- విజయేందర్, ఆర్డీవో, గజ్వేల్**

బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ





రంజాన్ పండుగ సందర్భంగా తన నివాసంలో విందుకు హాజరైన టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా స్వాగతం పలుకుతున్న హోంమంత్రి మహమూద్ అలీ. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్, మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



బుధవారం సిద్దిపేటలో ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌కు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు





## మీ ఆలోచనలు ఇతరులకు స్ఫూర్తి

నవీన్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పుట్టిన రోజు సందర్భంగా తనపేరిట పత్రికల్లో అడ్వర్టయిజ్‌మెంట్లు ఇచ్చేబదులు.. అందుకు వెచ్చించే రూ.1.15 కోట్లను ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇవ్వాలని స్నేహితులకు సలహా ఇచ్చిన నూతన ఎమ్మెల్సీ కే నవీన్‌కుమార్‌ను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ట్విట్టర్‌లో అభినందించారు. నవీన్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఆయన ఆలోచనలు ఇతరులకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు.

## పర్యావరణ పరిరక్షణకు పునరంకితం కావాలి

- ప్రజలకు కేటీఆర్ పిలుపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పర్యావరణాన్ని విస్మరించకుండా ప్రకృతికి అనుగుణంగా మన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఇందుకు సరైన సమయంగా ఎంచుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా పునరంకితం కావాల్సిన సమయమిది అని ట్విటర్‌లో పిలుపునిచ్చారు. ప్రకృతిని గౌరవించేలా జీవన విధానం ఉండాలని, భవిష్యత్‌తరాలకు మంచి వాతావరణాన్ని అందించేలా మన చర్యలుండాలని కేటీఆర్ సూచించారు.

# హోం మంత్రి నివాసంలో ఘనంగా రంజాన్ వేడుకలు

### టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పలువురు మంత్రుల శుభాకాంక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ నివాసంలో బుధవారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రులు ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, ఎంపీ కేశవరావు, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, డీజీపీ మహేందర్‌రెడ్డి, హోంశాఖ కార్యదర్శి రాజీవ్‌త్రివేది, హైదరాబాద్ సీపీ అంజనీకుమార్, పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు హోం మంత్రి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఆహ్వానితులందరికీ సాదరస్వాగతం పలికిన హోంమంత్రి.. రుచికరమైన వంటకాలతో విందు ఇచ్చారు.

**గవర్నర్ దంపతులను కలిసిన హోంమంత్రి దంపతులు**

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని హోంమంత్రి మహమూద్‌అలీ దంపతులు రాజ్‌భవన్‌కు వెళ్లి, గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ దంపతులను కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# నీట్‌లో మన మాధురి టాప్


ఐదోపేజీ తరువాయి...


హాజరయ్యారు. హాజరైనవారిలో 7,97,042 మంది విద్యార్థులు అర్హత సాధించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 51,114 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 48,996 మంది పరీక్షలకు హాజరవగా 33,044 మంది అర్హత సాధించారు. ఈ మేరకు రాష్ట్రంలో 67.44% ఉత్తీర్ణత నమోదైంది. తెలుగు భాషలో నీట్‌కు హాజరైనవారు దేశవ్యాప్తంగా 1,796 మంది ఉన్నారు. ఇంగ్లిష్ భాషలో 12,04,968, హిందీ భాషలో 1,79,857 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ విధంగా అన్ని ప్రాంతీయ భాషలలో కలిపి 1,34,550 మంది పరీక్షలకు హాజరయ్యారు.

**తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే: మాధురిరెడ్డి**

తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఏడో ర్యాంకును సాధించగలిగానని జీ మాధురిరెడ్డి చెప్పింది. హైస్కూల్లో చదివే రోజులనుంచి డాక్టర్ కావాలనే పట్టుదల పెరిగిందని తెలిపింది. కళాశాలలో అధ్యాపకులు చిన్నచిన్న అంశాలను కూడా విడమర్చి చెప్పేవారని, మానసిక ఒత్తిడి లేకుండా చూసేవారని పేర్కొంది. వారందరి సహకారంతో ర్యాంకు సాధించానని చెప్పింది. రోజుకు పదిపన్నెండు గంటలు చదివేదాన్నని తెలిపింది.

**బాగా ప్రిపేర్ అయ్యా: ఖురేషీ అస్రా**


బాగా ప్రిపేర్ కావడం వల్ల ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయగలిగానని ఏపీకి చెందిన టాపర్, జాతీయస్థాయిలో 16వ ర్యాంకర్ ఖురేషీ అస్రా చెప్పింది. బేసిక్స్, కాన్సెప్ట్ బాగా నేర్చుకున్నానని, అందుకే ర్యాంక్ సాధించగలిగానని పేర్కొంది.

**నీట్‌కు హాజరైన విద్యార్థుల వివరాలు**

| క్యాటగిరీ | పరీక్షలకు నమోదు | హాజరు | గైర్హాజరు | అర్హులు |
|---|---|---|---|---|
| బాలురు | 6,80,414 | 6,30,283 | 50,131 | 3,51,278 |
| బాలికలు | 8,38,955 | 7,80,467 | 58,488 | 4,45,761 |
| ట్రాన్స్‌జెండర్ | 6 | 5 | 1 | 3 |
| మొత్తం | 15,19,375 | 14,10,755 | 1,08,620 | 7,97,042 |

**క్యాటగిరీ వారీగా..**

| క్యాటగిరీ | పరీక్షలకు నమోదు | హాజరు | గైర్హాజరు | అర్హులు |
|---|---|---|---|---|
| ఓబీసీ | 6,77,544 | 6,31,473 | 46,071 | 3,75,635 |
| ఎస్సీ | 2,11,303 | 1,93,188 | 18,115 | 99,890 |
| ఎస్టీ | 96,456 | 86,210 | 10,246 | 35,272 |
| జనరల్ | 5,34,072 | 4,99,884 | 34,188 | 2,86,245 |
| మొత్తం | 15,19,375 | 14,10,755 | 1,08,620 | 7,97,042 |



బుధవారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని చారిత్రక మక్కా మసీదు వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

# భక్తిశ్రద్ధలతో రంజాన్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పర్వదినాన్ని ముస్లిం సోదరులు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకున్నారు. స్వీయ క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మికచింతనతో 41 రోజులపాటు ఉపవాసదీక్ష ఆచరించినవారంతా బుధవారంతో తమ దీక్షను విరమించారు. అత్తరు చల్లుకుని, ఆలింగనాలు చేసుకుని పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ప్రార్థనలు చేసేందుకు ముస్లింలు భారీగా తరలిరావడంతో పలు ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాలు కిక్కిరిసిపోయాయి. హైదరాబాద్‌లోని చారిత్రక మక్కామసీదు, భోలక్‌పూర్ బడేమసీదు, మీరాలం ఈద్గా, అంబర్‌పేట మున్సిపల్‌గ్రౌండ్స్, ఎన్టీఆర్‌స్టేడియం, సెవెన్‌టూంబ్స్, మాసాబ్‌ట్యాంక్ హాకీగ్రౌండ్స్‌తోపాటు 600 ప్రధాన ప్రార్థనాస్థలాల్లో ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయి. మీరాలం ఈద్గా వద్ద హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్.. ఎంపీ అసదుద్దీన్‌కు ఇతర ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీసులు.. ప్రశాంతంగా ప్రార్థనలు జరిగేలా చర్యలు చేపట్టారు. రంజాన్ సందర్భంగా హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్‌శాఖ తదితర ప్రభుత్వ విభాగాలు ప్రత్యేక ఏర్పాట్లుచేశాయి.

**ముహూర్తం**

సూర్యోదయం: 5.45 గంటలకు

సూర్యాస్తమయం: 6.45 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తదియ ఉదయం 9.57 వరకు, తదుపరి చతుర్థి, నక్షత్రం: పునర్వసు రాత్రి 8.29 వరకు, తదుపరి పుష్యమి, అమృతఘడియలు: సాయంత్రం 6.14 నుంచి రాత్రి 7.50 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.52 నుంచి 3.30 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3:17 నుంచి సాయంత్రం 5.01 వరకు, వర్జ్యం: ఉదయం 9.12 నుంచి 10.48 వరకు.

**లోకం పోకడ**



ఇంటా, బయటా
నీ కంటే నేనే పెద్దదాన్నే కోడలా!

## కొత్త ప్రశ్నపత్రాలతో ఆ రెండు పరీక్షలు

- అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి అన్ని ఏర్పాట్లు పూర్తి
- విద్యార్థులకు ఆందోళన వద్దు
- ఇంటర్ బోర్డు సెక్రటరీ అశోక్

**హైదరాబాద్/ఖిలా వరంగల్, నమస్తే తెలంగాణ:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి వరంగల్‌లో రెండు పరీక్షల ప్రశ్నపత్రాలు భద్రపరిచిన సీల్డ్ పెట్టెలు గల్లంతుకావడంతో రాష్ట్రవ్యాప్తంగా వాటిస్థానంలో కొత్తప్రశ్న పత్రాలతో పరీక్షలను యథావిధిగా నిర్వహిస్తామని ఇంటర్ బోర్డు సెక్రటరీ ఏ అశోక్ తెలిపారు. ఈ విషయంలో విద్యార్థులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, ఎప్పటిలాగే పరీక్షలకు హాజరుకావాలని కోరారు. వరంగల్‌లోని మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు భద్రపరిచిన మొత్తం 13 సీల్డ్ ట్రంకు పెట్టెల్లో రెండు గల్లంతైన విషయాన్ని పరీక్షలు ప్రారంభంకావడానికి మూడురోజులు ముందుగానే గుర్తించామని తెలిపారు. ఈ నెల ఎనిమిది, పది తేదీల్లో జరిగే పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలున్న ట్రంకు పెట్టెలు కనిపించకుండాపోవడంతో వాటిస్థానంలో కొత్త ప్రశ్నపత్రాలతో టైంటేబుల్ ప్రకారం పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎలాంటి వదంతులను నమ్మవద్దని సూచించారు. ట్రంకు పెట్టెల గల్లంతుపై పోలీసులకు ఫిర్యాదుచేశామని, విచారణ కొనసాగుతున్నదని వెల్లడించారు. కాగా, ప్రశ్నపత్రాలున్న 13 సీల్డు బాక్సులను ఫిబ్రవరిలో ఇంటర్‌బోర్డు అధికారులు మిల్స్‌కాలనీ పీఎస్‌లో భద్రపరిచారు. మూడురోజుల క్రితం ఇంటర్‌బోర్డు కస్టోడియన్ అధికారి రజిత సీల్డు బాక్సుల తనిఖీకి రాగా, రెండు బాక్సులు కనిపించకపోవడంతో బోర్డు అధికారులతోపాటు పోలీస్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

# అసలేం జరిగింది?

- రవిప్రకాశ్‌పై సైబర్‌క్రైం పోలీసుల ప్రశ్నల వర్షం
- కీలక విషయాలపై రెండోరోజు కొనసాగిన విచారణ
- నేడు మరోసారి విచారణకు రావాలని ఆదేశం!
- సత్యాన్ని చంపేయబోతున్నారు: మీడియాతో రవిప్రకాశ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీవీ9 కొత్త యాజమాన్యం, మీకు మధ్య వివాదం ఏమిటి? వాళ్లు ఫిర్యాదు చేసినట్టు మీరు కొత్త యాజమాన్యాన్ని అడ్డుకొనేందుకు తప్పుడు పత్రాలు సృష్టించారా? కంపెనీ సెక్రటరీ దేవేంద్ర అగర్వాల్ సంతకాన్ని ఫోర్జరీ చేసిందెవరు? నటుడు శివాజీకి మీకు మధ్య అసలు అగ్రిమెంట్ జరుగలేదని, పాత తేదీలతో తప్పుడు పత్రాలు సృష్టించి కావాలనే కేసులు వేశారన్నది వాస్తవమేనా?.. ఇలా టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌పై సైబరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించారు. బుధవారం రెండోరోజు విచారణకు హాజరైన రవిప్రకాశ్‌ను సైబర్‌క్రైం పోలీసుల బృందం సుదీర్ఘంగా విచారించింది. మంగళవారం దాదాపు ఐదుగంటలపాటు పలు ప్రశ్నలు అడిగారు. అయితే రవిప్రకాశ్ సరైన సమాధానాలు చెప్పకుండా, పొంతనలేని అంశాలను చెప్తూ విచారణకు ఏమాత్రం సహకరించకపోవడంతో.. బుధవారం పక్కా ప్రణాళికతో అధికారులు ప్రశ్నావళి రూపొందించుకొని మరీ విచారించినట్టు తెలిసింది. కాగా, గురువారం కూడా విచారణకు హాజరుకావాలని ఆదేశించినట్టు సమాచారం. నకిలీ పత్రాల సృష్టి, సంతకాల ఫోర్జరీ, డాటా చోరీ తదితర ఆరోపణలతో అలంద మీడియా ఫిర్యాదు మేరకు సైబరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు రవిప్రకాశ్‌ను విచారిసున్నారు. సీఆర్పీసీ 41ఏ కింద రవిప్రకాశ్‌కు ఇదివరకే సైబరాబాద్ పోలీసులు నోటీసులు జారీచేశారు. అయితే రవిప్రకాశ్ ముందస్తు బెయిల్‌కోసం తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టుకే వెళ్లాలని రవిప్రకాశ్‌కు సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. 41ఏ నోటీసుల కింద పోలీసుల ఎదుట విచారణకు హాజరుకావాలని సూచించడంతో.. రవిప్రకాశ్ మంగళవారం అజ్ఞాతం వీడారు. మంగళవారం దాదాపు ఐదుగంటలపాటు విచారించిన పోలీసులు, బుధవారం మరోమారు రావాలని చేసిన సూచనల మేరకు ఉదయం 11 గంటల ప్రాంతంలో సైబర్‌క్రైం పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. తాను ఏ తప్పూ చేయలేదని చెప్తున్న రవిప్రకాశ్.. కేసు నమోదైనప్పటి నుంచి అజ్ఞాతంలోకి ఎందుకు వెళ్లారు? అనే విషయంపై పోలీసులు దృష్టిసారించారు. ప్రస్తుతానికి రవిప్రకాశ్ నుంచి సమాచారం మాత్రమే సేకరిస్తున్నారు. అవసరమనుకొంటేనే అరెస్టు చేస్తామని ఇప్పటికే ఉన్నతాధికారులు స్పష్టంచేశారు. రెండు రోజుల విచారణలో దర్యాప్తునకు సంబంధించిన అనేక అంశాలను పసిగట్టినందున.. రవిప్రకాశ్ బయట ఉంటే దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశాలున్నాయన్న అంశాన్ని పేర్కొంటూ ఆయన అరెస్ట్‌పై హైకోర్టును ఆశ్రయించే వీలున్నట్టు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.



బుధవారం సైబరాబాద్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరై మీడియాతో మాట్లాడుతున్న రవిప్రకాశ్

**జర్నలిస్టులంతా పోరాడాలి: మీడియాతో రవిప్రకాశ్**

'మీడియా, మాఫియా మధ్య యుద్ధం జరుగుతున్నది. మాఫియాకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలి. దొంగపత్రాలతో భూమి లాక్కొంటున్నట్టు, మీడియాను ఆక్రమించుకొన్నారు. పోలీసుల సహకారంతో మోజో టీవీ యాజమాన్యాన్ని బెదిరించి లాక్కొన్నారు. మీడియా కబ్జాపై జర్నలిస్టులంతా పోరాడాలి' అని రవిప్రకాశ్ విచారణకు హాజరైన సందర్భంగా మీడియాతో అన్నారు.

# తిరుగులేని టీఆర్ఎస్


ఐదోపేజీ తరువాయి...


ప్రత్యామ్నాయమని చెప్పుకొన్న పార్టీలు గౌరవప్రదమైన సంఖ్యలో కూడా స్థానాలను సాధించలేకపోయాయి. కాంగ్రెస్ ఎంతగానో ఆశలు పెట్టుకున్నా.. ఫలితాలు ఆ పార్టీ ఆశలపై నీళ్లు కుమ్మరించాయి. ఇక బీజేపీ నామమాత్రపు ఫలితాలు సాధించి సరిపెట్టుకున్నది. వామపక్షాలదీ దాదాపు అదే పరిస్థితి. కోదండరాం నాయకత్వంలోని తెలంగాణ జనసమితి ఉనికి చాటుకునే ప్రయత్నంకూడా చేయలేకపోయింది. మొత్తంగా ప్రజాసంక్షేమం టీఆర్ఎస్‌తోనే సాధ్యమని గ్రామీణ ఓటర్లు గుర్తించారు. దేశం మెచ్చిన పథకాలను అమలుచేస్తున్న కేసీఆర్‌కు పూర్తి అండగా నిలిచారు.

**ప్రజాసంక్షేమానికే పట్టంగట్టిన ఓటరు**

రాష్ట్రంలో అన్నివర్గాల సంక్షేమంకోసం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశవ్యాప్త గుర్తింపు సాధించిన విషయం తెలిసిందే. పలు రాష్ట్రాలు తెలంగాణ పథకాలను కాపీ కొట్టాయి. దేశంలోనే సంచలన పథకమైన రైతుబంధును కేంద్ర ప్రభుత్వం పలు మార్పులు చేసి అమల్లోకి తీసుకువచ్చింది. ఇలా రాష్ట్రంలో నాలుగున్నరేండ్లలో సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన అనేక ప్రజాసంక్షేమ పథకాలు చరిత్రకెక్కాయి. గులాబీ దండును ఓటర్లు తమ హృదయాల్లో నిలుపుకొనేలా చేశాయి. ఫలితమే.. అసెంబ్లీ ఎన్నికలు మొదలు.. తాజాగా స్థానిక ఎన్నికలదాకా ప్రతి ఎన్నికల్లో ప్రజలంతా సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. గతంలో ఏ పార్టీకి రానంతగా మెజార్టీని స్థానిక ఎన్నికల్లో కట్టబెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు కుటుంబం యూనిట్‌గా అన్నట్టు అమలయ్యాయి. రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్ల పెంపు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆరోగ్యశ్రీ, కంటి వెలుగు కార్యక్రమం, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ఆరోగ్యలక్ష్మి, అమ్మ ఒడి, కేసీఆర్ కిట్స్ వంటి పథకాలు అర్హులైన ప్రతి ఇంటికి అందాయి. ఇవేకాకుండా.. ధరణి వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేసిన సీఎం కేసీఆర్.. భూ రికార్డుల ప్రక్షాళనచేశారు. ఏండ్లతరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపారు. గ్రామస్థాయిలో భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా.. శాశ్వత పరిష్కారం కోసం సరికొత్త తరహాలో ప్రణాళిక సిద్ధంచేస్తున్నట్టు సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన.. రైతుల్లో విశ్వాసాన్ని నింపింది. ఇక అభాగ్యులకు అండగా ఉండేందుకు ఉద్దేశించిన ఆసరా పింఛన్లను కేసీఆర్ ప్రభుత్వం రెట్టింపుచేసింది. పెరిగిన పింఛన్లను లబ్ధిదారులు జూలై నెల నుంచి అందుకోనున్నారు. వృద్ధులు, వితంతువులు, గీత, నేత కార్మికులు, ఒంటరి మహిళలు, బోదకాలు బాధితులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు రూ.2016, దివ్యాంగులు, వృద్ధ కళాకారులకు రూ.3016 చొప్పున పంపిణీచేయనున్నారు. పరిషత్ ఎన్నికల ప్రచారంలో ఈ సంక్షేమ కార్యక్రమలన్నింటినీ ప్రజలకు వివరించడంలో టీఆర్ఎస్ నేతలు సఫలమయ్యారు. సంక్షేమ కార్యక్రమాలతోపాటు తాగునీటి ఇబ్బందులు తీర్చిన మిషన్ భగీరథ, గ్రామాల్లో చెరువులకు పూర్వవైభవం తెప్పించేందుకు చేపట్టిన మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలు.. తెలంగాణను కోటి ఎకరాల మాగాణంలా మార్చేందుకు సిద్ధమవుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు, ఇతర సాగునీటి యజ్ఞాలు టీఆర్ఎస్‌కు తిరుగులేని ప్రచారాస్త్రాలుగా నిలిచాయి. వ్యక్తిగత విమర్శలు చేయడం తప్ప.. మరే ప్రచార అంశాలు లేని ప్రతిపక్షాలు.. టీఆర్ఎస్ ప్రభంజనంలో కొట్టుకుపోయాయి.

## పాలిసెట్ రెండోవిడుత కౌన్సెలింగ్ షెడ్యూల్ జారీ

- రేపు సర్టిఫికెట్ల పరిశీలన
- రేపట్నుంచి వెబ్ కౌన్సెలింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం పాలిసెట్ రెండోవిడుత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సెట్ కన్వీనర్ నవీన్‌మిట్టల్ బుధవారం విడుదలచేశారు. షెడ్యూల్ ప్రకారం.. తొలి విడుతలో స్లాట్ బుక్‌చేసుకున్న విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. ఈ నెల ఆరు నుంచి ఎనిమిది వరకు వెబ్‌ఆప్షన్ నమోదుచేసుకోవాలి. పదిన సీట్లు కేటాయిస్తారు. ఈ నెల 10 నుంచి 11 వరకు సీట్లు పొందిన విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలి. 12న కాలేజీల్లో రిపోర్ట్‌చేయాలి. కౌన్సెలింగ్ సమాచారం కోసం గురువారం (ఈ నెల 6) వరకు విద్యార్థులు సహాయకేంద్రాలను సంప్రదించాలి. పూర్తి వివరాలకు https://tspolycet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

## ఎస్సీ యువతకు ఉపాధి శిక్షణ

- టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు
- నేటినుంచి దరఖాస్తులకు అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎస్సీ యువతకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి కల్పనలో భాగంగా శిక్షణ ఇవ్వనున్నారు. బోడుప్పల్‌లోని కెల్టాన్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచిత శిక్షణ పొందేందుకు ఎస్సీ అభ్యర్థులు గురువారం (ఈ నెల 6) నుంచి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆ సంస్థ ప్రతినిధి భూపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్డ్ ప్రాసెసింగ్ అండ్ డాటా ఎంట్రీ, అకౌంటింగ్ కాన్సెప్ట్స్, ట్యాలీ, ఎంఎస్‌ఆఫీస్, బేసిక్ ఆఫీస్ ఆటోమేషన్ అంశాల్లో మూడునెలల శిక్షణకు టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు గల 18-35 ఏళ్ల మధ్య వయసు ఉన్న ఎస్సీ నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు అభ్యర్థులు 8455099601 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## అలాయ్ బలాయి



జనగామ జిల్లా పాలకుర్తిలో రంజాన్ వేడుకల్లో పాల్గొని మాట్లాడుతున్న పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సూర్యాపేట మండలం గాంధీనగర్ ఈద్గాలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్



వనపర్తి జిల్లాకేంద్రంలో ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



మహబూబ్‌నగర్‌లోని వానగట్టు ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

## చకచకా 'పునర్జీవం' పనులు



జగిత్యాల జిల్లా రాజేశ్వర్‌రావు పేట పంప్‌హౌస్‌లోని రెండో యూనిట్‌లో కొనసాగుతున్న రూటర్ బిగింపు పనులు

**ఇబ్రహీంపట్నం:** ఎస్సారెస్పీ పునర్జీవ పథకంలో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట శివారులో వరద కాలువ వద్ద నిర్మిస్తున్న పంప్‌హౌస్ పనులు చకచకా సాగుతున్నాయి. మంగళవారం రాంపూర్ పంప్‌హౌస్‌ను సీఎం కేసీఆర్ పరిశీలించి జూలై 15 లోగా పూర్తి కావాలని ఆదేశించడంతో పనులు వేగవంతమయ్యాయి. యూనిట్‌వన్‌లో (మొదటి మోట ర్) రెండు మూడ్రోజుల్లో, వారంలో రెండో మోటర్ డ్రైరన్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల చివరివారం నాటికి ఐదో మోటర్ బిగించి జూలై 5 వరకు డ్రైరన్ నిర్వహించనున్నట్టు తెలిపారు.



వేసవిసెలవులు ముగుస్తున్న తరుణంలో వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోతున్నది. బుధవారం వేకువజాము నుంచే కోడె మొక్కుచెల్లించుకున్న భక్తులు అనంతరం స్వామివారి దర్శనానికి బారులు తీరారు. దాదాపు 5 వేలకుపైగా భక్తులు రాజన్నను దర్శించుకోగా, వివిధ ఆర్జితసేవల ద్వారా రూ.3 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. -వేములవాడ కల్చరల్

8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# 13 కల్లా రుతుపవనాలు

- 14 నుంచి రాష్ట్రమంతటా ప్రభావం
- ఎల్లుండి కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా
- నేడు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి
- ఆదిలాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రత 44.8 డిగ్రీలు
- హైదరాబాద్‌లో 40.5 డిగ్రీలుగా నమోదు



ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం వడ్డాడి సమీపంలో పిడుగుపాటుకు మృతిచెందిన గొర్రెలు




తాంసి మండలం మత్తడి సమీపంలో నేలకొరిగిన విద్యుత్‌స్తంభాలు

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** నైరుతి రుతుపవనాల్లో కదలిక వచ్చింది. ఆగ్నేయ బంగాళాఖాతం మీదుగా వేగంగా ముందుకు కదులుతున్నాయి. ఈ నెల 13 కల్లా రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వై కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం దక్షిణ భూమధ్య రేఖ మీదుగా ఉత్తరంవైపు నుంచి బంగాళాఖాతం వైపు గాలులు వీస్తున్నందున.. ఇప్పటివరకు మందగమనంలో ఉన్న రుతుపవనాల్లో కదలిక వచ్చిందని చెప్పారు. ఆగ్నేయ బంగాళాఖాతం మీదుగా శ్రీలంకకు చేరుకుంటున్నాయని, అక్కడినుంచి ఈ నెల 8వ తేదీ కల్లా కేరళ తీరాన్ని చేరుతాయని అంచనా వేసినట్టు పేర్కొన్నారు. కేరళ చేరాక నాలుగు లేదా ఐదు రోజులకు రుతుపవనాలు తెలంగాణను తాకవచ్చన్నారు. ఈ నెల 14 నుంచి రాష్ట్రమంతటా రుతుపవనాల ప్రభావం కనిపిస్తుందని చెప్పారు. ఈ సారి వర్షపాతం సాధారణంగానే ఉండవచ్చనే అంచనా ఉన్నదని, దేశంలోని మిగతా ప్రాంతాలకంటే దక్షిణ భారతంలోనే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని పేర్కొన్నారు. ఈ సారి సగటు వర్షపాతంలో తెలంగాణలో 97 శాతం వరకు వానలు కురువొచ్చని అంచనా వేశారు. మొదట్లో 96 శాతం అని అంచనా కట్టినా ప్రస్తుతం రుతుపవనాల కదలికను గమనంలోకి తీసుకొంటే వర్షపాతం పెరిగే అవకాశం ఉన్నదని కరుణాకర్‌రెడ్డి విశ్లేషించారు. వాస్తవానికి రాష్ట్రంలో సగటు వర్షపాతం 755 మిల్లీమీటర్లుగా ఉన్నదని, అందులో 97 శాతం మేరకు వానలు కురిసే అవకాశం ఉన్నదని వివరించారు. వర్షాలు జూలైలో పుంజుకోవచ్చని తెలిపారు.

### తగ్గిన ఎండల తీవ్రత

రెండ్రోజులుగా రాష్ట్రంలోని పలుచోట్ల ఎండల తీవ్రత కొంత తగ్గింది. బుధవారం అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 44.8 డిగ్రీలు నమోదుకాగా, హనుమకొండలో 44.5 డిగ్రీలు, ఖమ్మంలో 44 డిగ్రీలు, రామగుండంలో 43.2 డిగ్రీలు, నిజామాబాద్‌లో 42.9 డిగ్రీలు, హైదరాబాద్‌లో 40.5



డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దక్షిణ మధ్యప్రదేశ్ నుంచి పశ్చిమ విదర్భ, మరాత్వాడా మధ్య మహారాష్ట్ర మీదుగా ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక వరకు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్న ఉపరితల ద్రోణి బలహీనంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. దీని ప్రభావంతో గురువారం రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నదని చెప్పారు. రాగల మూడ్రోజులు ఉత్తర తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తాయన్నారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బతో ముగ్గురు మృతిచెందారు. కరీంనగర్ జిల్లాలో ఒకరు, ములుగు జిల్లాలో ఒకరు, వరంగల్ రూరల్ జిల్లా నాగుర్లపల్లిలో మహిళ వడగాడ్పులకు తట్టుకోలేప్రాణాలు వదిలారు

### హైదరాబాద్‌లో 40.5 డిగ్రీలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో వాతావరణం కొంత చల్లబడింది. గతవారం వరకు 43 డిగ్రీలు దాటిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 40 డిగ్రీలకు దిగివస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 40.5 డిగ్రీలుగా, కనిష్ఠ ఉష్ణోగ్రత 27.1 డిగ్రీలుగా నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గాలిలో తేమ 32 శాతంగా నమోదైందని చెప్పారు. గాలిలో తేమ 36 డిగ్రీలకుపైగా నమోదైతే క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి నగరంలో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని ఆయన తెలిపారు.


### గాలివాన బీభత్సం

ఆదిలాబాద్ జిల్లా తాంసి, భీంపూర్ మండలాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి పిడుగుపాటుకు తాంసి మండలం వడ్డాడి మత్తడివాగు సమీపంలో 33 గొర్రెలు మృతిచెందాయి. వడ్డాడి, కప్పర్ల, పిప్పల్‌కోటి, గోట్కూరి తదితర గ్రామాల శివారులో 40 విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. తాంసి, భీంపూర్, తలమడుగు మండలాల్లో విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి.

## ఓటు వేయలేదని దాడి

- టీఆర్ఎస్ మహిళా కార్యకర్త మృతి

**మహబూబ్‌నగర్ క్రైం:** తమ అభ్యర్థికి ఓటు వేయలేదని దాడి చేయడంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటు చేసుకున్నది. ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంచంద్రాపురంలో ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో తమకు ఓటు వేయలేదన్న కోపంతో ఇండిపెండెంట్ అభ్యర్థి తరపున వ్యక్తులు కుర్వశ్రీను, శివప్రసాద్, జావద్ కేశవులు, గోపాలు, నర్సింలు, జావదు మల్లేష్, కిష్టయ్య,



అనసూయ (ఫైల్)

రాఘవేందర్‌గౌడ్, నవీన్, పాండు, జావద్ కృష్ణయ్య మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన కే.అశోక్ చారిని కొడుతుండగా అక్కడికి వెళ్లిన టీఆర్ఎస్ కార్యకర్త అనసూయ(38) అడ్డుకున్నది. దీంతో అనసూయపై సైతం దాడి చేయగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## రైలు నుంచి పడి ఏఎస్సై దుర్మరణం

**కాగజ్‌నగర్ రూరల్:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్– సిర్పూరు(టీ) స్టేషన్ల మధ్యగుర్తుతెలియని రైలు నుంచి పడి పంజాల మొండయ్య అనే ఏఎస్సై మృతి చెందినట్టు రైల్వే ఎస్ఐ జితేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. మంచిర్యాల జిల్లా దేవాపూర్ ఏఎస్సైగా పని చేస్తున్న మొండయ్య ఇటీవల ఎస్సైగా పదోన్నతి పొందాడు. శిక్షణ కోసం హైదరాబా ద్ వెళ్లాడు. బుధవారం కాగజ్‌నగర్‌కు రైలులో వస్తుండగా ప్రమాదానికి గురై మృతిచెందాడు.

## అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

### 74.42 తులాల బంగారం, కిలోన్నర వెండి, బైక్ స్వాధీనం

**మంచిర్యాల టౌన్, నమస్తే తెలంగాణ:** ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను మంచిర్యాల పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 74.42 తులాల బంగారు, కిలోన్నర వెండి ఆభరణాలు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మంచిర్యాలలో డీసీపీ రక్షిత కే మూర్తితో కలిసి రామగుండం పోలీస్ క మిషనర్ సత్యనారాయణ మీడియాకు వివరా లువెల్లడించారు. దొంగలిద్దరిపై పలు జిల్లాలో కేసులు ఉన్నాయనీ, జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చారనీ, పద్ధతి మార్చుకోకుండా దొంగతనాలనే వృత్తిగా పెట్టుకున్నారని వివరించారు. వీరిలో టేకం రాముది మందమర్రి అని, రాంటెంకి సారయ్యది పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం భోగంపల్లి గ్రామమని సీపీ వివరించారు.

## మొదలైన భూసారకార్డుల పంపిణీ

- 1.15 లక్షల మందికి అందించనున్న వ్యవసాయశాఖ
- రాష్ట్రంలోని 558 మండలాల్లో భూసార పరీక్షలు
- సాయిల్ హెల్త్‌కార్డు పోర్టల్‌లో భూసార వివరాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైతులకు పంట పెట్టుబడి తగ్గించి, దిగుబడి పెంచడమే లక్ష్యంగా వ్యవసాయశాఖ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన భూసార పరీక్షల ప్రక్రియ పైలట్ ప్రాజెక్టు పూర్తయింది. రాష్ట్రంలోని 558 మండలాల్లో ప్రతీ మండలంలో ఒక్కొక్క గ్రామాన్ని ఎంచుకొని 1.15 లక్షల మట్టి నమూనాలను సేకరించి, భూసార పరీక్షలు నిర్వహించారు. నివేదికలు, కార్డుల ముద్రణ పూర్తికావటంతో రాష్ట్రవ్యాప్తంగా కార్డుల పంపిణీ ప్రారంభించారు. భూసార పరిరక్షణ పథకం కింద రైతు భూమిలోని పోషకలోపాలను గుర్తించి, ఏ పంటలు సాగుచేయాలి? ఎంతమోతాదులో ఎరువులు వాడాలి? పెట్టుబడిని తగ్గించి నాణ్యమైన, స్థిరమైన దిగుబడిని ఎలా సాధించాలి? అనే అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఒక ప్రాంతీయ, నాలుగు సంచార, మూడు జిల్లాస్థాయి, 12 మార్కెట్ కమిటీ కేంద్రాలు కలిపి 26 పరీక్షకేంద్రాల్లో విశ్లేషణ చేశారు. 558 గ్రామాల నుంచి మట్టి నమూనాలు సేకరించి ప్రతి శాంపిల్‌కు ఒకటి చొప్పున 1.15 లక్షల హెల్త్ కార్డులు తయారుచేశారు. మట్టి నమూనాలు, రైతుల వివరాలు, భూసార పరీక్ష ఫలితాలు, సూక్ష్మ పోషకాలు, సేంద్రియ-రసాయన ఎరువుల సిఫారసు తదితర సమగ్ర వివరాలను సాయిల్ హెల్త్‌కార్డుపై ముద్రించారు. దీంతో ఈ సీజన్‌లో నేల స్వభావాలకు అనుగుణంగా మట్టి పరీక్షలు నిర్వహించారు.

### సాయిల్ హెల్త్‌కార్డులు చాలా ముఖ్యం

భూసార పరీక్షాకేంద్రాల్లో విశ్లేషించిన వివరాలను 'సాయిల్ హెల్త్ కార్డు' పోర్టల్‌లో నమోదుచేశారు. దేశవ్యాప్తంగా ఏ గ్రామంలోని నేల స్వభావమైనా, ఏ మారుమూల గ్రామం నుంచైనా ఈ పోర్టల్‌లో నేల సారాన్ని తెలుసుకోవచ్చు. సాయిల్ హెల్త్‌కార్డులు చాలా ముఖ్యమైనవని, నేల సారాన్ని, స్వభావాన్ని పూర్తిగా విశ్లేషించి కార్డులు రూపొందించామని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కే రాములు తెలిపారు. సాయిల్‌హెల్త్‌కార్డులను తప్పకుండా పాటించినప్పుడే భూసారం పెరుగుతుందని పేర్కొన్నారు.



నిర్మల్‌లోని తన ఇంటి ఆవరణలో మొక్క నాటుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

## 'హరితహారం' ప్రపంచానికే ఆదర్శం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

**నిర్మల్ అర్బన్, నమస్తే తెలంగాణ:** జీవకోటి మనుగడకు పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదనీ, హరితహారం ప్రపంచానికే ఆదర్శమని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్మల్ జిల్లాలోని ఆయన ఇంటి ఆవరణలో మంత్రి మొక్కలు నాటారు. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగానే ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరిగి వర్షాలు తగ్గుతున్నాయని మంత్రి అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసమే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో 230 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఇప్పటికే 113 కోట్ల మొక్కలు నాటామనీ, ఐదో విడతలో ఈ ఏడాది 83 కోట్ల మొక్కలను నాటుతామని స్పష్టం చేశారు. అనంతరం ఆయన జూట్ బ్యాగులను పంపిణీ చేశారు.

## రేగొండ టీఆర్ఎస్ జెడ్పీటీసీ అభ్యర్థికి భారీ మెజార్టీ


**రేగొండ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ టీఆర్ఎస్ పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి సాయిని విజయ 15,798 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొంది రికార్డు సృష్టించారు. టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలకు చెందిన నలుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 32,766 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా.. నోటాకు 404, చెల్లని ఓట్లు 862, కాంగ్రెస్ అభ్యర్థి సంధ్యారాణికి 5376, టీడీపీ అభ్యర్థి రమాదేవికి 551, బీజేపీ అభ్యర్థి స్వప్నకు 4399 ఓట్లు వచ్చాయి.



మేత కోసం వచ్చిన రెండు ఒంటెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. ఈ ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెంలో జరిగింది. రాజస్థాన్‌కు చెందిన జానీ దేవాకు చెందిన రెండు ఒంటెలు మంగళ వారం సాయంత్రం మేతకు వెళ్లగా విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాయి. వీటి విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని బాధితుడు చెప్పాడు. -దండేపల్లి

## కలుషితాహారం తిని 40 మందికి అస్వస్థత

**సిరికొండ:** విందు భోజనం వికటించి 40 మంది అస్వస్థతతకు గురైన ఘటన ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం చెమ్మాన్‌గూడలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెమ్మాన్‌గూడలో మంగళవారం దినేశ్– జమున దంపతుల బిడ్డ కేశఖండన విందు ఏర్పాటు చేశారు. అక్కడ మిగిలిన ఆహార పదార్థాలను బంధువులు బుధవారం ఉదయం కూడా తినడంతో 40 మందికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. విష యం తెలుసుకున్న పిట్టబొగారం ప్రాథమిక వైద్యాధికారి శ్రీధర్ గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి 20 మందికి చికిత్సనందించారు. మరో 20 మందిని మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఆహారపదార్థాలను, తాగునీటి శాంపిళ్లను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపుతామని చెప్పారు.



ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులు

# ప్రాణం తీసిన ఈత సరదా

- వేర్వేరు జిల్లాలో ఏడుగురు చిన్నారుల మృతి
- నాగర్‌కర్నూల్ జిల్లాలో నీటి కుంటలో పడి ముగ్గురు..
- సంగారెడ్డి జిల్లా రుద్రారంలో క్వారీ గుంతలో మునిగి నలుగురు..



నాగర్‌కర్నూల్ జిల్లా వడ్డెమాన్‌లో నీటి కుంటలో పడి మృతి చెందిన అనిల్, శైలజ, స్వాతి (ఫైల్)

**బిజినేపల్లి/పటాన్‌చెరు :** ఈత సరదా ఏడుగురు చిన్నారులను బలితీసుకున్నది. సరదాగా నీటిలోకి దిగిన ఆ పిల్లల్ని కుంటలు కబలించాయి. ఈత కోసం నీటి కుంటలోకిదిగి నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వడ్డెమాన్‌లో ముగ్గురు, క్వారీ గుంతలో పడి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలో నలుగురు చిన్నారులు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా వడ్డెమాన్ గ్రామానికి చెందిన కడారి బాలయ్య– చెన్నమ్మ కూతురు శైలజ(12), చంద్రయ్య– అంజనమ్మ కూతురు స్వాతి(10), కుమారుడు అనిల్(5), మరో ఇద్దరు చిన్నారులు గణేశ్(8), శివ(8) గ్రామ సమీపంలో ఉన్న సూరయ్యకుంటకు కట్టెలు తెచ్చుకునేందుకు వెళ్లారు. తిరిగి ఇంటికి బయలుదేరే ముందు స్నానం చేసేందుకు వీరిలో నలుగురు కుంటలోకి దిగారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోగా.. గణేశ్ బయటపడ్డాడు. గమనించిన చుట్టుపక్కల వాళ్లు వెంటనే నీటిలో దిగి బయటికి తీసేలోపు శైలజ, స్వాతి, అనిల్ మృతిచెందారు. ముగ్గురు విద్యార్థులు ఒకేసారి మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్సై లక్ష్మీనర్సింహ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

### క్వారీ గుంతలో మునిగి నలుగురు చిన్నారులు మృతి

**పటాన్‌చెరు రూరల్, నమస్తే తెలంగాణ:** క్వారీ గుంతలో మునిగి నలుగురు చిన్నారులు మృత్యువాత పడిన విషాద ఘటన సంగారెడ్డి జిల్లా రుద్రారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ ప్రాంతానికి చెందిన దినకర్, రాజు, వారి చెల్లెలు రత్నమ్మ పిల్లలను రుద్రారంలోని వారి సమీప బంధువు సాంబయ్య ఇంటికి మంగళవారం పంపించారు. బుధవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో గీతం యూనివర్సిటీ వెనుకవైపు ఉన్న పెద్దబండ క్వారీ వద్దకు ఆరుగురు చిన్నారులు ఆడుకోవడానికి వెళ్లారు. అక్కడ క్వారీ గుంతలోకి లోకేశ్ (14), నందిని (15), ఆనంద్ (13), గోవర్ధన్ (14) దిగారు. వీరిలో ఎవరికి ఈత రాకపోవడంతో ఒకొక్కరుగా నీళ్లలోకి మునిగిపోతుండడంతో ఒకరినొకరు కాపాడుకునే ప్రయత్నంలో నలుగురు చిన్నారులు నీళ్లలో మునిగిపోయారు. వారితోపాటు వచ్చిన ఇద్దరు చిన్నా రులు నీళ్లలోకి దిగలేదు. వెంటనే విషయాన్ని ఆ ఇద్దరు చిన్నారులు ఇంటికి వెళ్లి చెప్పారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే క్వారీ వద్దకు వచ్చారు. అప్పటికే గమనించిన స్థానికులు క్వారీ గుంతలో మునిగిపోయిన చిన్నారులను వెతికే ప్రయత్నం చేశారు. చిన్నారుల జాడ తెలియకపోవడంతో పోలీసులకు సమాచారం అందించడంతో డీఎస్పీ రాజేశ్వర్‌రావు, సీఐ నరేశ్‌లు అక్కడికి చేరుకుని ఈతగాళ్లతో నలుగురు చిన్నారుల మృతదేహాలను బయటకు తీశారు. చిన్నారుల మృతదేహాలను చూసి వారి కుటుంబ సభ్యులు రోదించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## బీజేపీ గెలుపు నీటి బుడగలాంటిది

### ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు నీటి బుడగలాంటిదని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసం ఏమాత్రం చెక్కు చెదరలేదని ప్రాదేశిక ఎన్నికలు నిరూపించాయన్నారు. బుధవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ఉండాలని కొన్ని ప్రాంతాల ప్రజలు కోరుకున్న నేపథ్యంలో కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, సికింద్రాబాద్‌లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారన్నారు. వీళ్లది వాపు మాత్రమేననీ, మెరుపు వచ్చి వెళ్లినట్లుగా వీళ్ల విజయం ఉంటుందన్నారు. జడ్పీ, మండల ప్రజా పరిషత్ ఎన్నికల్లో కేసీఆర్‌పై అచంచల విశ్వాసాన్ని ప్రజలు వ్యక్తం చేశారని చెప్పారు. దేశ చరిత్రలో ఇలాంటి ఎన్నికలు తానెప్పుడూ చూడలేదన్నారు. రాష్ట్రంలోని 32 జడ్పీలపై గులాబీ జెండా ఎగురనున్నదని అన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి పునరావృతం అవుతుందని పేర్కొన్నారు.

## డెత్ క్లెయిమ్‌ల పేరిట రూ.3 కోట్లు స్వాహా

**కోదాడ, నమస్తే తెలంగాణ:** ఎల్ఐసీ ఏజెంట్లు, సంస్థలో పని చేసే ఉద్యోగులు కుమ్మక్కై భారీ మోసానికి తెరలేపారు. బతికున్న వారికే మరణ ధ్రువపత్రాలు తీసుకొచ్చి రూ.కోట్లు దోచుకున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ జీవిత బీమా సంస్థలో పని చేసి ప్రస్తుతం ఆదిలాబాద్‌కు బదిలీ అయిన ఎల్ఐసీ ఉద్యోగులు బీబీనాయక్, హరినాయక్, ఏజెంట్లు రఘుచారి, కొండయ్య, సురేశ్, ధనమూర్తి, సురేందర్‌రెడ్డి, విజయకుమారి, సైదాచారి, వెంకన్న, రవితో కుమ్మక్కై బతికి ఉన్న 190 మంది చనిపోయినట్టు నకిలీ ధ్రువపత్రాలతో రూ.3 కోట్ల దాకా దండుకున్నారు. ఇక్కడే సుదీర్ఘంగా ఏజెంట్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి ఏకంగా తనే మృతి చెందినట్టు నకిలీ పత్రాలు సృష్టించుకొని రూ.9 లక్షలను తన ఖాతాలోకే మళ్లించుకున్నాడు. సీబీఐ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి మంగళవారం హైదరాబాద్‌లోని పలువురు ఏజెంట్లు, ఉద్యోగుల ఇండ్లల్లో తనిఖీలు చేపట్టి కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇప్పటికే ఎల్ఐసీ ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో పాటు ఏజెంట్ల లైసెన్స్‌ను రద్దు చేసింది.

# ఇది శ్రీచైతన్య NEET-AIIMS SUPER-60, MPL, MEDICON ప్రోగ్రామ్‌ల విప్లవం

# శ్రీచైతన్య హైదరాబాద్ డే & రెసిడెన్షియల్ క్యాంపస్‌ల ఆధిపత్యం

**6**



K D KUMAR RAJU
H.T. No. 120503842

**7**



M HARSHAVARDHAN NAIK
H.T. No. 120501801

**10**



MUDAVATH NIKHIL KUMAR
H.T. No. 420112687

మెడికల్ సీట్లు సాధించగల శ్రీచైతన్య విద్యార్థులు

**2503**

హైదరాబాద్ జోన్

## ఆలిండియా ఆల్ కేటగిరీ 100 లోపు ర్యాంకులు

- 12 — SREE SREYU
- 13 — B DEVENDER
- 16 — KANDRAKONDA PRIYADARSINI
- 26 — MANISH KUMAR OLA
- 26 — ANOOHYA KAVURI
- 28 — A TULASI
- 30 — POTHALA SANDEEP NAIDU
- 30 — S MAGESWARI
- 32 — GUGLAVATH LAYA
- 33 — KOVID KUMAR LABANA
- 33 — POTALA PRANATHI
- 33 — MALOTHU SUMALYA
- 34 — A SUSHRUTHA
- 36 — MAHESH ANAND
- 37 — MERAVATH RAJUNAIK
- 38 — GURRAM SAI ANEELA
- 40 — KOPPALA DHEERAJ KUMAR
- 40 — PILLI BHANU SIVA TEJA
- 42 — TOKOTUSHAR
- 43 — RACHAPROLU SHRESHTA
- 43 — MAHESH ANAND
- 44 — A NAGASETTY BHARATHI
- 46 — ARRA SRIHITHA
- 49 — BACHALA NAGA NILESH
- 50 — ARE AKSHAY
- 51 — LANKA TEJKARTHIK
- 54 — NEELA VAMSHI KRISHNA
- 54 — BONU MANEESH KUMAR
- 55 — GARAPATI VIJAYARANI
- 55 — EMPATI KUSHWANTH
- 58 — PRIYANSHU AGARWAL
- 59 — ARE AKSHAY
- 59 — BATTU RUCHITA
- 61 — M V SAI GOUTHAM KISHORE
- 62 — VISHAL A M
- 65 — BORRA YASHWANTH DORA
- 65 — NEELA VAMSHI KRISHNA
- 67 — GUVVALA GHANANATH
- 68 — GUGULOTHU MANASA
- 69 — D MOHAN
- 69 — PRIYANSHU AGARWAL
- 72 — KARRA ACHSAH VENITE
- 73 — SHREYA SREENIVAS
- 76 — BOYA BRUNDHAVANI
- 78 — SATYAJEET SAHA
- 78 — KALLA SREE SREYU
- 80 — JANGAPALLI HARIKA
- 81 — MUDE LOKESH NAIK
- 87 — SHAIK SOHANAA
- 87 — G RAVINDHAR NAIK
- 91 — MUDE LOKESH NAIK
- 93 — NERAVATI GAGAN
- 93 — TALAGAMPALA SRI VARSHINI
- 97 — JISHNU ANKUR
- 98 — GOLKONDA ADITYA
- 98 — SAKE MOKSHITH SRISAI



ఆలిండియా 43వ ర్యాంక్ సాధించిన హైదరాబాద్ విద్యార్థి మహేష్ ఆనంద్‌తో ఆనందం పంచుకుంటున్న తల్లి

మెడికల్ సీట్లకు అర్హత సాధించగల శ్రీచైతన్య విద్యార్థులు **5212**

**69** ర్యాంక్స్ — 100 లోపు

**123** ర్యాంక్స్ — 200 లోపు

**277** ర్యాంక్స్ — 500 లోపు

NEETలో శ్రీచైతన్య మొత్తం ర్యాంకులు **27,080**

**NEETలో శ్రీచైతన్య తిరుగులేని ఆధిపత్యానికి నిదర్శనం**

| పర్సంటైల్ | బయాలజీలో విద్యార్థుల సంఖ్య | ఫిజిక్స్ & కెమిస్ట్రీలో విద్యార్థుల సంఖ్య |
|---|---|---|
| 99 ఆపైన | 1338 | 1616 |
| 95 ఆపైన | 5620 | 6709 |
| 90 ఆపైన | 9445 | 11952 |

**Long Term 2019-20 Batch Concessions in Vijayawada**

| NEET-2019 Marks | Concession % | NEET-2019 Marks | Concession % |
|---|---|---|---|
| >465 | 90% | 410-419 | 40% |
| 450-464 | 75% | 400-409 | 30% |
| 435-449 | 60% | 375-399 | 15% |
| 420-434 | 50% | | |

The above concessions are valid upto 15th June 2019

**మార్కులలో అద్వితీయమైన పురోగతి**
సాధించిన మా లాంగ్‌టర్మ్ విద్యార్థులలో కొందరు

| Student Name | NEET-18 | NEET-19 |
|---|---|---|
| R. Vijay Kumar Chowdary | 399 | 670 |
| K. Vishnu Vardhan Reddy | 396 | 632 |
| P. Meghana | 419 | 623 |
| K. Gagana Phanisri | 422 | 643 |
| N. E. Naga Purnima | 433 | 672 |
| K. Achsah Venite | 341 | 613 |
| L. Sukumar | 290 | 590 |
| K. Gowri Priya Tejaswi | 261 | 595 |

## LONG TERM-2020

1st Batch Classes Starts From Dt. 20.06.2019

అడ్మిషన్ల కొరకు సంప్రదించండి ✆ 040-66060606

# శ్రీచైతన్య
విద్యాసంస్థలు

ఈ ప్రకటనలో ఏమైనా ముద్రణాలోపాలు ఉంటే మా దృష్టికి తీసుకురాగలరు.

www.srichaitanya.net

# తొలి అడుగు ఘనంగా..

**ప్రపంచకప్‌లో భారత్‌కు అదిరిపోయే బోణీ**

**రోహిత్‌శర్మ అజేయ సెంచరీ**

**చాహల్ స్పిన్ మాయాజాలం**

**దక్షిణాఫ్రికాపై కోహ్లీసేన ఘనవిజయం**



**23**

**అంతర్జాతీయ వన్డేల్లో భారత్ తరపున రోహిత్‌శర్మ 23 సెంచరీలతో గంగూలీ(22)ని అధిగమించాడు.**

**రోహిత్ (122*)**

**చాహల్ (4/51)**

**సౌతాంప్టన్:** ముచ్చటగా మూడోసారి ప్రపంచకప్ టోర్నీని ముద్దాడాలనుకుంటున్న భారత్ తొలి అడుగు ఘనంగా వేసింది. బుధవారం జరిగిన మ్యాచ్ లో టీమ్ఇండియా 6 వికెట్ల తేడాతో సఫారీలపై అద్భుత విజయం సాధించింది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 228 పరుగుల లక్ష్యఛేదనలో భారత్ 47.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 230 పరుగులు చేసింది. ఓపెనర్ రోహిత్‌శర్మ(144 బంతుల్లో 122 నాటౌట్, 13 ఫోర్లు, 2సిక్స్‌లు) అజేయ సెంచరీతో విజృంభించాడు. ధోనీ(34) బాధ్యతాయుతంగా రాణించాడు. తొలుత చాహల్(4/51), బుమ్రా(2/35), భువనేశ్వర్(2/44) ధాటికి దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 227/9 స్కోరు చేసింది. క్రిస్ మోరిస్(42), డుప్లెసిస్(38) ఆకట్టుకున్నారు. అజేయ సెంచరీతో జట్టును గెలిపించిన రోహిత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**రోహిట్:** లక్ష్యఛేదనకు బరిలోకి దిగిన భారత్‌కు సరైన శుభారంభం దక్కలేదు. సఫారీ పేస్ ద్వయం రబాడ, మోరిస్ స్వింగ్‌తో భారత ఓపెనర్లు రోహిత్‌శర్మ, ధవన్(8) చాలా ఇబ్బంది పడ్డారు. వ్యక్తిగత స్కోరు 1 వద్ద రబాడ బౌలింగ్‌లో రోహిత్ ఔటయ్యే ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. ఈ క్రమంలో రబాడ ఇన్నింగ్స్ ఆరో ఓవర్ తొలి బంతికి ధవన్..డికాక్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన కెప్టెన్ కోహ్లీకి రోహిత్ జతకలిశాడు. ఇక లాభం లేదనుకున్న హిట్‌మ్యాన్ ఓ సిక్స్, రెండు ఫోర్లతో చెలరేగడంతో 15 పరుగులు వచ్చాయి. దీంతో తొలి 10 ఓవర్లు ముగిసే సరికి వికెట్ నష్టానికి భారత్ 34 పరుగులు చేసింది. బౌలింగ్ మార్పుగా వచ్చిన ఫెల్కువాయో..రోహిత్‌శర్మ ఎల్బీపై డీఆర్‌ఎస్‌కు వెళ్లగా నిరాశ ఎదురుకావడం కలిసొచ్చింది. గండం గడిచిందనుకుంటున్న తరుణంలో తిరిగి ఫెల్కువాయో బౌలింగ్‌లో డికాక్ కండ్లు చెదిరే క్యాచ్‌తో కోహ్లీ భారంగా పెవిలియన్ చేరాడు. తనకు ఎడంగా వెళుతున్న బంతి ని డికాక్ అందుకున్న తీరు మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. నాలు గో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన కేఎల్ రాహుల్(26)..రోహిత్‌కు చక్కని సహకారమందించాడు. ఓవైపు స ఫారీలు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తున్నా...ఓర్పుతో బ్యాటింగ్ చేస్తూ పోయారు. వీరిని విడదీసేందుకు కెప్టెన్ డుప్లెసిస్..రకరకాల ప్రయోగాలు చేశాడు. అప్పటికే క్రీజులో పాతుకుపోయిన రోహిత్ 70 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. లక్ష్యం దిశగా సాఫీగా సాగుతున్న ఇన్నింగ్స్‌ను రబాడ.. రాహుల్‌ను స్లో బంతితో బోల్తా కొట్టించడంతో మూడో వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ధోనీ.. రోహిత్‌కు చక్కగా సహకరించాడు. ఈ ఇద్దరు సాధికారికంగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను సాఫీగా నడిపించారు. ముఖ్యంగా సహచరులు విఫలమైన చోట తాను ఉన్నానంటూ రోహిత్ ఆడిన ఆట టీమ్ఇండియాను పైచేయిలో నిలిపింది. ఈ క్రమంలో రోహిత్ ప్రపంచ కప్‌లో రెండో సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. భారీ షాట్‌కు యత్నించిన ధోనీ ఔటయ్యాడు. ఆఖర్లో హార్దిక్ (15 నాటౌట్)తో కలిసి రోహిత్ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు.

**బూమ్ బూమ్ బుమ్రా:** టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. పిచ్‌పై ఉన్న తేమను టీమ్ఇండియా బౌలర్లు చక్కగా సద్వినియోగం చేసుకున్నారు. బుమ్రా బుల్లెట్ లాంటి బంతులతో సఫారీ బ్యాట్స్‌మెన్ వెన్నులో వణుకు పుట్టించాడు. బుమ్రా సంధించిన బంతులకు దక్షిణాఫ్రికా ఓపెనర్లు హషీమ్ ఆమ్లా(6), డికాక్(10) షాట్లు కొట్టేందుకు భయపడ్డారు. కెప్టెన్ కోహ్లీ చుట్టు ఫీల్డర్లను మోహరిస్తూ అంతకంతకు ఒత్తిడి పెంచుకుంటూ పోవడం ఫలితమిచ్చింది. బుమ్రా ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో ఆమ్లాను అద్భుత బంతితో బోల్తా కొట్టించాడు. షాట్ ఆడబోయిన డికాక్..కోహ్లీ క్యాచ్‌తో రెండో వికెట్‌గా నిష్క్రమించడంతో టీమ్ఇండియా సంబురాల్లో మునిగి తేలింది. ఇన్నింగ్స్‌ను డుప్లెసిస్, డస్సెన్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. దీంతో రెగ్యులర్ పవర్‌ప్లే ముగిసే సరికి దక్షిణాఫ్రికా రెండు వికెట్ల నష్టానికి 34 పరుగులు చేసింది. సగం బ్యాట్స్‌మెన్ అప్పటికే పెవిలియన్ చేరి కనీసం 150 పరుగులైనా అందుకుంటుందన్న అన్న అనుమానాలను మిల్లర్(31), ఫెల్కువాయో(34), మోరిస్ (42), రబాడ(31 నాటౌట్) రాణించడంతో రెండొందల మార్క్ అందుకుంది.

## స్కోరు బోర్డు

**దక్షిణాఫ్రికా:** ఆమ్లా(సి)రోహిత్(బి) బుమ్రా 6, డికాక్(సి)కోహ్లీ(బి)బుమ్రా 10, డుప్లెసిస్(బి)చాహల్ 38, డస్సెన్ (బి) చాహల్ 22, మిల్లర్ (సి&బి) చాహల్ 31, డుమిని(ఎల్బీ)కుల్దీప్ యాదవ్ 3, ఫెల్కువాయో(స్టంప్/ధోనీ)(బి)చాహల్ 34, మోరిస్(సి)కోహ్లీ(బి)భువనేశ్వర్ 42, రబాడ 31 నాటౌట్, తాహిర్(సి)కేదార్(బి)భువనేశ్వర్ 0; **ఎక్స్‌ట్రాలు:** 10; **మొత్తం:** 50 ఓవర్లలో 227/9; **వికెట్ల పతనం:** 1-11, 2-24, 3-78, 4-80, 5-89, 6-135, 7-158, 8-224, 9-227; **బౌలింగ్:** భువనేశ్వర్ 10-0-44-2, బుమ్రా 10-1-35-2, హార్దిక్ 6-0-31-0, కుల్దీప్ 10-0-46-1, చాహల్ 10-0-51-4, కేదార్ జాదవ్ 4-0-16-0.

**భారత్:** ధవన్(సి)డికాక్(బి)రబాడ 8, రోహిత్ 122 నాటౌట్, కోహ్లీ(సి)డికాక్(బి)ఫెల్కువాయో 18, రాహుల్ (సి)డుప్లెసిస్(బి)రబాడ 26, ధోనీ 16 (సి&బి) మోరిస్ 34, హార్దిక్ 15 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 7; **మొత్తం:** 47.3 ఓవర్లలో 230/4; **వికెట్ల పతనం:** 1-13,2-54, 3-139, 4-213; **బౌలింగ్:** తాహిర్ 10-0-58-0, రబాడ 10-1-39-2, మోరిస్ 10-3-36-1, ఫెల్కువాయో 8.3-0-40-1, శంసీ 9-0-54-0.

# లక్ష్యం దిశగా కివీస్

**244 పరుగులకు బంగ్లా ఆలౌట్**

**దక్షిణాఫ్రికాపై గెలిచి కొండంత విశ్వాసంతో బరిలోకి దిగిన బంగ్లా జట్టు.. న్యూజిలాండ్ ముందు చిన్నబోయింది. అన్ని విభాగాల్లో విఫలమై ఓటమి దిశగా సాగుతోంది. బంగ్లా విధించిన లక్ష్యాన్ని న్యూజిలాండ్ సమర్థవంతంగా ఛేదిస్తోంది.**

**లండన్:** ప్రపంచకప్ తొలి మ్యాచ్ లో దక్షిణాఫ్రికాపై సంచలన విజయం సాధించిన బంగ్లాదేశ్.. బుధవారం న్యూజిలాండ్‌పై జరిగిన మ్యాచ్‌లో విఫలమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టులో షకీబల్ హసన్(68 బంతుల్లో 64 ; 7ఫోర్లు) మినహా ఎవ్వరూ రాణించలేదు. కివీస్ బౌలర్ హెన్రీ(4-47) బంగ్లా బ్యాటింగ్ వెన్నువిరిచాడు. మందకొడిగా పరుగులు చేయడం, వరుసగా వికెట్లు కోల్పోవడంతో బంగ్లాదేశ్ 49.2 ఓవర్లలో 244 పరుగులకే ఆలౌటై కివీస్ ముందు సునాయస లక్ష్యాన్ని ఉంచింది. లక్ష్య ఛేదనలో కివీస్ బ్యాట్స్‌మెన్ సమర్థంగా ఆడుతున్నారు. ఓపెనర్లు గప్టిల్(25), మున్రో(24) స్వల్ప స్కోర్లకే వెనుదిగినా రాస్ టేలర్(53 బంతుల్లో 61 నాటౌట్ ; 7ఫోర్లు)తో ధాటిగా ఆడుతున్నాడు. కెప్టెన్ విలియమ్సన్(67 బంతుల్లో 38 ; 1ఫోర్) అతనికి తోడుగా ఉన్నాడు. కడపటి వార్తలందే సరికి కివీస్ 28 ఓవర్లకు 2వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసింది. బంగ్లా బౌలర్లలో షకిబుల్ ఒక్కడే రెండు వికెట్లు తీశాడు.

**షకీబ్ ఒక్కడే..**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా ఓపెనర్లు తమీమ్ ఇక్బాల్(38 బంతుల్లో 24 : 3ఫోర్లు), సౌమ్యా సర్కార్(25 బంతుల్లో 25 ; 3ఫోర్లు) ఓ మోస్తరు ఆరంభాన్నిచ్చారు. వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ స్కోరు పెంచే ప్రయత్నం చేశారు. స్కోరు 8.2 ఓవర్లకు 45కు చేరుకుంది. ఆ తర్వాతి బంతికే సర్కార్‌ను కివీస్ బౌలర్ హెన్రీ పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత పరుగులు మందగించడంతో భారీ షాట్‌కు ప్రయత్నించి తమీమ్ ఫెర్గూసన్ బౌలింగ్ ఔటయ్యాడు. ఆ తర్వాత ముష్ఫికర్ రహీం(19), షకీబల్ హసన్ (68 బంతుల్లో 64; 7ఫోర్లు ) జాగ్రత్తగా ఆడుతూ పరుగులు రాబట్టారు. 50 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. జట్టు స్కోరు 23.5 ఓవర్లకు 110 పరుగులుగా ఉన్న సమయంలో ముష్ఫికర్ రనౌట్‌గా వెనుదిరగడం మ్యాచ్‌నే మలుపుతిప్పింది. ఆ తర్వాత కూడా షకిబల్ హసన్ అర్ధశతకం పూర్తి చేసి ధాటిగా ఆడేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో గ్రాండ్‌హోం బౌలింగ్‌లో అవుటయ్యాడు. అప్పటి నుంచి ఏ బ్యాట్స్‌మెన్ ఆకట్టుకోలేకపోయారు. క్రీజుల్లో ఉన్న మిథున్(26), మహ్మదుల్లా స్వేచ్ఛగా పరుగులు చేయలేకపోయారు. దీంతో ఒత్తిడికి గురైన మిథున్ 38వ ఓవర్లో వెనుదిరగగా, మహ్మదుల్లా 43వ ఓవర్లో ఔటయ్యాడు. ఆ తర్వాత సైపుద్దీన్ ఓ వైపు బ్యాటింగ్ చేస్తుంటే అతడికి కాసేపు మొసాద్దీక్ సహకరించాడు. అతను ఔటయ్యాక వికెట్లు టపటపా పడ్డాయి. చివరి ఓవర్లో సైపుద్దీన్ సహా మొర్తజా అవుటవడంతో బంగ్లా ఇన్నింగ్స్ 49.2 ఓవర్లలో 244 పరుగుల వద్ద ముగిసింది. న్యూజిలాండ్ బౌలర్లలో హెన్రీ 4వికెట్లు పడగొట్టగా, బౌల్ట్ 2, ఫెర్గూసన్, గ్రాంహోమ్, శాంట్నర్ చెరో వికెట్ తీసుకున్నారు.

**సంక్షిప్త స్కోర్లు: బంగ్లాదేశ్:** 49.2 ఓవర్లలో 244 ఆలౌట్(షకీబల్ హసన్ 64, మిథున్ 26, హెన్రీ 4/47, బౌల్ట్ 2/44), **న్యూజిలాండ్:** 28 ఓవర్లలో 2 వికెట్లకు 150.


**JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD**
(Established by Govt. Act No. 30 of 2008)
Kukatpally, Hyderabad - 500 085, Telangana (India)

**TENDER NOTICE**

Tender Notice No.JNTUH/DAPG/TENDERS/06/2019 Dt: 05.06.2019

Sealed Tenders are hereby invited from reputed registered Medical Insurance providers for Providing Group Medical Insurance Coverage for Employees, Pensioners and their Families of the University.

Sale of tender forms from 10.06.2019 at Acad. & Planning Office, JNTUH. Last date for submission of tenders 22.06.2019 at 03.00 PM. Detailed notification is available at www.jntuh.ac.in

Sd/- REGISTRAR


# వాణిజ్య


## కోల్ ఇండియా రూ.10 వేల కోట్ల పెట్టుబడి

**న్యూఢిల్లీ, జూన్ 5:** కోల్ ఇండియా ఈ ఏడాది భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా 66 కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడానికి మూలధన వ్యయం కింద రూ.10 వేల కోట్ల నిధులను ఖర్చు చేయనున్నట్లు బుధవారం ప్రకటించింది. అలాగే లక్ష కోట్ల రూపాయల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 61 కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ దీంట్లో 60.68 కోట్ల టన్నులను ఉత్పత్తి చేయగలిగింది.

# ఈ సారి వృద్ధి 7.5 శాతం

**భారత వృద్ధిరేటుపై ప్రపంచ బ్యాంక్ అంచనా**

**వచ్చే రెండేండ్లలోనూ జీడీపీ యథాతథం**




**వాషింగ్టన్, జూన్ 5:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20) దేశ జీడీపీ అంచనాను ప్రపంచ బ్యాంక్ యథాతథంగానే ఉంచింది. గతంలో చెప్పినట్లుగానే 7.5 శాతం వృద్ధిరేటునే తాజాగా మరోసారి ప్రకటించింది. వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాల్లోనూ ఇంతే నమోదు కాగలదని స్పష్టం చేసింది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రస్తుతం నెలకొన్న ప్రతికూల పరిస్థితుల మధ్య ప్రపంచ బ్యాంక్ అంచనాలు మోదీ సర్కారుకు శుభవార్తేనన్న అభిప్రాయాలు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2018-19) చివరి త్రైమాసికం (జనవరి-మార్చి)లో జీడీపీ ఐదేండ్ల కనిష్ఠానికి పతనమైన విషయం తెలిసిందే. 5.8 శాతంగానే నమోదైంది. ఈ క్రమంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటును 7.5 శాతంగా ప్రపంచ బ్యాంక్ అంచనా వేయడం.. దేశ ఆర్థిక పరిస్థితులు మెరుగయ్యాయన్న సంకేతాలనే ఇస్తున్నదని విశ్లేషకులు అంటున్నారు. 'ప్రపంచ ఆర్థిక అవకాశాలు' పేరుతో ప్రపంచ బ్యాంక్ తాజాగా భారత్‌సహా పలు కీలక దేశాల వృద్ధిరేటు గణాంకాలను విడుదల చేసింది. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లోనూ 7.5 శాతం వృద్ధిరేటును భారత్ సాధించగలదని ఈ సందర్భంగా అంచనా వేసింది. పెట్టుబడులు, వినియోగ సామర్థ్యం పుంజుకుంటాయన్న ధీమాతోనే ఈ అంచనా అని ప్రపంచ బ్యాంక్ తమ నివేదికలో పేర్కొన్నది. దీంతో మోదీ సర్కారుపై విశ్వాసంతోనే తాజా అంచనాలు వచ్చాయన్న అభిప్రాయాలు విస్తృతంగా వినిపిస్తున్నాయి. అయితే గత ఆర్థిక సంవత్సరం 7.2 శాతంగానే దేశ జీడీపీ నమోదు కావచ్చని పేర్కొన్నది.

### చైనా జీడీపీ ఢమాల్

భారత జీడీపీపై విశ్వాసాన్ని వ్యక్తం చేసిన ప్రపంచ బ్యాంక్.. చైనా వృద్ధిరేటు విషయంలో మాత్రం అంతటి నమ్మకాన్ని చూపలేకపోయింది. గతేడాది 6.6 శాతంగా ఉన్న డ్రాగన్ వృద్ధిరేటును.. ఈ ఏడాది 6.2 శాతానికి అంచనా వేసింది. వచ్చే ఏడాది 6.1 శాతం, ఆపై ఏడాది 6 శాతంగానే పేర్కొనడం గమనార్హం. దీంతో వేగవంతమైన వృద్ధిరేటును కలిగిన దేశంగా భారత్ ఇక ముందూ కొనసాగే వీలు చిక్కింది. ఈ విషయంలో భారత్-చైనా గణాంకాలు దోబూచులాడుకుంటున్న సంగతి విదితమే. 2021లోనూ చైనాతో పోల్చితే భారత్ వృద్ధిరేటు 1.5 శాతం అధికంగా ఉండగలదని చెప్పడంతో ఆసియా ఖండంలో చైనాపై భారత్ ఆధిపత్యం కొనసాగనున్నట్లైంది. కాగా, అమెరికాతో వాణిజ్య యుద్ధం.. చైనా జీడీపీకి బ్రేకులు వేస్తున్నదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**బడ్జెట్‌కు ముందు జోష్**

పార్లమెంట్‌లో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న సమయంలో విడుదలైన ఈ జీడీపీ అంచనాలు.. బడ్జెట్‌లో పలు ఉత్సాహవంతమైన ప్రకటనలకు దోహదం చేయవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థిక మందగమనం, బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ), నాన్-బ్యాంకింగ్ రంగంలో నగదు కొరత, ఉద్యోగ సృష్టి, ప్రైవేట్ పెట్టుబడుల పెంపు, ఎగుమతుల వృద్ధి, వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక క్రమశిక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ వచ్చే నెల 5న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారని తెలుస్తున్నది. ఈ క్రమంలో ప్రపంచ బ్యాంక్ జీడీపీ అంచనా.. దేశ ఆర్థిక పరిస్థితులు మళ్లీ గాడిన పడ్డాయన్న విశ్వాసాన్ని కేంద్రంలో కలిగింపజేసే వీలుందని పలువురు విశ్లేషకులు అంటున్నారు.

## బ్యాంకులకు రూ.3,334 కోట్ల కుచ్చుటోపి



**రుణం తీసుకొని ఎగ్గొట్టిన డిఫీ పోర్ట్ చైర్మన్ విజయ్ కలాంత్రి**

**ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారుడిగా ప్రకటించిన బీవోబీ**

**న్యూఢిల్లీ, జూన్ 5:** వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ మోసం సంఘటన మరువకముందే మరో భారీ మోసం బహిర్గతమైంది. ప్రభుత్వరంగ బ్యాంకుల వద్ద భారీ స్థాయిలో రుణాలు తీసుకొని ఎగ్గొట్టిన వారి జాబితా క్రమంగా పెరుగుతున్నది. ఇప్పటికే ఈ జాబితాలో నీరవ్ మోదీ, విజయ్ మాల్యా, మెహుల్ చోక్సీలు ఉండగా..తాజాగా ఈ జాబితాలోకి డిఫీ పోర్ట్ చైర్మన్ విజయ్ గోవర్ధన్‌దాస్ కలాంత్రి, ఆయన కుమారుడు విశాల్ కలాంత్రి చేరారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా నేతృత్వంలోని 16 బ్యాంకుల కన్సార్షియం వద్ద రూ.3,334 కోట్ల రుణం తీసుకొని తిరిగి చెల్లింపులు జరుపడంలో వీరిద్దరు విఫలమయ్యారు. దీంతో బీవోబీ.. విజయ్ కలాంత్రిని ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారుడిగా ప్రకటించింది. ఓడరేవును అభివృద్ధి చేయడానికి తండ్రి, కుమారులిద్దరు కలిసి బీవోబీ వద్ద భారీ స్థాయిలో రుణాలు తీసుకున్నారు. బాలాజీ ఇన్‌ఫ్రా యజమాని అయిన విజయ్ కలాంత్రికి..డిఫీ పోర్ట్‌లో 51.01 శాతం వాటా ఉండగా, ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్‌కి 39.37 శాతం వాటా ఉన్నది. ఈ నెల 2న ముంబైకి చెందిన ప్రముఖ పత్రికలో వీరిద్దరిని ఉద్దేశ పూర్వక రుణ ఎగవేతదారులుగా పేర్కొంటూ ఓ ఫోటో ప్రకటనను కూడా జారీ చేశాయి బ్యాంకులు. ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం విజయ బ్యాంక్ (ప్రస్తుతం బీవోబీలో విలీనమైంది) ఈ పబ్లిక్ నోటీసును జారీ చేసింది. దీనిలో డిఫీ పోర్ట్ లిమిటెడ్, కంపెనీ డైరెక్టర్, గ్యారెంటీగావున్న విశాల్ విజయ్ కలాంత్రి, మరో డైరెక్టర్, గ్యారెంటీగా ఉన్న విజయ్ గోవర్ధన్‌దాస్‌లను 'విల్‌ఫుల్ డిఫాల్టర్'గా ప్రకటించింది.

## జీ-20 సమావేశాలకు సీతారామన్



**న్యూఢిల్లీ, జూన్ 5:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 8 నుంచి రెండు రోజులపాటు జరుగనున్న జీ-20 దేశాల ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ల సమావేశానికి హాజరు కాబోతున్నారు. జపాన్‌లోని ఫకువోకా నగరంలో సమావేశాలు జరుగనున్నాయి. గత వారం ఆర్థిక మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సీతారామన్‌కు ఇది తొలి విదేశీ పర్యటన కావడం విశేషం. ఆమెతోపాటు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అంతర్జాతీయ మార్కెట్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, మౌలిక రంగం, పన్నుల అంశాల్లో నెలకొన్న సంక్లిష్టతలపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చించనున్నారు.




# NEETలో గెలుపు ఎప్పుడూ నారాయణదే
## ఆలిండియా గర్ల్స్ ఫస్ట్ ర్యాంకు, సౌత్ ఇండియా ఫస్ట్ ర్యాంకు నారాయణదే !
## నారాయణకు దరిదాపుల్లో మరెవ్వరూ లేరు... లేరు... లేరు...

| NEET-2019 RESULTS | నారాయణ | ఇతరులు |
|---|---|---|
| ఆలిండియా బాలికల విభాగంలో 1వ ర్యాంకు | జాతీయస్థాయిలో నారాయణకు మాత్రమే వచ్చింది | ఇంక ఎవ్వరికీ రాలేదు |
| దక్షిణ భారతదేశంలో 1వ ర్యాంకు | నారాయణకు మాత్రమే వచ్చింది | ఇంక ఎవ్వరికీ రాలేదు |
| తెలంగాణ రాష్ట్రంలో 1వ ర్యాంకు | నారాయణకు మాత్రమే వచ్చింది | ఇంక ఎవ్వరికీ రాలేదు |
| ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1వ ర్యాంకు | నారాయణకు మాత్రమే వచ్చింది | ఇంక ఎవ్వరికీ రాలేదు |
| దక్షిణ భారతదేశంలో 2వ ర్యాంకు | నారాయణకు మాత్రమే వచ్చింది | ఇంక ఎవ్వరికీ రాలేదు |
| ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 7వ ర్యాంకు | జాతీయస్థాయిలో నారాయణకు మాత్రమే వచ్చింది | ఇంక ఎవ్వరికీ రాలేదు |

## NEET 2019లో అన్ని కేటగిరీలలో 1000 లోపు నారాయణ ర్యాంకులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 128 SUNKARA SAI SWATHI HT No. 120400952 | 132 VARUN NANDA KUMAR HT No. 180101219 | 135 BURRA SHIVANI SRI VASTAVA HT No. 420128558 | 136 YENNI SUPRIYA HT No. 120611933 | 137 SABAVAH DIVYA HT No. 420112526 | 158 SUNKARA SAI SWATHI HT No. 120400952 | 159 HARI CHARAN P HT No. 270235100 | 164 MANTINA ROHITH HT No. 120609795 | 164 VARUN NANDA KUMAR HT No. 180101219 |
| 175 MUNAGALA PAVANI HT No. 120200899 | 176 KOVID KUMAR LABANA HT No. 390307302 | 188 LADI KIRTHIKA HT No. 120606500 | 203 P.MAHESH HT No. 420100119 | 209 A.RAJASHEKAR HT No. 420102450 | 213 RAVINDRA HT No. 390406037 | 218 JAKKA NARAYANA VARUN HT No. 420119157 | 220 SANGA RANI HT No. 420114648 | 232 RAKSHITA NM HT No. 270235284 |
| 239 LADI KIRTHIKA HT No. 120606500 | 240 K J VAISHNAVI VARMA HT No. 120205163 | 254 ANUHYA GOPI HT No. 420135616 | 260 NUNAVATH SUMANTH HT No. 420302442 | 286 ASHUTOSH DWIVEDI HT No. 440107067 | 294 RAKSHITA NM HT No. 270235284 | 310 GUJJULA BHUVAN ADVAITH HT No. 120304160 | 325 MALLEPOGU NAMRATHA HT No. 120206115 | 365 ASHUTOSH DWIVEDI HT No. 440107067 |
| 405 S SANJANA SANTHOSHI HT No. 420115363 | 405 SANJANA SONTHOSHI HT No. 420115363 | 414 KANIKE SAI CHINMAYA HT No. 420103862 | 414 AKSHAYA CHENCHU HT No. 420114745 | 420 M.MAKATLAL HT No. 420111481 | 426 TEEPALAPUDI ABHISHEK HT No. 120304117 | 433 VADADA RAM SAI HT No. 120606296 | 437 BELLANA SURYA DEEPAK HT No. 120608168 | 451 LIKHITHA S HT No. 270240700 |
| 466 R. SOPAN HT No. 420138644 | 467 T SESHA SAI LAHARI HT No. 120505878 | 469 MONISHA PRIYA J HT No.420104714 | 483 MANGAPURAM DHANUSH HT No. 120403261 | 521 V LAKSHMI VENNELA REDDY HT No. 120516451 | 524 G CHARAN AADITYA REDDY HT No. 420102102 | 525 GAGAN S HT No. 270223205 | 530 SIVVA SANJANA SANTHOSHI HT No. 420115363 | 542 AKSHAYA CHENCHU HT No. 420114745 |
| 575 CHINNALA SAI AMEYA HT No. 420125688 | 610 T SESHA SAI LAHARI HT No. 120505878 | 610 D.JEEVAN HT No. 420117369 | 632 MANGAPURAM DHANUSH HT No. 120403261 | 677 V LAKSHMI VENNELA REDDY HT No. 120516451 | 677 A.SREEDHAR NAIK HT No. 420100957 | 681 G CHARAN AADITYA REDDY HT No. 420102102 | 745 MANTINA ROHITH HT No. 120609795 | 877 BANNURU TEJOVANTH REDDY HT No. 270204297 |
| 896 AGNIBHA ROY HT No. 460903353 | 904 A GIREESH CHANDRA HT No. 420113249 | 936 B ASHRITHA PRIYAMVADA HT No. 420132383 | 941 SARLANA AISHWARYA HT No. 120611786 | 942 RAVINDRA HT No. 390406037 | 963 SANGA RANI HT No. 420114648 | 982 PATNAM ROHITH HT No. 120304349 | 992 SAMAVEDAM SRAVYA HT No. 120602677 | స్థలాభావం వల్ల కొన్ని ర్యాంకులే ప్రకటించాము. |

NEET లాంగ్‌టర్మ్ క్లాసులు ప్రారంభం 19-06-2019
దగ్గరలోని నారాయణ బ్రాంచిని సంప్రదించండి
Dilsukhnagar Hostel - Mob : 81798 80277
Dilsukhnagar Day - Mob : 81798 85517
Madhapur Hostel - Mob : 81798 80049
Narayanaguda Day - Mob : 8179880789

SRAMAYEVA JAYATHE
నారాయణ మెడికల్ అకాడమి
www.narayanagroup.com

ఈ ప్రకటనలో ఏవైనా ముద్రణ దోషాలు ఉంటే సహృదయంతో మా దృష్టికి తీసుకురాగలరు

నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
/nt.zindagi
జిందగీ
గురువారం 6 జూన్ 2019 | కరీంనగర్



ఉద్యమ సమయంలో..
ఎత్తిన పిడికిళ్లకు.. ఎలుగెత్తిన నినాదాలకు..
మోగిన దండోరాలకు.. మొత్తుకున్న జంగ్ సైరన్‌లకు..
సకల జనులకు.. సకల సమ్మెలకు తోడుగా నిలిచి.. నీడగా వెలిసింది నమస్తే తెలంగాణ!
స్వపరి పాలనలో.. దూసుకొచ్చిన ప్రాజెక్టులకు.. దుంకిన నీళ్లకు..
నిండిన చెరువులకు.. పండిన పంటలకు..
సకల సంక్షేమానికి.. సమశీతోష్ణ తెలంగాణకు..
సస్యశ్యామల రాష్ట్రంగా పునర్నిర్మించేందుకు జోడెద్దుల బాధ్యత మోస్తున్నది!
ప్రజాశీర్వాదంతో ఎనిమిదేండ్లు పూర్తిచేసుకొని.. తొమ్మిదో వసంతంలోకి
అడుగిడుతున్న సందర్భంగా ఎందరో జిందగీలను మార్చిన 'జిందగీ'తో అనుబంధాన్ని
కొందరు పంచుకున్నారిలా!!

# ఎనిమిది దిక్కుల వసంతం

### సలామ్ జిందగీ..



ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించాలన్న నా కలకు నమస్తే తెలంగాణ తోడుగా నిలిచింది. ఎలాంటి స్పాన్సర్లు దొరక్క నేను ఆందోళనలో పడిపోతే 'జిందగీ'లో నా గురించి కథనాలు రాసి.. ప్రపంచానికి చాటిచెప్పింది. కిలిమంజారో, రుదుగైరా పర్వతాలు ఎక్కినప్పుడు రెండుసార్లు కథనాలు రాయడం నా అదృష్టం. ఎవరెస్ట్ ఎక్కాలనే నా కలకు ప్రోత్సాహాన్ని ఇచ్చిన నమస్తే తెలంగాణకు వార్షికోత్సవ శుభాకాంక్షలు. 'జిందగీ' ఫీచర్స్‌కు సలామ్.

– **ఆంగోత్ తుకారాం**, పర్వతారోహకుడు

### ఉద్యమ సోపతి..



ఎక్కడో మందమర్రి జోన్ పేజీలకు మాత్రమే పరిమితం అయిన నన్ను ఇవాళ రాష్ట్ర నలుమూలలా పరిచయం చేసి నా కళకు వెన్నుదన్నుగా నిలిచిన నమస్తే తెలంగాణకు వార్షికోత్సవ శుభాకాంక్షలు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో ధూమ్‌ధామ్ కార్యక్రమాలు నిర్వహించాం. వాటన్నింటినీ కవర్‌చేస్తూ నిత్యం మాకు తోడునీడగా ఉండేది. రాష్ట్రం వచ్చాక ఈవెంట్స్ చేస్తున్నప్పుడు పలు కథనాలు రాశారు. వేరే పత్రికలు మా గురించి పెద్దగా రాయకపోయేది. రాస్తే ఏదో మూలన జోన్ పేజీకి పరిమితం చేసేవారు. అలాంటిది 'జిందగీ'లో నా గురించి ప్రత్యేక కథనం రాయడం నేనెప్పటికీ మర్చిపోలేను.

**- మహేశ్ రేగుల,** కళాకారుడు

### చరిత్ర సృష్టించాలి ..



తెలంగాణ చరిత్ర చాలా గొప్పది. చరిత్ర విద్యార్థిగా.. అధ్యాపకుడిగా నేను నా నేపథ్యం గురించి.. మూలాల గురించి పరిశోధన చేస్తున్న సందర్భంలో నా గురించి మంచి కథనం రాసింది. అది సమస్త తెలంగాణ ప్రజలు నాకు ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నా. మన చరిత్రను ఇంకా గొప్పగా రాయాలని.. వెలికి తీయాలని ప్రోత్సహిస్తున్నది. ఇలాంటి ఎన్నో కథనాల ద్వారా చరిత్రను భావితరాలకు అందిస్తూ సరికొత్త చరిత్ర సృష్టించాలి.

**- తిరుపతి పోతరవేని,** చరిత్ర పరిశోధకుడు

### నా బాధ్యతను పెంచింది ..



ప్రతీ రోజు ఉదయం లేవగానే ముందుగా 'జిందగీ' చదువుతాను. తెలంగాణ అస్తత్వాన్ని ప్రతిబింబించే 'నమస్తే తెలంగాణ' పత్రికంటే నాకు చాలా ఇష్టం. ఇదివరకు నాకు వచ్చే జీతంలో సగం వరకు పేదల కోసం ఖర్చు చేసేవాడిని. 'జిందగీ'లో నా గురించి కథనం ప్రచురితమయ్యాక బాధ్యత పెరిగిందనిపించింది. ఓవర్ టైం డ్యూటీ చేసి మరీ ఇంకాస్త ఎక్కువ మొత్తంలో పేదల కోసం ఖర్చు చేస్తున్నా. నా సేవను అక్షరబద్ధం చేసిన జిందగీ టీంకు కృతజ్ఞతలు. నమస్తే తెలంగాణకు 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

**- గుమ్మడి కిరణ్ కుమార్,** కంటి వైద్య సహాయ నిపుణులు

### మంచి గుర్తింపు వచ్చింది..



నేను పారిశ్రామిక కాలుష్యాన్ని ఆరికట్టే సరికొత్త పరికరాన్ని కనుగొన్నా. దాని ద్వారా ఇండస్ట్రియల్ పొల్యూషన్ క్రమంగా తగ్గుతూ.. సున్నా లెవల్‌కు చేరుతుంది. నా ఆవిష్కరణపై నమస్తే తెలంగాణలో కథనం రాశారు. దాని ద్వారా నాకు చాలా గుర్తింపు వచ్చింది. నా ఆవిష్కరణకు ఎన్నో పరిశ్రమల నుంచి స్పందన వచ్చింది. ఇన్వెస్టర్లు నన్ను గుర్తించారు. మన రాష్ట్రంలో మంచి గుర్తించి తెచ్చింది నమస్తే తెలంగాణ. నాలాగే మరింత మందిని ప్రోత్సహించాలి.

**- ఎనమల శ్రీనివాస్,** ఇన్నోవేటర్

### చాలామందికి తెలిసింది!



'సాతీ' అనేది ఒక స్వచ్ఛంద సంస్థ. దీని ద్వారా మేం తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. మా పని ఎక్కువగా ప్రైవేట్ ఆస్పత్రులతోనే ఉంటుంది. ప్రతి మండల కేంద్రంలో సాతీ ప్రతినిధులున్నారు. ఫీల్డ్ కో-ఆర్డినేటర్ నుంచి పీఓ పైస్థాయి సిబ్బంది వరకూ అంతా విశేషంగా కృషి చేస్తున్నారు. మేము చేస్తున్న పని గురించి 'ఎయిడ్స్ డే' కథనం రావడం చాలా సంతోషంగా ఉంది. దానివల్ల మేం చేస్తున్న పని చాలామందికి తెలిసింది. మా సిబ్బందికి మంచి ప్రోత్సాహాన్ని ఇచ్చింది. ఇలా ఎన్నో స్వచ్ఛంద సంస్థల గురించి కథనాలు రాస్తున్న 'నమస్తే తెలంగాణ పత్రిక' మరిన్ని వసంతాలు పూర్తి చేసుకోవాలి

**- ఆంథోని రెడ్డి,** సాతీ మాజీ స్టేట్ డైరెక్టర్

### నా పోరాటానికి మద్దతునిచ్చింది!



నమస్తే తెలంగాణ 'జిందగీ'లో నా ఆర్టికల్ రావడం చాలా ఆనందంగా ఉంది. పర్యావరణ మార్పులపై నేను చేస్తున్న ఉద్యమానికి ఒక గొంతుకలా ఉపయోగపడింది. పర్యావరణంపై ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి నమస్తే తెలంగాణ మేలు చేసింది. చాలా మంది నాకు సాయంగా వచ్చారు. కేటీఆర్ సర్ నన్ను ప్రత్యేకంగా అభినందించారు. నా పోరాటానికి మద్దతుగా నిలిచిన నమస్తే తెలంగాణ పత్రిక మరిన్ని వసంతాలు పూర్తి చేసుకోవాలి.

**- ప్రత్యూష పరకాల,** పర్యావరణ ప్రేమికురాలు

### పబ్లిసిటీ కోరుకోలేదు!



నేను 1996 నుంచి పేదలకు పుస్తె, మట్టెలు పంపిణీ చేస్తున్నా. కానీ, నేనెప్పుడూ పబ్లిసిటీ కోరుకోలేదు. 'జిందగీ' ద్వారా నేను చేస్తున్న సేవ రాష్ట్రమంతటా తెలిసింది. 106 మందికి పుస్తె మట్టెలు అందిద్దామని ప్రారంభించిన రోజే నిర్ణయించుకున్నా. కానీ, జిందగీలో కథనం ప్రచురితమయ్యాక చాలామంది పేదలు తమకు సాయం చేయాలని నన్ను సంప్రదించారు. నా లక్ష్యం పూర్తయినా.. పేదల ఆనందం కోసం ఈ కార్యక్రమాన్ని కొనసాగిద్దామనుకుంటున్నా. నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు.

**- వొల్లాల వాణి,** ఆసిఫ్‌నగర్ (బావుపేట్)

### భాషతో సంతృప్తినిస్తున్నది..



మేం 'తోడూ నీడా' సంస్థని స్థాపించిన తర్వాత 'జిందగీ'లో కథనం పబ్లిష్ అయింది. ఆ తర్వాతే 'తోడూ నీడా' అంటే ఏంటో ప్రజలకు తెలిసింది. ఇది ఎన్నో ఎన్జీవోల కృషిలో పాలు పంచుకుంటుంది. ఆర్టికల్ వచ్చిన రోజు పేపర్ పట్టుకొని ఒక జంట మమ్మల్ని కలిశారు. ఆ జంట ఈ రోజు చాలా ఆనందంగా ఉన్నారు. దీనికి కారణం 'జిందగీ'. ఒంటరి మహిళలను ముందుకు నడిపిస్తున్నది 'జిందగీ'నే. ఎంతోమంది జీవితాలకు 'జిందగీ' పరోక్షంగా సహాయ పడుతున్నది. తెలంగాణ యాసలో రాస్తూ తెలుగు ప్రజలకు సంతృప్తినిస్తున్నది.

**- రాజేశ్వరి,** తోడూ నీడా సంస్థ వ్యవస్థాపకురాలు

### చాలా కాల్స్ వచ్చాయి..



అనారోగ్యంతో బాధపడుతున్న చాలామంది పేషంట్లకు సరైన అవగాహన లేదు. సెకండ్ ఒపీనియన్ కోసం నన్ను కలిసేవారు. కానీ, చాలామందికి తెలియదు. ఎలాంటి వ్యాధికైనా సరైన సెకండ్ ఒపీనియన్ ఇచ్చే సుమన్ సాయనిగా జిందగీ గుర్తింపునిచ్చింది. ఆర్టికల్ వచ్చిన తర్వాత తెలంగాణ నుంచి చెప్పలేనన్ని కాల్స్ వచ్చాయి. ఇంతమందికి సెకండ్ ఒపీనియన్ అవసరం ఉంది. వారికి విషయం తెలియజేసినందుకు 'జిందగీ'కి నా ధన్యవాదాలు.

**- సుమన్ సాయని,** హెల్త్ ఎక్స్‌పర్ట్

### నేనేంటో అందరికీ తెలిసింది ..



హైదరాబాద్‌లో స్టోరీ టెల్లర్ దీపాకిరణ్ అంటే చాలామందికి తెలియదు. ఇలా చెప్పేవాళ్లు కూడా ఉన్నారా? అనుకునేవారు. వాళ్లందరికీ జిందగీ జవాబు ఇచ్చింది. నా స్టోరీ 'జిందగీ'లో పబ్లిష్ అయ్యాక చాలామంది ఎస్ఎంఎస్‌లు చేశారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అయ్యారు. స్టోరీ టెల్లర్‌గా ఎన్నో దేశాలు తిరిగాను. అందరికంటే ఎక్కువగా తెలంగాణా ప్రజలు ఆదరిస్తున్నారు. పిల్లల కంటే పెద్దలే స్టోరీ వినడానికి వస్తున్నారు. తెలంగాణాలో ఎక్కడ ఈవెంట్ జరిగినా నన్ను పిలుస్తున్నారు. థాంక్యూ నమస్తే తెలంగాణ.

**- దీపా కిరణ్,** స్టోరీ టెల్లర్

### మరిన్ని రాయాలి ..



నేను పవర్ స్పోర్ట్స్ లైవ్ చానల్ స్థాపించిన కొన్ని రోజుల తర్వాత హైదరాబాద్ వచ్చాను. అప్పుడే 'జిందగీ' నా ఇంటర్వ్యూ ప్రచురించింది. నన్ను తెలుగు పాఠకులకు పరిచయం చేసిన మొదటి పత్రిక ఇది. సంతోషంగా ఉంది. మహిళా ఆధారిత సమస్యపై ఫోకస్ చేస్తూ, సమాజాభివృద్ధిలో 'జిందగీ' తనవంతు పాత్ర పోషిస్తుందనే అభిప్రాయం కలిగింది. ఇలాంటి ప్రచురణలు మరిన్ని రావాలని ఆశిస్తున్నాం. నమస్తే తెలంగాణకు 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

**- కాంతి డి. సురేశ్,** పవర్ స్పోర్ట్స్ చానెల్ ఫౌండర్, ఢిల్లీ

### ఆనందాన్ని కలిగించింది..



నేను ముంబైలో వీల్‌చైర్ సింగర్‌ను. హైదరాబాద్‌తో అనుబంధం ఉంది. నా గురించి తెలుసుకున్న జిందగీ టీమ్ నన్ను ఇంటర్వ్యూ చేసింది. ఆ ఆర్టికల్ నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. హైదరాబాద్‌లో ఉన్న బంధువులు, మిత్రులు చాలామంది అది చూసి నాకు శుభాంకాంక్షలు తెలిపారు. నా పాటల ప్రయాణాన్ని, విజయాన్ని చాలా స్ఫూర్తివంతంగా ప్రచురించారు. ఇది నాకు మరింత కీర్తిని తెచ్చిపెట్టింది. తెలుగులో మొదటిసారి నమస్తే తెలంగాణ నా గురించి ప్రచురించిందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. ఆ పత్రిక వార్షికోత్సవానికి నా శుభాకాంక్షలు.

**- రాధా రాయ్,** వీల్‌చైర్ సింగర్, ముంబై

### అనూహ్య స్పందన..



'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన నా ఇంటర్వ్యూ చూసి ప్రవాసభారతీయుల నుంచి ఫోన్లు వచ్చాయి. మహిళలకు అధికంగా ప్రాధాన్యమిస్తూ గొప్ప వ్యక్తుల గురించి తెలియజేస్తున్న 'జిందగీ' బృందానికి అభినందనలు. స్ఫూర్తివంతమైన కథనాలను ప్రచురించడం వల్ల ఇంటికే పరిమితమైన మహిళలు సైతం విజయాలను సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుంటున్నారు. నమస్తే తెలంగాణ పత్రికకు 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

**- డా.డివివి. శ్రీలక్ష్మీ వాణి,** వ్యాపారవేత్త

### జిందగీతోనే గుర్తింపు..



జిందగీలో 'అరుణయోగం' పేరుతో నా గురించి ఇచ్చిన ఇంటర్వ్యూ చదివి చాలా మంది ఫోన్‌లు చేశారు. నేను ఇప్పటి వరకూ సాధించిన విజయాలను గురించి రాయడం గొప్పగా అనిపించింది. ఎన్నో విషయాలను వివరంగా అందించారు. అరుణయోగం కథనం ద్వారా చాలామందికి నా గురించి పూర్తిగా తెలిసింది. మంచి మంచి కథనాలు అందిస్తున్న నమస్తే తెలంగాణ పత్రికకు శుభాకాంక్షలు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను అందుకోవాలని కోరుకుంటున్నా.

**-అరుణ,** యోగా గురువు

### చేరువ చేసింది..



నాలాంటి ఎంటర్‌ప్రెన్యూర్‌లకు నమస్తే తెలంగాణ మంచి అవకాశాలను ఇస్తున్నది. ఒకప్పుడు నా లాండ్రీకార్ట్ బిజినెస్ గురించి కొందరికే తెలిసింది. ఇప్పుడు ప్రతీ ఒక్కరికీ నేను చేరువయ్యానంటే కారణం జిందగీనే! నేననే కాదు.. ఈ పేజీ ద్వారా మరెందరినో వెలుగులోకి తెస్తున్నందుకు పత్రికకు ధన్యవాదాలు. నమస్తే తెలంగాణ యజమాన్యానికి వార్షికోత్సవ శుభాకాంక్షలు.

**- తబిత సుకుమార్**, లాండ్రీకార్ట్ వ్యవస్థాపకురాలు


### తెలంగాణ గొంతుక..



నమస్తే తెలంగాణకు హ్యాపీ యానివర్సరీ. తెలంగాణ బాధలను, బంధాలను తెలియచేయడానికి ఇదొక వారధి నా ఉద్దేశంలో. ఎన్నో మంచి కథనాలను రాస్తున్న జిందగీ టీమ్‌కి కూడా శుభాకాంక్షలు. మనసులను కదిలించే కథనాలు, స్ఫూర్తిని నింపే స్టోరీలతో జిందగీ బాగుంటున్నది. ఇలాగే వారి కథనాలు కొనసాగాలని మనస్ఫూర్తిగా భావిస్తున్నా.

**- సుమిత కందిమళ్ల,** ఇండస్ హెయిర్ ఎక్స్‌టెన్షన్

### గొప్పవాళ్లమని చెప్పింది..



చిన్నప్పుడు పేపర్లు చదువుతుంటే గొప్పవాళ్లంటే గోదావరి.. నెల్లూరు.. ప్రకాశం.. అనంతపురం వంటి జిల్లాల్లో మాత్రమే ఉంటారు అనుకునేవాడిని. వారి స్థాయికి మనం చేరుకోలేం అనే భావన ఉండేది. మనకోసం మన పత్రికగా నమస్తే తెలంగాణ వచ్చిన తర్వాత ఆ ఆలోచన పూర్తిగా మారిపోయింది. గొప్పవాళ్లు అంతటా ఉంటారు. వారి గురించి రాసే పత్రికలు లేకపోవడం వల్లే ఇలా జరిగింది అనిపించింది. 'జిందగీ'లో నా కథనం ప్రచురించడంతో ఇది నిరూపితం అయ్యింది.

**-గడగోజు సతీశ్,** ప్రభుత్వ ఉపాధ్యాయుడు

నమస్తే తెలంగాణ
జిందగి+
[ కరీంనగర్ ]
గురువారం 6 జూన్ 2019




# తియ్యని వేడుక!

నమస్తే తెలంగాణ..
ఎనిమిది వసంతాలు పూర్తి చేసుకొని..
తొమ్మిదో వసంతంలోకి అడుగు పెడుతున్నది.
ఈ సందర్భంగా మాకే కాదు..
మీరు తియ్యని వేడుక చేసుకోవాలని..
ఈ తీపి రుచులను మీకందిస్తున్నాం..
పోషక విలువలున్న ఈ స్వీట్స్‌ని ఆస్వాదించండి..

## ఖర్జూర్ హల్వా



**కావాల్సినవి :**
**ఖర్జూరం :** 250 గ్రా.,
**చక్కెర :** 100 గ్రా.,
**నెయ్యి :** 50 గ్రా.,
**కాజు :** ఒక టీస్పూన్,
**బాదం :** ఒక టీస్పూన్,
**పిస్తా :** ఒక టీస్పూన్

**తయారీ :**
ఖర్జూరం గింజలు లేకుండా చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. వీటిని మిక్సీలో వేసి కొద్దిగా నీళ్లు పోసి ముద్దలా గ్రైండ్ చేసుకోవాలి. కాజు, బాదం, పిస్తాలను సన్నగా కట్ చేసుకోవాలి. మందపాటి గిన్నెలో నెయ్యి వేసి వేడి చేయాలి. దీంట్లో గ్రైండ్ చేసుకున్న ఖర్జూరం వేసి కలుపుతూ వేయించాలి. ఖర్జూరం బాగా ఉడికిన తర్వాత చక్కెర పోసి దగ్గరగా అయ్యేంత వరకు కలుపుతుండాలి. తర్వాత స్టౌ మీద నుంచి దించేసి ఒక వెడల్పాటి ప్లేట్‌కి నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని పోయాలి. పై నుంచి బాదం, పిస్తా, కాజుల ముక్కలను వేసి గార్నిష్ చేసి నచ్చిన రీతిలో కట్ చేసుకొని ఎంచక్కా లాగించేయొచ్చు.

## రాగి లడ్డు

**కావాల్సినవి :**
**రాగులు :** 250 గ్రా.
**శొంఠి పొడి :** ఒక టీస్పూన్
**తర్బూజ గింజలు :** అర కప్పు
**బెల్లం :** 50 గ్రా.
**యాలకుల పొడి :** ఒక టీస్పూన్
**నెయ్యి :** 75 గ్రా.

**తయారీ :**
రాగులు దోరగా వేయించాలి. వీటిని కాసేపు చల్లారనిచ్చి.. ఆ తర్వాత దాన్ని పిండిలా గ్రైండ్ చేసుకోవాలి. కడాయిలో కొద్దిగా నెయ్యి వేసి తర్బూజా గింజలను దోరగా వేయించి పెట్టుకోవాలి. బెల్లం సన్నగా తురుముకోవాలి. ఒక గిన్నెలో రాగి పిండి వేసుకొని అందులో బెల్లం తురుము, యాలకుల పొడి, తర్బూజా గింజలు, శొంఠిపొడి వేసి బాగా కలుపుకోవాలి. దీంట్లో నెయ్యిని కొద్దిగా వేడి చేసి పోయాలి. ఇప్పుడు ఆ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. అంతే.. టేస్టీ లడ్డూలు రెడీ!




## ఊదల షీర్ కుర్మా



**కావాల్సినవి :**
**ఊదలు :** 150 గ్రా., **పేనీలు :** 100 గ్రా., **గసగసాలు :** 2 టీస్పూన్స్, **యాలకుల పొడి :** 2 టీస్పూన్స్, **కోవా :** 50 గ్రా., **చక్కెర :** 100 గ్రా., **పాలు :** ఒక లీటరు, **జీడిపప్పు :** అర కప్పు, **బాదం పప్పు :** అర కప్పు, **పిస్తా :** అర కప్పు, **కిస్మిస్ :** అర కప్పు, **క్రీమ్ :** అర కప్పు

**తయారీ :**
ఊదలు శుభ్రం చేసి బాగా కడిగి మూడు గంటలు నానబెట్టండి. గసగసాలను దోరగా వేయించాలి. జీడిపప్పు, బాదం పప్పు, పిస్తా, కిస్మిస్‌లను కూడా విడివిడిగా వేయించి పక్కన పెట్టుకోవాలి. మందపాటి గిన్నెలో పాలు పోసి మరిగించాలి. దీంట్లో ఊదలు వేసి ఉడికించాలి. తర్వాత కోవా, యాలకుల పొడి, గసగసాలు, జీడిపప్పు, బాదం పప్పు, పిస్తా, కిస్మిస్ వేసి దగ్గర అయ్యేవరకు ఉడికించాలి. ఇప్పుడు క్రీమ్, చక్కెర వేసి మరో పది నిమిషాలు సన్నని మంట మీద ఉంచాలి. దించేముందు పేనీలు వేసి కలిపి మూత పెట్టి ఐదు నిమిషాలు అలాగే వదిలేయాలి. వేడిగా లాగించేస్తే ఈ షీర్ కుర్మా చాలా బాగుంటుంది.



**జి.యాదగిరి**
కార్పొరేట్ చెఫ్
వివాహభోజనంబు రెస్టారెంట్
జూబ్లీహిల్స్, హైదరాబాద్
పార్క్‌లైన్, సికింద్రాబాద్

## సామల ఖీర్

**కావాల్సినవి :**
**సామలు :** 200 గ్రా., **నెయ్యి :** 50 గ్రా., **పాలు :** 750 మి.లీ., **పిస్తాపప్పు :** 2 టీస్పూన్స్, **చక్కెర :** ఒక కప్పు, **జీడిపప్పు :** అర కప్పు, **కిస్మిస్ :** అర కప్పు, **బాదం పప్పు :** 2 టీస్పూన్స్

**తయారీ :**
సామలు శుభ్రం చేసి బాగా కడిగి మూడు నుంచి నాలుగు గంటల పాటు నానబెట్టాలి. జీడిపప్పు, బాదం పప్పు, పిస్తా, కిస్మిస్‌లను దోరగా నెయ్యిలో వేసి వేయించాలి. గిన్నెలో నెయ్యి వేసి వేడి చేయాలి. ముందుగా నానబెట్టిన సామలను నీళ్లు లేకుండా నెయ్యిలో వేసి దోరగా వేయించి పక్కన పెట్టాలి. మరో గిన్నెలో పాలు పోసి వేడి చేయాలి. బాగా మరిగిన తర్వాత సామలు వేసి ఉడికించాలి. కచ్చితంగా మధ్య మధ్యలో కలుపుతుండాలి. సామలు ఉడికి తర్వాత చక్కెర వేసి మరో ఐదు నిమిషాలు ఉంచాలి. చివరగా వేయించిన డ్రై ఫ్రూట్స్ వేసి గార్నిష్ చేయాలి. వేడిగా సర్వ్ చేస్తే చాలా టేస్టీగా ఉంటుంది.



## ట్వీట్





జర్మనీలో మంచి సమయాన్ని నా కుటుంబంతో గడిపాను. ఇక ఇటలీకి మా ప్రయాణం కొనసాగనున్నది.

**మహేష్ బాబు**
@urstrulyMahesh

మహేష్‌బాబును ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
190,789

## కామన్‌మ్యాన్ వాయిస్

ఇంజి'నీరు'గారి పోతున్న విద్య చూడు..
సాఫ్ట్ 'వేరైపోతున్న' తీరు చూడు..
విలువలే లేని విద్యలకు..
ధనం విలువ కట్టలేం చూడు..
– Juned Ahamad

నిన్ను నువ్వు ప్రేమించడం నేర్చుకో..
అప్పుడు లోకమంతా అందంగానే కనిపిస్తుంది!
– Raju Athikam

నేటి సమాజానికి అసలైన రూపం లేదు..
జరుగుతున్న వాస్తవాలకు అసలేంటో తెలియదు..
మెరుగు పడుతున్న వాస్తవికతకు సరైన మార్గం లేదు..
ఆ మార్గం నీవైనప్పుడే.. వాస్తవాల అసలు రూపం సమాజానికి తెలుస్తుంది.
– Reshwanth Panduga

## వైరల్ వీడియో



**బయోపిక్‌ల కాలం నడుస్తున్నది. భారతదేశంలో జీనియస్ మ్యాథమెటీషియన్ అయిన ఆనంద్ కుమార్ జీవిత చరిత్రను సూపర్ 30 పేరుతో సినిమాగా తీశారు. హృతిక్ ఆ పాత్రలో ఒదిగిపోయాడు. దీని ట్రైలర్ ఇప్పుడు ట్రెండింగ్ లిస్ట్‌లో టాప్ వన్‌గా ఉంది.**

Super 30 | Official Trailer | Hrithik Roshan | Vikas Bahl | July 12
Total views : 22,333,296+
Published on 4 Jun 2019

## సుడోకు

డైలీ సుడోకు 54 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 9 | 5 | 7 | 4 | 1 | 8 | 3 | 6 |
| 8 | 7 | 4 | 3 | 2 | 6 | 1 | 5 | 9 |
| 1 | 6 | 3 | 9 | 5 | 8 | 7 | 2 | 4 |
| 4 | 2 | 7 | 1 | 8 | 3 | 9 | 6 | 5 |
| 9 | 3 | 1 | 4 | 6 | 5 | 2 | 7 | 8 |
| 5 | 8 | 6 | 2 | 9 | 7 | 3 | 4 | 1 |
| 3 | 5 | 2 | 8 | 1 | 4 | 6 | 9 | 7 |
| 6 | 1 | 9 | 5 | 7 | 2 | 4 | 8 | 3 |
| 7 | 4 | 8 | 6 | 3 | 9 | 5 | 1 | 2 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -55

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | | | 4 | | | | 2 | |
| | | | | | 5 | 8 | | 7 |
| | | 7 | 9 | | | 1 | | 6 |
| | | | | | 9 | | | |
| 4 | | | 8 | | 1 | | | 2 |
| | | | 5 | | | | | |
| 1 | | 5 | | | 7 | 2 | | |
| 9 | | 8 | 6 | | | | | |
| | 6 | | | | 2 | | | 8 |

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## వరంగల్ నిట్‌లో 135 ఖాళీలు

**వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**




- **మొత్తం ఖాళీలు:** 135
- **పోస్టులు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, గ్రేడ్-1 అసిస్టెంట్ ప్రొఫెసర్, గ్రేడ్-2 అసిస్టెంట్ ప్రొఫెసర్ (6వ సీపీసీలో ఏజీపీ-7,000), గ్రేడ్-2 అసిస్టెంట్ ప్రొఫెసర్ (6వ సీపీసీలో ఏజీపీ-6,000)
- **విభాగాల వారీగా ఖాళీలు:** సివిల్ ఇంజినీరింగ్-18, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్-11, మెకానికల్-16, ఈసీఈ-14, మెటలర్జికల్ & మెటీరియల్స్ ఇంజినీరింగ్-8, కెమికల్ ఇంజినీరింగ్-10, కంప్యూటర్ సైన్స్&ఇంజినీరింగ్-25, బయోటెక్నాలజీ-10, మ్యాథమెటిక్స్-8, ఫిజిక్స్-5, కెమిస్ట్రీ-3, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్-4, హ్యుమానిటీస్&సోషల్ సైన్సెస్-2, ట్రెయినింగ్&ప్లేస్‌మెంట్-1 పోస్టు ఉన్నాయి.
- **అర్హతలు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు కనీస అర్హత ప్రథమశ్రేణిలో బీఈ/బీటెక్, ఎంటెక్/ఎంఈతోపాటు సంబంధిత బ్రాంచీలో పీహెచ్‌డీ ఉండాలి. ఆయా పోస్టును బట్టి అనుభవం తదితరాలను పరిగణనలోకి తీసుకుంటారు. మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ తదితర సబ్జెక్టులకు ప్రథమశ్రేణిలో బీఏ/బీఎస్సీ/బీకాంతోపాటు ప్రథమశ్రేణిలో సంబంధిత సబ్జెక్టులో పీజీ, పీహెచ్‌డీ చేసి ఉండాలి.
- **జీతభత్యాలు:** ప్రొఫెసర్-రూ. 1,59,100, అసోసియేట్ ప్రొఫెసర్-రూ. 1,39,600, గ్రేడ్-1 అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ. 1,01,500/-, గ్రేడ్-2 అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఏజీపీ 7000)-రూ. 73,000/-, గ్రేడ్-2 అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఏజీపీ 6,000)- రూ. 70,900/-
- **నోట్:** 2/2018 నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్నవారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. అయితే వారు తమ సమాచారాన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌డేట్ చేసుకోవాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 5
- **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** జూలై 5
- **వెబ్‌సైట్:** https://www.nitw.ac.in

## బీడిజైన్‌లో ప్రవేశాలు

**ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ (డీటీయూ) బీడిజైన్ కోర్సులో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.**



- **పోస్టు:** బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్ (బీడిజైన్) (నాలుగేండ్లు)
- **అర్హత:** ఇంటర్ (సైన్స్, కామర్స్, ఆర్ట్స్&హ్యుమానిటీస్) ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో జూన్ 8 నుంచి
- **చివరితేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** www.dtu.ac.in

## బెల్‌లో కాంట్రాక్టు ఇంజినీర్లు

**భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్)లో కాంట్రాక్టు ఇంజినీర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**



- **పోస్టు:** కాంట్రాక్టు ఇంజినీర్
- మొత్తం ఖాళీలు-19
- విభాగాల వారీగా ఖాళీలు అర్హతలు:
- సివిల్-12, ఎలక్ట్రికల్-6, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్-1
- **అర్హతలు:** బీఈ/బీటెక్‌లో సంబంధిత బ్రాంచీలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలు అయితే ఉత్తీర్ణులు అయితే సరిపోతుంది.
- **అనుభవం:** 2019, జూన్ 1 నాటికి కనీస అనుభవం ఏడాది ఉండాలి.
- **పనిచేయాల్సిన ప్రదేశం:** బెంగళూరు, కొచ్చి, గోవా, అరక్కోణం, వైజాగ్, ముంబై, పోర్ట్‌బ్లెయిర్.
- **వయస్సు:** 2019, జూన్ 1 నాటికి 26 ఏండ్లు మించరాదు. ఓబీసీలకు మూడేండ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **జీతం:** నెలకు రూ.23,000/-
- కాంట్రాక్టు కాలవ్యవధి: ఏడాది. అవసరాన్ని బట్టి మరికొంత కాలం పెంచవచ్చు.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ (జూన్ 15)
- **రాతపరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించే ప్రదేశం:** బెల్, సెంటర్ ఫర్ లెర్నింగ్&డెవలప్‌మెంట్, జలహళ్లి (ఈస్ట్), బెంగళూరు.
- **వెబ్‌సైట్:** http://www.bel-india.in

## ఎన్‌ఐటీఐఈలో ఫ్యాకల్టీలు

**ముంబైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ (ఎన్‌ఐటీఐఈ)లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్
- **విభాగాలు:** ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్, మ్యానుఫ్యాక్చరింగ్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ అండ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అకౌంటింగ్&ఫైనాన్స్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హెచ్‌ఆర్ మేనేజ్‌మెంట్.
- అర్హతలు, ఎంపిక, జీతభత్యాలు తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **వెబ్‌సైట్:** www.nitie.ac.in

## ఆర్‌ఐఈలో ఇంటర్వ్యూలు

**మైసూర్‌లోని రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్‌ఐఈ)లో ఫ్యాకల్టీ, ల్యాబ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**



**పోస్టులు:**
- **ప్రొఫెసర్:** ఫిజిక్స్-1, కెమిస్ట్రీ-1
- **అసిస్టెంట్ ప్రొఫెసర్:** ఫిజిక్స్-3, మ్యాథ్స్-2, కెమిస్ట్రీ-3, బాటనీ-1, పెడగాగీ ఆఫ్ ఇంగ్లిష్-1, పెడగాగీ ఆఫ్ మ్యాథ్స్-1, కౌన్సెలింగ్ సైకాలజీ/స్పెషల్ ఎడ్యుకేషన్-1, సైన్స్-2, హెల్త్/ఫిజికల్ ఎడ్యుకేషన్-1, ఇంగ్లిష్-2, జాగ్రఫీ-1, హిస్టరీ-1 ఉన్నాయి.
- డబ్ల్యూఈటీ కంప్యూటర్ సైన్స్-1, ప్రొఫెషనల్ అసిస్టెంట్ (లైబ్రేరీ)-1, ల్యాబొరేటరీ అసిస్టెంట్ (ఫిజిక్స్-1, బాటనీ-1, సైకాలజీ-1) ఉన్నాయి.
- **ఎంపిక:** జూన్ 13 నుంచి 15 మధ్య నిర్వహించే ఇంటర్వ్యూల ఆధారంగా
- అర్హతలు, వయస్సు, జీతభత్యాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **వెబ్‌సైట్:** www.riemysore.ac.in

III.
నమస్తే తెలంగాణ
# రైతుబడి
[ కరీంనగర్ ]
గురువారం 6 జూన్ 2019
raithubadi@ntnews.com







త్రీడీ టెక్నాలజీ ల్యూర్‌తో
# లింగాకర్షక బుట్టలు

కత్తెర పురుగు, పత్తిలో గులాబీరంగు పురుగు, టమాటాలో పిన్ వాం వంటి పురుగులు కొత్తగా పంటల్లో విపరీతమైన నష్టాన్ని కలుగజేస్తున్నాయి. రైతులు ఇప్పటికే ఆయా పురుగుల ఉధృతిని అంచనా వేయడానికి, అరికట్టడానికి లింగాకర్షక బుట్టలు వాడుతున్నారు. అయితే వీటిలో వాడే 'ల్యూర్' సామర్థ్యంతో 15-20 రోజుల కంటే ఎక్కువగా పురుగులను ఆకర్షించలేవు. ఈ నేపథ్యంలో 'నానో త్రీడీ ల్యూర్'లు సాధారణ ల్యూర్‌లతో పోలిస్తే మూడింతలు ఎక్కువ కాలం పనిచేస్తాయి. కాబట్టి పురుగుల ఉధృతిని, నష్టాన్ని సమర్థవంతంగా అరికట్టవచ్చు.

**ఇది పనిచేసే విధానం:**
రసాయనాలు టాబ్లెట్ రూపంలో ఉంటుంది. ఈ మాత్రలలో రసాయనం పౌడర్ రూపంలో మూడు పొరలుగా ఉంటుంది. ఒక్కొక్క పొరపై ప్రత్యేక రక్షణ కవచం ఉంటుంది. ఈ రక్షక కవచం గాలితో చర్యలోకి వచ్చినప్పుడు ఆక్సీకరణ చెందుతుంది. అప్పటివరకు ఆక్సీకరణ ఉండదు. మొదట ల్యూర్ మాత్రలను లింగాకర్షక బుట్టలో పెట్టినప్పుడు పౌడర్ నుంచి మూడు పొరలలో చివరి పొర పనిచేయడం మొదలవుతుంది. మొదటి పొర కొంతకాలం పనిచేసిన తర్వాతనే, రెండవ పొర (చివరి నుంచి) పనిచేస్తుంది. రెండవ పొర పూర్తిగా అయిపోయిన తర్వాత, మూడవ పొర రక్షణ కవచం గాలితో చర్య చెంది, ఆక్సీకరణ చెందుతుంది. ఈ టెక్నాలజీలో ల్యూర్‌లోని ఫిరమోన్ మూడు దశలలో విడుదలై ఎక్కువ కాలం పురుగులను ఆకర్షిస్తుంది. ఈ విధంగా మిగతా సాధారణ ల్యూర్‌లలో కాకుండా, ఈ నానో త్రీడీ ల్యూర్ నుంచి ఫిరమోన్ ఏక కాలంలో విడుదల కాదు. బదులుగా ఒక పొర తర్వాత మరో పొర నుంచి విడుదలవుతూ ఎక్కువ కాలం ఇంకా సమర్థవంతంగా పనిచేస్తుంది.



వంకాయలో కొమ్మ కాయ తొలుచు పురుగు, పత్తిలో గులాబీ రంగు పురుగు, పంట వేసిన 30 రోజుల నుంచి వీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. అయితే ఈ పురుగుల సంఖ్యను గమనించడానికి సాధారణ ల్యూర్ వాడినప్పుడు ప్రతి 20 రోజులకు ఒకసారి ల్యూర్‌లు మార్చాల్సి వచ్చేది. దీంతో కూలీల ఖర్చు పెరుగడంతో పాటు, నిరంతర నిఘా సాధ్య మయ్యేది కాదు. బ్రెజిల్ నుంచి దిగుమతి చేసుకున్న నానో త్రీడీ ల్యూర్‌లతో 60నుంచి 70 రోజుల పాటు నిరంతరంగా ఈ పురుగుల ఉధృతిని గమనించాం. తద్వారా సకాలంలో వివి ధ పద్ధతుల వాటిని నిర్మూలించి పంటను కాపాడుకున్నాం. దీనికి సంబంధించి మరింత సమాచారం కోసం ఈ నెంబర్‌లో సంప్రదించవచ్చు.

**-వెలాది పురుషోత్తం రావు,**
రైతు, 7207501515

### సాధారణ ల్యూర్‌లు, నానో త్రీడీ ల్యూర్‌ల మధ్య వ్యత్యాసం

| సాధారణ ల్యూర్ | నానో త్రీడీ ల్యూర్ |
|---|---|
| రబ్బర్ కార్క్ లేదా చెక్క ముక్క ద్రవ్య ఫార్మలేషన్ ముంచుతారు. | త్రీడీ మాత్రలలో పొడి రూపంలో ల్యూర్ ఫిరమోన్ అమర్చబడి ఉంటుంది. |
| కార్క్ లేదా చెక్క ముక్కపై ఫిరమోన్ పదార్థంపై నియంత్రణ ఉండదు. | ఔషధ పరిశ్రమలో వాడినట్లు ముందస్తుగా నిర్ణయించిన మోతాదులో ఫిరమోన్‌ను మూడు పొరలలో సమంగా నింపి తయారుచేస్తారు. |
| దఫాలుగా ఫిరమోన్ విడుదల ఉండదు. | ఫిరమోన్ మూడు పొరలలో రక్షించబడుతుంది. మూడు దశలలో సమపాళ్లలో విడుదల అవుతుంది. |
| ఫిరమోన్ మొత్తం ల్యూర్ నుంచి ఒకేసారి విడుదలవుతుంది. ఒకేసారి పూర్తవుతుంది. | ఫిరమోన్ మూడు దశలలో ఒక పొర తర్వాత మరో పొర పనిచేస్తుంది. కాబట్టి ఇది సాధారణ ల్యూర్‌ల కంటే మూడింతలు సమర్థవంతంగా పనిచేస్తుంది. |

**ఆసరి రాజు**

హైడ్రోఫోనిక్స్ విధానంతో
# పంటల సాగు

మట్టితో అవసరం లేకుండా నీళ్లతోనే మొక్కల్ని పెంచడాన్ని హైడ్రోఫోనిక్స్ అంటారు. మామూలుగా వ్యవసాయం చేయడానికి నేల, నీళ్లు కావాలి. వాతావరణం పంటలకు అనుకూలంగా ఉండాలి. కానీ హైడ్రోఫోనిక్స్ ద్వారా నేల అవసరం లేకుండా వాతావరణంపై పూర్తిగా ఆధారపడకుండా ఎప్పుడైనా, ఎక్కడైనా పంటలు పండించవచ్చు.

### హైడ్రోఫోనిక్స్‌లో మొక్కలు పెంచే విధానం
ప్రకృతి మీద ఆధారపడకుండా ఉన్న స్థలంలో మొక్కలకు కావాల్సిన పోషకాలు నీళ్ల ద్వారా అందించడానికి నిలువుగా, అడ్డంగా నీటి గొట్టాల్ని ఒక వరుసపైన మరొకటి అమరుస్తారు. వాటికి రంధ్రాలు చేసి పేపర్ టీ కప్పుల్లాంటి జాలి కప్పులను పెడుతారు. అందులో మొక్కలను నాటే ముందు మొక్కలు స్థిరంగా ఉండటానికి బంకమట్టితో చేసిన చిన్న గుండ్రని బాల్స్‌ను వేస్తారు. మొక్క వేళ్లు జాలిలో నుంచి పైపులోకి పోతాయి. ఆ పైపులో మొక్కకు అవసరమైన పోషకాలు కలిపిన నీరు నిరంతరంగా నెమ్మదిగా ప్రవహిస్తుంది. ఈ నీరు మొత్తం పైపు అంతా ప్రవహించి తిరిగి ట్యాంకులోకి చేరుతుంది. మళ్లీ అవే నీళ్లు పైపుల్లోకి వెళ్లేలా ఏర్పాటు చేస్తారు. ఇలా చేయడం ద్వారా నీరు వృథా కాదు. ఈవిధానంలో మొక్కలను పెంచడం వల్ల భూమిలోకి చొచ్చుకొని పోయి నీటిని, పోషకాలను వెతుక్కోవాల్సిన పని ఉండదు. కాబట్టి మట్టిలో పెరిగినట్టు ఈ మొక్కల వేర్లు పెద్దగా పెరుగవు. కాబట్టి పోషకాలు పూర్తిగా మొక్క పైభాగం పెరుగుదలకు ఉపయోగపడుతుంది. పంట కాలాన్ని బట్టి, వాతవరణాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. అవసరమైతే ఎండ ఎక్కువ పడకుండా నీడను ఏర్పాటు చేస్తారు. ఎండ పడని ప్రదేశమైతే వెలుతురు కోసం ఎల్ఈడీ లైట్లను అమరుస్తారు.



### ఈ విధానంలో ఏ పంటలు పండించవచ్చు

**స్ట్రాబెర్రీ:** ఈ విధానంలో ఇప్పటికే చాలామంది రైతులు స్ట్రాబెర్రీ పంటను ఎక్కువ విస్తీర్ణంలో పండించి మంచి దిగుబడులు సాధిస్తున్నారు. నేల, సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా ఈ పంటను సాగుచేసుకోవచ్చు.
**కాలే (kale) పంట:** ఇది ఒక ఆకుకూర లాంటిది. దీని పెరుగుదలకు సూర్యరశ్మి ఎక్కువగా అవసరం లేదు. ఈ విధానంలో ఈ పంట సాగు చేయడం వల్ల అధిక పోషక విలువలు కలిగిన మంచి దిగుబడి వస్తుంది. అలాగే మార్కెట్ ధరను పొందవచ్చు.
**పాలకూర:** ఈ విధానంలో ఈ పంట సాగు చేయడం వల్ల అనుకూల పరిస్థితుల్లో సుమారు 12 వారాల వరకు వరుసగా ఆకులను కోసి మార్కెట్‌లోకి పంపించవచ్చు. ఈ పంటను ఈ విధానంలో ఇంటిపైన ఖాళీ స్థలంలోనూ పండించుకోవచ్చు.
**టమాటా:** ఈ విధానంలో కృత్రిమ ఉష్ణోగ్రత, వెలుతురు ఉన్న పరికరాలను వాడుకొని అధిక దిగుబడి సాధించవచ్చు.
**దోసజాతి :** తీగజాతి కూరగాయలు కూడా హరితగృహాల్లో కావల్సిన వాతావరణం కల్పించి ఈ విధానంలో పండించవచ్చు. ఇవే కాకుండా టమాటా, మిరప వంటి ఇతర కూరగాయలను కూడా పండించవచ్చు.

**మొక్కలను పెంచడానికి కావాల్సిన ముఖ్య పరికరాలు: ఈసీ మోటర్, పీహెచ్ మీటర్, లిట్మస్ పేపర్**

**పోషక ద్రావణం తయారీ**
సరైన పోషక ద్రావణాన్ని వాడాలి. అంటే తగిన మోతాదులో స్థూల, సూక్ష్మ పోషకాలను కలిగి ఉండాలి. సాధారణంగా పోషక ద్రావణం గాఢత 1000 నుంచి 2500 పీపీఎం వరకు ఉండే విధంగా చూసుకోవాలి. పోషక పదార్థాల ద్రావణాన్ని పంటకు అనుగుణంగా తయారుచేసుకుని వాడుకోవాలి.

**ఈ విధానంలో వాతావరణ పరిస్థితుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు**
**ఉష్ణోగ్రత:** కొన్ని రకాల పంటలకు చలికాలంలో ఉష్ణం, ఎండాకాలంలో చల్లని వాతావరణాన్ని కల్పించాలి. దీనివల్ల మంచి దిగుబడులు సాధించవచ్చు. అయినప్పటికీ సుమారుగా 65-75 డిగ్రీల ఫారన్‌హీట్ ఉష్ణోగ్రత ఉండేలా జాగ్రత్తలు పాటించాలి. దీనివల్ల మొక్క ఆరోగ్యంగా ఉంటుంది. పెరుగుదల బాగుంటుంది.
**ఆర్ద్రత:** ఈ విధానంలో ఆర్ద్రత 40-80 శాతం ఉండేలా చూసుకోవాలి. గాలిలో తేమ శాతం ఎక్కువ ఉండటం వల్ల చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. 'హైడ్రో మీటర్' అనే పరికరాన్ని ఉపయోగించి ఆర్ద్రతను సమతుల్యం చేయవచ్చు.
**గాలి ప్రసరణ:** మొక్కల నుంచి వెలువడే కార్బన్ డై ఆక్సైడ్‌ను 'ఎగ్జాస్ట్ ఫ్యాన్' అనే పరికరాన్ని వాడుకొని వేడి గాలిని బైటికి పంపి చల్లగాలిని లోపలికి పంపించాలి. దీనివల్ల మొక్కలకు కావాల్సిన ఆక్సిజన్ అందించవచ్చు.
**వెలుతురు:** పండించే స్థలంలో చీకటి స్థలం ఉన్నట్లయితే మార్కెట్‌లో దొరికే అధిక సాంద్రత లైట్ వాడుకొని వెలుతురును సమతుల్యం చేయాలి.

**ఈ విధానంలో ఎదురయ్యే నష్టాలు**
- సంప్రదాయ సాగు విధానం కంటే ఈ పద్ధతిలో తగినంత అనుభవం, శాస్త్రీయ పరిజ్ఞానం కావాలి.
- దీనిలో ఫలితాలు వెంటనే రాకపోవచ్చు. కాబట్టి ఓపికతో చేయాలి.
- ఈ విధానంలో సాగు చేసిన కూరగాయలు, పండ్లు సేంద్రియమా? కాదా? అనే ప్రశ్న ఇంకా ప్రజల్లో కొనసాగుతున్నది.
- ఈ విధానంలో ఎలక్ట్రిసిటీ అవసరం ఎక్కువ. కాబట్టి మధ్యలో కరెంట్‌లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలి.
- ఇది పూర్తిగా సాంకేతిక పద్ధతి. కాబట్టి దీన్ని అమర్చుకోవడానికి ముందుగా అయ్యే ఖర్చు కొంచెం ఎక్కువ.
- దీనిలో చీడపీడల బెడద తక్కువ. అయినప్పటికీ ఒకసారి ఏదైనా ఆశిస్తే వాటి వ్యాప్తి తొందరగా ఉంటుంది.
- కొన్నిసార్లు రైతు పెట్టిన ఖర్చుతో పోలిస్తే వచ్చే నికర ఆదాయం తక్కువగా ఉండవచ్చు. అయితే నష్టాలతో పోలిస్తే లాభాలే ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి సరైన అనుభవంతో సాగు చేయాలి. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు.

### హైడ్రోఫోనిక్స్ సాగు వల్ల దిగుబడిలో వ్యత్యాసం

| పంటలు | నేలలో సాగు | నీటిలో సాగు |
|---|---|---|
| టమాటా | 5-10 టన్నులు | 60-30 టన్నులు |
| బీన్స్ | 5 ,, | 21 ,, |
| బఠానీ | 1 ,, | 9 ,, |
| బీట్‌రూట్ | 4 ,, | 12 ,, |
| ఆలు | 8 ,, | 70 ,, |
| క్యాబేజీ | 6 ,, | 9 ,, |

### ఈ విధానం వల్ల కలిగే లాభాలు
- మొదటగా పంటకు కావాల్సిన నేలతో దీనికి సంబంధం ఉండదు.
- తక్కువ స్థలంలో, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు.
- హరితగృహంలో లాగా హైడ్రోఫోనిక్స్ విధానంలోనూ వాతావరణ పరిస్థితులను కావల్సిన విధంగా మార్చుకోవచ్చు.
- మనం సాంప్రదాయ పద్ధతిలో సాగు చేసుకునే నీటిలో పది శాతం నీటిని వాడుకొని నీటి వృథాను అరికట్టవచ్చు.
- మొక్కలకు కావాల్సిన ఎరువులను, పోషకాలను ద్రావణం రూపంలో అందించడం వల్ల వాటి పోషక విలువ పెరుగుతుంది. అనవసర ఖర్చులు తగ్గుతాయి.
- సాధారణంగా నేలలో పెరిగే మొక్కలతో పోలిస్తే ఈ విధానంలో పెరిగే మొక్క పెరుగుదల రేటు ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే వాతావరణ సమతుల్యత ఉంటుంది కాబట్టి మొక్క ఆరోగ్యంగా ఉంటుంది.
- కలుపు మొక్కలు, చీడపీడలు, తెగుళ్ల బెడద చాలా తక్కువగా ఉంటుంది.
- తక్కువ మోతాదులో పురుగు మందులు వాడటంతో కలుషితం లేని సాగు చేయవచ్చు.
- ఉదజని సూచిక స్థాయి నేల సాగులో కంటే నీటి సాగులో మనకు కావాల్సినంత నిర్వహించుకోవచ్చు. దీనితోపాటు కూలీల అవసరం కూడా తక్కువ.

**-సూరం సింధూజ,** అసిస్టెంట్ ప్రొఫెసర్
**-ఎ. నిర్మల,** అసిస్టెంట్ ప్రొఫెసర్
ఉద్యాన కళాశాల, రాజేంద్రనగర్

# సాగుకు సన్నద్ధమవుదాం ఇట్లా..





రైతుల ఆలోచన ఎప్పుడూ సాగు చేసిన పంటల్లో మంచి దిగుబడులు సాధించడమే. దీనికోసం రైతు విత్తనాలు నాటేందుకు దుక్కిదున్నే నాటి నుంచి పంట చేతి అందే సమయం వరకు నిరంతరంగా కష్టపడుతూనే ఉంటాడు. అయితే అలా కష్టపడటమే కాకుండా ఏ పంటను సాగు చేసినా దానిలో ప్రారంభం నుంచే అనువైన పద్ధతులను అవలంబించడం వల్ల మంచి దిగుబడులు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. తొలకరి వానలు కురిసిన తర్వాత వ్యవసాయ పనులు ప్రారంభంలో రైతులు ఆచరించాల్సిన విధానాలను గురించి వారు తెలిపిన వివరాలు..

**భూసార పరీక్షలు:** పంటల సాగులో మంచి ఫలితాలను సాధించాలంటే తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలి. దీనిద్వారా రైతులు తమ భూమిలోని పోషక పదార్థాల స్థాయిని తెలుసుకుని తద్వారా పంటలకు వాడాల్సిన మందుల మోతాదులను నిర్ణయించుకోవచ్చు. దీంతో రసాయన ఎరువులకు అయ్యే ఖర్చు తగ్గుతుంది. భూసార పరీక్షలు పోషకాల సమతుల్యతను పాటించడానికి రసాయన ఎరువుల సక్రమ వినియోగానికి ఎంతో దోహదం చేస్తాయి.

### భూసార కేంద్రం నుంచి లభించే సలహాలు:
- భూసారాన్ని నిర్ధారించి రైతు వేయాల్సిన పంటలకు నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువుల మోతాదును నిర్ణయించడం.
- సాగుకు అనుకూలంగాలేని ఆమ్ల భూములు, చౌడు భూముల్లో చాలా తక్కువ దిగుబడి వస్తుంది. కాబట్టి వాటిని గుర్తించి బాగు చేసుకునే విధానాలు, ఇతర యాజమాన్య పద్ధతులు పాటించడం.
- ఎంపిక చేసిన మట్టి నమూనాల్లో సూక్ష్మపోషకాల విశ్లేషణ చేసి సలహాలు ఇస్తారు.

### మట్టి నమూనా సేకరించే విధానం
- పొలమంతా ఒకే రకంగా ఉన్నప్పుడు ఐదు ఎకరాల విస్తీర్ణానికి ఒక నమూనా చొప్పున తీస్తే సరిపోతుంది. ఒక మట్టి నమూనా తీయదల్చిన పొలంలో 10-12 చోట్ల మట్టిని సేకరించాలి.
- మట్టి నమూనా తీసేచోట నేలపై ఉన్న చెత్త, గడ్డి, కలుపు మొక్కలు తీసివేయాలి.
- పార ఉపయోగించి 'v' ఆకారంలో 6-8 అంగుళాలు(15 సెంటీ మీటర్లు) పై నుంచి దిగువ వరకు ఒకే మందంలో పలుచటి పొర వచ్చే విధంగా మట్టిని తీయాలి. ఇలా అన్నిచోట్ల తీసిన మట్టిని గోనె పట్టా లేదా పాలిథీన్ షీట్ లేదా గుడ్డ మీద వేసి మట్టి గడ్డలను చిదిపి బాగా కలిపి చతురస్రాకారంగా పరిచి నాలుగు సమభాగాలుగా విభజించాలి. ఎదురెదురుగా ఉన్న భాగాలను తీసుకుని మిగిలిన మట్టిని తీసివేయాలి. ఈ విధంగా అరకిలో మట్టి మిగిలే వరకు చేయాలి.
- నమూనాను శుభ్రమైన గుడ్డ సంచిలో లేదా ప్లాస్టిక్ సంచిలో నింపాలి. సంచి లోపల రైతు పేరు, తండ్రి పేరు, గ్రామం, సర్వే నెంబర్, వేయదలచిన పంట వివరాలతో కూడిన సమాచారాన్ని తెలియజేస్తూ మట్టి నమూనాను భూసార కేంద్రానికి పంపాలి.

### వేసవి దుక్కులు లాభాలు:
- భూమి గుళ్ళబారి నీటిని బాగా పీల్చుకుంటుంది.
- నేలపై ఉన్న సారవంతమైన పొర వర్షపు నీటికి కొట్టుకపోదు
- కలుపు మొక్కల పెరుగుదల తక్కువగా ఉంటుంది. క్రిమికీటకాల బెడద తక్కువగా ఉంటుంది.
- భూమిలో తేమ తొందరగా ఆరిపోదు.
- నిండు పదునులో సిద్ధంచేసిన దుక్కిలో పైర్లు విత్తడం వల్ల మొక్కల సాంద్రత కావాల్సినంత ఉంటుంది. మొక్కలు బాగా పెరుగుతాయి.

### సేంద్రియ ఎరువులతో భూసారవృద్ధి
- భూమిలో సేంద్రియ ఎరువులు వేయడం వల్ల ఎన్నో మార్పులు జరుగుతాయి. మొదట సూక్ష్మజీవుల ఉత్పత్తి పెరుగుతుంది. వీటి వలన మొక్కలకు ఉపయోగపడే మార్పులు జరుగుతాయి.
- భూసారం పెరుగుతుంది. భూ భౌతిక స్థితి మెరుగుపడుతుంది. భూమి గుళ్ళ బారుతుంది. భూమిలో నీటిని, పోషక పదార్థాలను నిలువ ఉంచుకునే శక్తి పెరుగుతుంది.
- సూక్ష్మజీవుల ఉత్పత్తిచేసే హార్మోన్ వల్ల మొక్కల పెరుగుదల వృద్ధి చెందుతుంది. సూక్ష్మపోషక పదార్థాల లోపాలు సవరించబడుతుంది. చౌడు సమస్యను నివారించుకోవచ్చు.
- పంట నాణ్యత పెరుగుతుంది.చీడపీడలకు తట్టుకునే శక్తి పెరుగుతుంది. సూక్ష్మజీవులు వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరించి మొక్కలకు అందజేస్తాయి. పోషక పదార్థాలను మొక్కలకు అందజేస్తాయి.

### భూసార పరీక్షలకు అనుగుణంగా..


వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ముందే రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఆ పరీక్షల ఆధారంగా వేసే పంటకు మందులను తగు మోతాదులో వాడాలి. దీంతో రసాయన మందుల ఖర్చు తగ్గుతుంది. భూసార పరీక్షలు చేయించుకునేటప్పుడు రైతులు సరైన విధానాలను అనుసరించాలి. దీంతో మంచి ఫలితాలను పొందవచ్చు.

**- టి.యాదగిరిరెడ్డి,**
కేవీకే శాస్త్రవేత్త, గడ్డిపల్లి.9440481279

### సేంద్రియ ఎరువులు
1. పశువుల ఎరువు, కోళ్ళ ఎరువు, పట్టణ, వ్యర్థాలను కంపోస్ట్, వర్మికంపోస్ట్, పంట అవశేషాలను భూమిలో కలియ దున్నడం మొదలైనవి.

### పచ్చిరొట్ట ఎరువులు
**పచ్చిరొట్ట పైర్లు:** జనుము, జీలుగ, పిల్లి పెసర మొదలైనవి పెంచి భూమిలో కలియదున్నడం.
**పచ్చి ఆకు ఎరువులు:** గ్లైసీడియా కొమ్మలు, ఆకులు, కానుగ, జిల్లేడు, నేల తంగేడు, వెంపలి మొదలైనవి భూమిలో తొక్కి భూసారాన్ని పెంచుకోవచ్చు.
**జీవన ఎరువులు:** భూ సాంద్రతను మెరుగుపరిచి పంటల ఉత్పాదకతను పెంపొందించుకోవడానికి వివిధ పోషక పదార్థాలు లభ్యమయ్యే రసాయన, సేంద్రియ, జీవన ఎరువులను సమతుల్యంగా వాడటం చాలా అవసరం.
**నత్రజని జీవన ఎరువులు:** రైజోబియం, అజటోబాక్టర్, అజోస్పైరిల్లమ్, నీలి ఆకుపచ్చ శైవలాలు, అజోల్లా మొదలైనవి.
**భాస్వరపు జీవన ఎరువులు:** పాస్ఫో బాక్టీరియా, మైకోరైజా మొదలైనవి.

### జీవన ఎరువుల కలిగే వల్ల లాభాలు
- రసాయన ఎరువులతో పాటు జీవన ఎరువులను వాడటం వల్ల రసాయనిక ఎరువుల మోతాదు తగ్గించుకోవచ్చు.
- వాతావరణంలోని నత్రజనిని భూమిలో స్థిరీకరించి మొక్కలకు అందజేస్తాయి.భూమిలో స్థిరీకరించిన భాస్వరాన్ని మొక్కలకు అందుబాటులోకి తెస్తాయి.
- కొన్ని సూక్ష్మజీవుల హార్మోన్లు, విటమిన్లు, ఆక్సిన్‌ల విడుదలకు, మొక్కల పెరుగుదలకు తోడ్పడుతాయి.
- సగటున 10-12శాతం దిగుబడులు పెరుగుతాయి. నేల భౌతిక స్వభావాన్ని మెరుగుపరిచి భూసారాన్ని కాపాడుతాయి. తక్కువ ఖర్చుతో వాతావరణ కాలుష్యం కాకుండా జీవన ఎరువులను ఉపయోగించుకోవచ్చు.

**నట్టె కోటేశ్వర్‌రావు**, 9989944945
గరిడేపల్లి, సూర్యాపేట జిల్లా,


పూజా హెగ్డే

# భాగ్యనగరంలో..

అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్నది. జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి తర్వాత వీరిద్దరి కలయికలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని హారిక హాసిని క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఏప్రిల్‌లో ఈ సినిమా సెట్స్‌పైకి వచ్చింది. బుధవారం నుంచి హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను తెరకెక్కిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. నేటి నుంచి పూజా హెగ్డే చిత్రీకరణలో పాల్గొంటున్నట్లు తెలిపింది. 'అమేజింగ్ టీమ్‌తో కలిసి పనిచేస్తున్నందుకు గర్వపడుతున్నాను. క్రేజీ ఎంటర్‌టైనింగ్ సినిమా ఇది' అంటూ పూజా హెగ్డే ట్విట్టర్ ద్వారా ప్రకటించింది. కుటుంబ విలువలకు వినోదాన్ని మేళవిస్తూ త్రివిక్రమ్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఎస్. రాధాకృష్ణ, అల్లు అరవింద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# జీవితమే ఆట


తాప్సీ

'భారతీయ సినీ చరిత్రలో ఇప్పటివరకు రాని సరికొత్త కథాంశమిది' అని చెప్పింది తాప్సీ. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గేమ్ ఓవర్'. ఎస్.శశికాంత్ నిర్మిస్తున్నారు. అశ్విన్ శరవణన్ దర్శకుడు. ఈ నెల 14న ఈ చిత్రం విడుదలకానుంది. నిర్మాత మాట్లాడుతూ 'యానివర్సరీ రియాక్షన్ అనే మానసిక సమస్యతో బాధపడే ఓ యువతి కథ ఇది. జీవితమనే ఆటలో ఆమె ఎదుర్కొన్న మలుపులేమిటన్నది ఆకట్టుకుంటుంది. తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో ఏకకాలంలో 1200 స్క్రీన్స్‌లో ఈ సినిమాను విడుదల చేస్తున్నాం. హిందీలో దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. తాప్సీ నటన, పాత్ర చిత్రణ హైలైట్‌గా నిలుస్తాయి. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది' అని తెలిపారు. రొటీన్‌కు భిన్నమైన థ్రిల్లర్ చిత్రమిదని దర్శకుడు పేర్కొన్నారు.







